సమావేశము - IX
వాల్యూము - I
నెం. 6

వెల : రూ. 29-00
21 మార్చి, 2018
బుధవారం,
(శక సం. 1940,
చైత్ర శు. 4)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక

I. ప్రశ్నోత్తరాలు ... 1
II. ప్రత్యేక ప్రస్తావనలు ... 21
III. పిటిషన్స్ ... 22
IV. 2018 - 2019 సంవత్సరానికి వార్షిక ఆదాయ- వ్యయ పట్టిక(బడ్జెట్): ... 23
2018 -2019 సంవత్సరపు వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెట్)
పై సాధారణ చర్చకు ఆర్థిక మంత్రి / ముఖ్యమంత్రి గారి ప్రత్యుత్తరం.

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి.ఎన్. ప్రసన్నకుమారి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ బి. కమలాకర్ |
| | | శ్రీమతి అలివేలు |
| | | శ్రీ ఎమ్. కృపాకర్ రావు |
| | | శ్రీమతి బి. ప్రమీల |
| | | శ్రీమతి యస్. నాగమణి |
| | | శ్రీ డి. శ్రీనివాసులు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (తొమ్మిదవ సమావేశము - ఆరవ రోజు)

## బుధవారం, మార్చి 21, 2018

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్ః-** అందరికీ నమస్కారం. క్వశ్చన్ అవర్.

**మధ్యాహ్న భోజన పథకం**

ప్రశ్న నెం.2861(41)

డా. ఆర్. భూపతి రెడ్డి, ఎం.ఎల్.సి:- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం అమలులో కొన్ని జాప్యాలు ప్రభుత్వ దృష్టికి వచ్చిన విషయం వాస్తవమేనా;

ఆ)అయితే, ఆ వివరాలు ఏమిటి;

ఇ) కార్యక్రమ అమలును సమర్థవంతంగా పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రతిపాదన ఏదైనా వుందా?

**గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) (శ్రీ కడియం శ్రీహరి)ః-** అ) అవునండీ.

ఆ) అందించిన ఆహార నాణ్యతకు సంబంధించి అంటే మెనులో నిర్ణయించిన ప్రకారం ఆహారాన్ని అందించకపోవడం, బిల్లులను క్లెయిమ్ చేయడంలో దుర్వినియోగం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించేటప్పుడు సరియైన వ్యవస్థ కొరత వంటి కొన్ని సంఘటనలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. అట్టి కేసులన్నింటిలో బాధ్యులైన వ్యక్తులపై అంటే ప్రమేయం వున్న వంట చేసే ఏజెంట్లు లేదా ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయడానికి బాధ్యులైన హెడ్ మాస్టర్లు/టీచర్లపై చర్యను తీసుకోవడంతో పాటుగా విచారణలో రుజువైన దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేయడం అవుతుంది. 2017-18 కాలంలో కుకింగ్ ఏజెన్సీలు, కుక్స్ కం హెల్పర్లకు చెల్లింపులలో ఏదేని జాప్యాన్ని నివారించడానికి ముందస్తుగా సరిపడ బడ్జెట్‌ని విడుదల చేసి హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా కమీషనరు, డైరెక్టర్ కార్యాలయంలో క్రమ ప్రాతిపదికన పర్యవేక్షించడమయింది.

ఇ) ఈ కార్యక్రమాన్ని డిఇఓలు/ఎంఇఓలు తనిఖీ చేసి పర్యవేక్షించాలి. పాఠశాల ప్రాంతంలో పర్యవేక్షణకు పాఠశాల యాజమాన్య కమిటీలను కూడా బాధ్యులుగా చేయడమవుతుంది. అంతేకాకుండా గ్రామీణాభివృద్ధి జాతీయ సంస్థ (ఎన్ఐఆర్‌డి), గ్రామీణ అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో పనిచేస్తున్న సామాజిక అడిటు, జవాబుదారీతనం, పారదర్శకత కోసం సొసైటీ, సంచాలకులు వంటి సంస్థల ద్వారా మూడవ పార్టీ మదింపులు కూడా చేయడమైంది.

**డా. ఆర్. భూపతి రెడ్డి (స్థానిక సంస్థలు - నిజామాబాద్)ః-** అధ్యక్షా, ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం చాలా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం. దగ్గర, దగ్గరగా 40లక్షల మంది విద్యార్థులు రోజూ మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం ఇవ్వడం లేదు. ఆహారం కూడా నాణ్యత లోపిస్తుంది. పుచ్చిపోయిన కూరగాయలు పెట్టడం వల్ల కొన్ని చోట్ల ఫుడ్ పాయిజన్ కావడం జరిగింది. డిచ్‌పల్లిలోని బీబీపూర్ తాండాలో ఒక మోడల్ స్కూల్ ఉంది. ఆ పాఠశాలలో గ్రుడ్లు వారానికి రెండే ఇస్తున్నారని, ఫ్రూట్స్ ఇవ్వడం లేదని, ఆహారం బాగా ఉండడం లేదని వరుసగా వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయి. వరుస కథనాలు రావడంతో మేము వెళ్లి ఆ పాఠశాలను సందర్శించగా అందులోని పిల్లలందరు బయట నుండి క్యారియర్ తెచ్చుకోవడం గమనించాం. ఎందుకని అడిగితే అన్నం బాగానే ఉంది. కానీ, కూరలు సరిగా లేవని అక్కడి విద్యార్థులు తెలిపారు. కేవలం కూరలు ఇంటి నుండి తెచ్చుకుందామన్నా ఏజెన్సీ వారికి సమస్యలు వస్తాయని పిల్లల్ని కూరలు తెచ్చుకోనివ్వడం లేదు.

క్వాలిటీ ఫుడ్ లేనట్లుగా మేము కూడా గమనించడం జరిగింది. ఆ విషయాన్ని మేము కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ గారి ఆదేశాలతో ఎం.ఈ.ఓ. గారు వచ్చి తనిఖీ చేసినప్పటికీ, అక్కడ ఎటువంటి మార్పులు రాలేదు.

ప్రభుత్వమేమో అధిక నిధులు వెచ్చించి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తోంది. ఇది పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన విషయం. కాబట్టి, నేను దీనికి ఒక సరైన మానిటరింగ్ సిస్టమ్ లేదని భావిస్తున్నాను. దీనికి విజిలెన్స్ లాగా ఒక ఇండిపెండెంట్ బాడీని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు గానీ, ఎం.ఈ.ఓ.లు గాని పర్యవేక్షిస్తున్నప్పటికీ ఏజెన్సీ వారు వినడం లేదు. లోకల్ సర్పంచ్ గానీ, ఇతరత్రా రాజకీయ నాయకులు కల్పించుకొని ఏజెన్సీ వారు వినకుండా చేస్తున్నారు. జిల్లా లెవల్‌లో ఒక స్క్వాడ్ లాగా ఏదైనా ఏర్పాటు చేసి, ఏదైనా నోటీస్ వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకునేటట్లు ఉంటే గానీ ఈ వ్యవస్థ సరికాదు. ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. పిల్లల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కాబట్టి, తగిన చర్యలు చేపట్టాలని మీద్వారా గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారిని కోరుతున్నాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం - మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్):-** అధ్యక్షా, కొన్ని జాప్యాలు ప్రభుత్వ దృష్టికి వచ్చిందా అని అడిగితే వాస్తవమే అని గౌరవ మంత్రివర్యులు అంగీకరించడం జరిగింది. పాఠశాలల్లో పని చేస్తున్న ఏజెన్సీలుగా ఎవరైతే పని చేస్తున్నారో, ఆ ఏజెన్సీలు ప్రధానోపాధ్యాయుల అజమాయిషీలో లేరు. తమిళనాడు మాదిరిగా ఒక ప్రత్యేక ప్రతిపత్తి గల ఏజెన్సీలను ఏర్పాటు చేస్తే వారు జవాబుదారి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. అటువంటిదేమైనా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదా అని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పాఠశాలల్లో ఉన్నటువంటి మెనూ కూడా సరిపోవడం లేదని గౌరవ పౌర సరఫరాల శాఖ మంత్రి గారికి పిల్లలకు సరిపోయే రీతిగా బియ్యం ఎక్కువగా ఇవ్వాలని రిక్వెస్ట్ చేయడం జరిగింది. కాబట్టి, ఆ మెనూ పెంచేటటువంటి ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందా అని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ ఎన్. రామచంద్ర రావు (పట్టభద్రుల నియోజక వర్గం - మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):-** అధ్యక్షా, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా కొన్ని ఏజెన్సీలే వంట చేయడం కాకుండా ఇతర రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో అక్షయ పాత్ర, సత్యసాయి సేవా సమితి లాంటి ఎన్.జి.ఓ.ల ద్వారా వంట చేయిస్తున్నారు. అలాంటి ఎన్‌జిఓల సహాయం మన ప్రభుత్వం కూడా ఏమైనా తీసుకుంటుందా అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:-** అధ్యక్షా, రాష్ట్రవ్యాప్తంగా 28,623 పాఠశాలల్లో 23,87,751మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు గౌరవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్యాహ్న భోజనానికి కూడా సన్న బియ్యాన్ని ఇవ్వడం జరుగుతున్నది. దానితోపాటుగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా పేద విద్యార్థులు కాబట్టి, వారికి పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలనే ఆలోచనలో భాగంగా వారానికి మూడు గ్రుడ్లు కూడా ప్రత్యేకంగా మన రాష్ట్రంలోనే ఇవ్వడం జరుగుతోంది. ఇక క్వాలిటీ ఫుడ్ గురించి వస్తే, ఈ మధ్యాహ్న భోజనం సప్లిమెంటేషనే. పూర్తి స్థాయిలో మధ్యాహ్న భోజనాన్ని మనం అందించడం లేదు. దయచేసి అందరు కూడా అర్థం చేసుకోవాలి. కుకింగ్ కాస్ట్ కూడా చాలా తక్కువగా ఉంటుంది. వేరే హాస్టల్స్‌తో గానీ, వేరే రెసిడెన్షియల్ స్కూల్స్‌తో గానీ, వేరే సంస్థలతో పోల్చితే మధ్యాహ్న భోజనానికి అయ్యే cooking cost is very minimum. కాబట్టి, హాస్టల్స్‌తోనీ, ఆ రెసిడెన్షియల్ స్కూల్స్‌తో పోల్చుకొని అదే స్థాయిలో పోషక విలువలుండాలి, ఆ రకమైన మధ్యాహ్న భోజనం ఉండాలి అని అంటే కొంచెం కష్టంతో కూడుకున్న పని. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకం. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కలిపి ఈ పథకాన్ని కొనసాగిస్తున్నాము.

ఎవరైతే పేద వర్గాలకు చెందిన పిల్లలు పాఠశాలలకు వస్తున్నారో, కాలే కడుపులతో పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలనే ఆలోచనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగింది. అయితే, ఈ పథకం కూడా కేవలం ఒకటో తరగతి నుండి 8వ తరగతి వరకు చదివే పిల్లలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం వర్తింపజేస్తోంది. అది కూడా 60:40 రేషియోలోనే. కానీ, తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి 9వ తరగతి, 10వ తరగతి పిల్లలకు మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చు మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. అదే విధంగా వారానికి మూడు కోడి గ్రుడ్లు ఇచ్చే ఖర్చును కూడా రాష్ట్రప్రభుత్వమే భరిస్తున్నది. సన్న బియ్యానికి సంబంధించిన

ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు మన బిడ్డలే కాబట్టి, మంచి ఆహారం అందించాలనే ఆలోచనతోనే తెలంగాణ ఏర్పడిన అనంతరమే ఈ మూడు ఇంటర్‌వెన్షన్స్ వచ్చాయి. వారానికి మూడు కోడి గ్రుడ్లు ఇవ్వడం గానీ, 9వ తరగతి, 10వ తరగతి పిల్లలకు మధ్యాహ్న భోజనం అంతకు ముందు పెట్టారు, దానిని మనం కంటిన్యూ చేస్తున్నాము. అదేవిధంగా సన్నబియ్యం ప్రోగ్రామ్‌ను మనం టేకప్ చేయడం జరుగుతున్నది.

ఇంత పెద్ద పథకం యొక్క ఖర్చు పరంగా ఆలోచిస్తే, మిడ్ డే మీల్ మీద సంవత్సరానికి రూ.677కోట్లు ఖర్చు అవుతున్నది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది రూ.300కోట్లు మాత్రమే. మిగతా రూ.377కోట్లు మనమే భరిస్తున్నాము. వాస్తవంగా 60:40 రేషియో ప్రకారంగా భరించాల్సి ఉన్నప్పటికీ, కానీ, మన రాష్ట్రంలో జరుగుతున్న ఖర్చులో 60శాతం మనం భరిస్తున్నాము, 40 కేంద్ర ప్రభుత్వం భరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలోని ఒక కమిటీకి నేను ఛైర్మన్‌గా ఉన్నాను. ఈ మిడ్ డే మీల్స్ స్కీమ్‌ని ఇంటర్‌మీడియట్ వరకు గానీ, 10వ తరగతి వరకు ఎక్స్‌టెండ్ చేయాలని అనేక సందర్భాలలో నేను కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఒకవేళ ఇంటర్‌మీడియట్ వరకు కాకున్నా కూడా కనీసం 10వ తరగతి వరకైనా ఎక్స్‌టెండ్ చేయాలని కోరాను. కానీ, కేంద్ర ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని తమరిద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు వారానికి మూడు కోడిగ్రుడ్లు ఇవ్వడం ద్వారా మనకు రూ.90కోట్ల అదనపు భారం పడుతోంది. ఇలాంటి అదనపు ఖర్చులకు వెనకాడకుండా ఈ ప్రయత్నాలు చేస్తున్నామని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అంతే కాకుండా వారంలో ఆరు రోజులకు సంబంధించి ఇచ్చిన కాస్టుకు లోబడే ఒక మెనూను తయారు చేసి అన్ని పాఠశాలలకు పంపించడం జరిగింది. ఆ మెనూని అనుసరించాలని చెప్పాము. కాకపోతే సూపర్‌వైజరీకి సంబంధించిన నెట్‌వర్క్ సరిగా లేదు. గౌరవ సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గారు, శ్రీ ఆర్. భూపతి రెడ్డి గారులు చెప్పిన మాట వాస్తవం. కాబట్టి, ఈ సూపర్‌వైజరీ నెట్‌వర్క్‌ను పెంచుకోవాలని ప్రయత్నం చేస్తున్నాము. ప్రతిరోజు ప్రతి పాఠశాలలో ఎంతమంది పిల్లలు భోజనం చేస్తున్నారో వెంటనే వాట్సప్ మెసేజ్‌లో రాష్ట్ర కేంద్ర కార్యాలయానికి తెప్పించుకుంటున్నాము. ఆవిధంగా ప్రతిరోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఎంతమంది పిల్లలు మధ్యాహ్న భోజనం చేస్తున్నారనే సమాచారాన్ని సేకరించడం జరుగుతున్నదని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు మాట్లాడుతూ, అక్షయ పాత్ర లాంటి సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టవచ్చు కదా అని అన్నారు. కొన్ని జిల్లాలలో ఇప్పటికే అక్షయ పాత్ర ద్వారా ఆ కార్యక్రమాలు చేయడం జరుగుతున్నది. త్వరలో వరంగల్ అర్బన్ జిల్లా మొత్తంగా కూడా అక్షయ పాత్ర ద్వారా మధాహ్న భోజనం తయారు చేయించే ఏర్పాటు ఈ జూన్ మాసం నుండి చేయడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. ఏదేమైనా మధ్యాహ్న భోజనానికి సంబంధించి పిల్లలకు సాధ్యమైనంత మేరకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించే ప్రయత్నం చేస్తాం. ఏ రకమైన అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. విజిలెన్స్ వింగ్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. అది సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేయించాలా, విద్యాశాఖ ద్వారా చేయించాలా అనేది ఆలోచించి ఒక విజిలెన్స్ వింగ్‌ను కూడా ఈ మధ్యాహ్న భోజన పథకం అమలయ్యే విధంపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి మాకు సూచనలు ఇచ్చే విధంగా ఒక ప్రత్యేకమైన విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పి తమరిద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ నారదాసు లక్ష్మణరావు (స్థానిక సంస్థలు – కరీంనగర్):–** అధ్యక్షా, మధ్యాహ్న భోజనం పెట్టడమనేది చాలా సంతోషించదగ్గ విషయం. అయితే, పాఠశాలల్లో వంట చేస్తున్న వారు చాలా చోట్ల చెట్ల క్రిందనే, ఆరు బయట అది కూడా కట్టెలతో వంట చేస్తున్నారు. దాంతో పాఠశాల అంతా పొగ వ్యాపించడం జరుగుతోంది. వంట పాత్రలన్నీ కూడా ఓపెన్ ప్లేస్‌లో పెట్టడం వల్ల వంటలు కలుషితమయ్యే అవకాశం కలుగుతున్నది. వంట చేసే సిబ్బంది కూడా సరిగా లేరు, దానికి సంబంధించి వంట కూడా సరిగా లేవు. కనుక వంటశాలలు ఏర్పాటు చేస్తూ, తగిన సిబ్బందిని మరియు పాత్రలు కూడా సమకూర్చినట్లయితే పరిశుభ్రంగా వంట చేసే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాలు కల్పించేందుకు పరిశీలించాల్సిందిగా మీద్వారా గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, రాష్ట్రంలో దాదాపు 7080 పాఠశాలల్లో కిచెన్ షెడ్స్ నిర్మాణానికి రూ.146కోట్లు మంజూరు చేయడం జరిగింది. ఇందులో విద్యాశాఖ నుండి

55శాతం, నరేగా నుండి 45శాతంతో నిధులకు మంజూరు ఇవ్వడం జరిగింది. ఆ పనులు జరుగుతున్నాయి. అదే విధంగా అన్ని మోడల్ స్కూల్స్‌కి కూడా కిచెన్ షెడ్స్ కొరకు మంజూరు ఇవ్వడం జరిగింది. అవి కూడా పనులు జరుగుతున్నాయి. చాలా వరకు జూన్ 1వ తేదీ లోపల అన్ని పాఠశాలల్లో కిచెన్ షెడ్స్ నిర్మాణం పూర్తి చేయాలనే ఆదేశాలు స్పష్టంగా ఇవ్వడం జరిగింది. దానికి తోడుగా చాలా పాఠశాలల్లో ఇప్పటికే కుకింగ్ గ్యాస్ ద్వారా వంట చేయడం జరుగుతున్నది. కొన్ని ప్రదేశాలలో మాత్రం ఇప్పటికీ కూడా కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తున్నారు. ఆ కట్టెల పొయ్యి మీద వంటలు చేసే అన్నింటిని కూడా పౌర సరఫరాల మంత్రి గారితో మాట్లాడి కుకింగ్ గ్యాస్ కూడా సరఫరా చేసే ఏర్పాటు చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## హుస్సేన్ సాగర్ వద్ద తెలంగాణ అమరవీరుల స్మృతి చిహ్నం

ప్రశ్న నెం.2707(42)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎం.ఎల్.సి.,:- గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ వద్ద తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించాలని నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి;

ఇ) దీని నిమిత్తం కేటాయించిన భూమి వివరాలేమిటి;

ఈ) దానిని ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వర రావు):-** అ) అవునండీ.

ఆ) ప్రభుత్వం 17-6-2017 తేదీ గల రవాణా, రోడ్లు, భవనాలు(భవనాలు) శాఖ జి.ఓ.ఆర్‌టి నెం.330 ద్వారా రూ.80.00కోట్లకు పరిపాలక మంజూరునిచ్చింది. అంతేకాక 17-6-2017 తేదీగల రవాణా, రోడ్లు, భవనాలు(భవనాలు) శాఖ జి.ఓ.ఆర్‌టి నెం.340 ద్వారా ఈ పని నిమిత్తం కన్సల్టెంట్లుగా శ్రీ ఎం.వి.రమణారెడ్డి - మెసర్స్ తనికెళ్ల ఇంటిగ్రేటెడ్ కన్సల్టెంట్ ప్రైవేటు లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒక జాయింట్ వెంచర్‌ను నియమించింది. కన్సల్టెంటు సంభావిత డిజైన్ల (ప్రమిద వంటివి)ను రూపొందించగా, వీటిని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆమోదించారు. టెండర్లను రెండు వారాల లోపు ప్రారంభించడమవుతుంది.

ఇ) హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నియంత్రణ క్రింద ఉండి, లుంబినీ పార్కుకు ఆనుకుని ఉన్న 3.29 ఎకరాల భూమిని కేటాయించడమయింది. రోడ్లు భవనాలు డెవలప్‌మెంట్ అథారిటీ కమీషనర్‌ను కోరింది.

ఈ) హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుండి భూమిని తీసుకున్నవెంటనే, పనిని ప్రారంభించి 12 నెలల లోపు పూర్తి చేయడమవుతుంది.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):-** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం కొరకు తొలి మరియు మలి దశలలో జరిగిన ఉద్యమంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని తమ ప్రాణాల్ని వదిలి, తమ కుటుంబ సభ్యుల కొరకు కాదు, తమ కోసం కాదు, రాష్ట్రం రావాలి తద్వారా ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి ఆర్థిక అసమానతలు చెరిగిపోవాలనే ఒక నిస్వార్థపూరితమైన త్యాగం ఇప్పటికే చనిపోయినటువంటి వారిని అమరులు చేయడం జరిగింది. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో మీరు, అదేవిధంగా సభలో ఉన్నటువంటి చాలామంది, అంతెందుకు సాక్షాత్తు ఇక్కడ మంత్రులుగా ఉన్నటువంటి శ్రీ జి. జగదీష్‌రెడ్డి గారు, శ్రీ కె. తారక రామారావు గారు తదితరులంతా కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రతి రోజు ఎవరెపుడు చనిపోతారో తెలియనటువంటి పరిస్థితి. రోజుకో శవాన్ని తీసుకొనిపోయి వారి కుటుంబ సభ్యులకి అప్పగిస్తూ ఉన్నటువంటి చాలా బాధాకరమైన రోజుల్ని గడిపాం.

అటువంటి వారిని గుర్తు చేసుకోవడం అవసరం. తెలంగాణ అంటేనే ఒక చరిత్ర. చరిత్రలో ప్రధానంగా గుర్తుంచుకోవలసినటువంటి వారు తెలంగాణ అమరులు. వారి అమరత్వం ఆకాశమంత. వారి అమరత్వానికి గుర్తుగా ప్రభుత్వం తీసుకున్నటువంటి చర్యకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎంత విస్తీర్ణంలో ఆ నిర్మాణం చేపడుతున్నారనేది మరియు ప్రపంచం నలుమూలల నుండి తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్‌కు ఎవరైనా వచ్చినట్లయితే తప్పకుండా అమరవీరుల స్థూపాన్ని, అమరవీరులకు సంబంధించిన ఆ చారిత్రక విషయాల్ని తెలుసుకోకుండా తిరిగి పోలేని విధంగా అద్భుతమైన నిర్మాణం జరగాలని కోరుతున్నాను. అలాగే అమరవీరులను గుర్తు చేసుకొంటూ ఒక చక్కటి డాక్యుమెంటరీ తయారు చేస్తున్నారని ఈ మధ్య వార్తా పత్రికల్లో చూడడం జరిగింది. అటువంటి డాక్యుమెంటరీ ప్రదర్శన కొరకు ఒక మినీ థియేటర్‌ని ఏర్పాటు చేయాలని, ఒక లైబ్రరీ, ఒక ఆడిటోరియం కూడా ఏర్పాటు చేయాలని

మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అందులోకి వస్తే తెలంగాణ చరిత్ర తెలుసుకొని అమరులను గుర్తు చేసుకొని పోయేట్లుగా అది కట్టబడితే తప్పకుండా వారి అమరత్వానికి విలువుంటుందని తెలియజేస్తున్నాను. కాబట్టి, ఎటువంటి నిర్మాణం చేపడుతున్నారో తెలియజేయాల్సిందిగా కోరుతున్నాను. హుడా నుండి స్థల సేకరణ కొరకు అడిగారని చెప్పారు. వారు ఆ స్థలాన్ని అప్పగించారా, లేదా తెలియజేయాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

10.20 ఉ.

**శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయుల నియోజక వర్గం - వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):-** అధ్యక్షా, ఆనాడు కెసిఆర్ గారి నాయకత్వంలో ఉద్యమకారులు, అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఈరోజు మనమందరం కౌన్సిల్‌లో కూర్చున్నాం. గౌరవ ముఖ్యమంత్రి గారు చరిత్రలో నిలిచిపోయే విధంగా రూ.80 కోట్లతో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేస్తున్నందుకు ప్రత్యేకంగా వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదొక పార్కులాగ నిత్యం వందలాది మంది సందర్శించే విధంగా, వాళ్లందరి స్మృతుల్లో మిగిలే విధంగా ఉండాలని, సాధ్యమైనంత తొందరలో నిర్మాణం జరగాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యుల ఆలోచన మేరకే గౌరవ ముఖ్యమంత్రి గారు దీనిమీద శ్రద్ధ తీసుకొని ప్రత్యేకమైన డిజైన్ కూడా చేయించారు. గౌరవ సభ్యుల ఆలోచనకు అనుగుణంగా ఈ స్మారక స్థూపం, ఒక జ్వాలా దీపం ఆకృతిలో తీర్చిదిద్దబడింది. రెండు బేస్‌మెంట్ అంతస్తులు, వాహనాల పార్కింగ్ సదుపాయం కూడా కల్పించబడింది. మొదటి అంతస్తులో మ్యూజియం, ఛాయాచిత్ర ప్రదర్శనశాల, దృశ్య, శ్రవణ మందిరాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. రెండవ అంతస్తులో 700 మంది పట్టేవిధంగా కన్వెన్షన్ హాల్ కూడా ప్రతిపాదించడం జరిగింది. టెరస్ మీద రెస్టారెంట్, కొంతమేర ప్రకృతి దృశ్యాలు వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక రచించబడింది. దీనికొరకు మొత్తం 3 ఎకరాల 29 గుంటల స్థలాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు కేటాయించడం జరిగింది. Forum for Better Hyderabad అనే స్వచ్ఛంద సంస్థ కోర్టులో వ్యాజ్యం వేసింది. దానిని క్లియర్ చేయడానికి అడ్వకేట్ జనరల్ ప్రత్యేకంగా అటెండ్ అవుతున్నారు. ఆ ఇష్యూ పూర్తి కాగానే వెంటనే ఆ స్థలాన్ని సేకరించి నిర్మాణ పనులు త్వరితంగా మొదలుపెట్టడం జరుగుతుందని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

## పుణ్యక్షేత్రాలకు మినీ ఆర్.టి.సి. బస్సుల సేవలు

ప్రశ్న నెం.2601(43)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి మరియు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్రంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు మినీ బస్సు సర్వీసులను నిర్వహించాలనే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి;

ఇ) జంట నగరాల వివిధ రెసిడెన్షియల్ కాలనీల నుండి యాదాద్రి, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, బాసర, భద్రాచలం మున్నగు వంటి పుణ్యక్షేత్రాలకు మినీ బస్సు సర్వీసులను నిర్వహించాలనే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఈ) అయితే, ఈ విషయంలో చేపడుతున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రి (శ్రీ పి. మహేందర్ రెడ్డి):-** అ) అవునండీ.

ఆ) రోజంతా 15 నిమిషాల వ్యవధితో యాదాద్రి బస్ స్టేషన్ నుండి గుట్టపై దేవాలయం వరకు 4 మినీ బస్సులు నిర్వహణలో ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్ స్టేషన్ నుండి యాదాద్రి దేవాలయం వరకు 3 మినీ ఏసి బస్సులను నిర్వహించడానికి ప్రతిపాదనలను ఖరారు చేయడమయింది.

ఇ) అవునండీ.

ఈ) యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, కొమురవెల్లి, ధర్మపురి, భద్రాచలం, బాసర, ఆలంపూర్, సోమశిల, రామప్ప దేవాలయం, హన్మకొండలోని భద్రకాళి దేవాలయం, ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైలం వంటి వివిధ పుణ్యక్షేత్రాలకు వివిధ కాలనీల నుండి వర్తింపు చేస్తున్న జంట నగరాల నుండి కార్యకలాపాల కోసం మినీ ఏసి సేవలతో 8 ప్యాకేజీ టూర్స్‌ను పర్యాటకులకు ప్రాధాన్యత ఉన్న అనంతగిరి, నాగార్జున సాగర్‌కు 2 ప్యాకేజీ టూర్స్‌ను ఖరారు చేయడమయింది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ మంత్రి గారే స్వయంగా సమాధానమిచ్చారు. అయినప్పటికీ కూడా మాకు కొన్ని సందేహాలు వస్తున్నాయి. ఒకటి - తెలంగాణ రాష్ట్రం వస్తే తెలంగాణలో ఉన్న దేవాలయాలకు ప్రత్యేకమైన బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పడం జరిగింది. ప్రస్తుతం మన దేవాలయాలకు వివిధ కాలనీల నుండి భక్తులు వస్తుంటారు. కాబట్టి యాదగిరి గుట్ట, కొలనుపాక, కొమురవెల్లి మరియు వర్గల్ సరస్వతీ వంటి దేవాలయాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు

చేస్తే one day circuit tour అవుతుంది. అటువంటి circuit tours ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదా? రెండు – అనంతగిరి కొండలు, వరంగల్ జిల్లాలోని చారిత్రక కట్టడాల వంటి దేవాలయాలకు కూకట్‌పల్లి, వనస్థలిపురం వంటి కాలనీల నుండి నేరుగా సెలవుల సందర్భంగా వస్తుంటారు. కాబట్టి అటువంటి ప్రదేశాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. ఆ రెండు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయా? అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):–** అధ్యక్షా, ప్యాకేజ్ టూర్స్ ఖరారు అయ్యాయని చెప్పారు. అయితే, అవి ఎప్పటి నుండి మొదలు పెడతారు? నిజానికి మా పాతూరి సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్లు, ఆ దేవాలయాలకు దగ్గర ఉన్న కాలనీల గురించే చెప్పారు. మనం మరొక ఆలోచన కూడా చేయవచ్చు. ఈ రాష్ట్రంలో ఉన్న పుణ్య క్షేత్రాలన్నింటికీ కలిపి ఒక ప్యాకేజ్ లాగా చేసినట్లయితే చాలా అద్భుతంగా ఉంటుంది. ఇవ్వాళ వేములవాడ, భద్రాచలం వంటి పుణ్య క్షేత్రాలన్నింటినీ రెండు రోజులో, మూడు రోజులో ప్యాకేజ్ లాగా పెట్టుకొని చేసినట్లయితే నష్టం జరగకుండా బ్రహ్మాండంగా చేయవచ్చు. రెండు – ఇవ్వాళ దాదాపు 50 వేల నుండి లక్ష మంది భక్తులు దేవాలయాలను సందర్శిస్తున్నారు. అందులో ప్రత్యేకంగా యాదగిరి గుట్టకు శుక్ర, శని, ఆదివారం దినములలో ఎక్కువగా ఏర్పాటు చేయవచ్చు. మిగతా రోజులలో కూడా ఆయా ప్రదేశాలనుండి బస్సులను ఏర్పాటు చేసినట్లయితే లాభం జరుగుతుంది. కాబట్టి తొందరగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు (స్థానిక సంస్థలు – హైదరాబాద్):–** ధన్యవాదాలు అధ్యక్షా, మినీ బస్సు అంటే సెట్విన్ బస్సు గుర్తొస్తుంది. హైదరాబాద్‌లో సెట్విన్ సంస్థ 1979 సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వపరంగా ఆ సెట్విన్ బస్సులను నడిపే వంద మంది నిరుద్యోగ యువకులకు ఫైనాన్షియల్ సపోర్ట్ ఇచ్చి, వారు పెరిఫెరల్ ఏరియాలలో ఆపరేట్ చేయడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. కానీ రోజులు గడిచిన తర్వాత వాళ్ల ఆపరేషన్ కేవలం హైదరాబాద్ కోర్ సిటీ వరకే పరిమితం చేశారు.

ఇంతకుముందు సెట్విన్ బస్సులు యాదగిరి గుట్ట, జహంగీర్ దర్గా, పటాన్‌చెరు వంటి ప్రాంతాలకు వెళ్లేవి. కాబట్టి వారికి viability, feasibility ఉండేది. కానీ ఈరోజు ప్రభుత్వం అటువంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఆ సెట్విన్ బస్సులను నిలిపి వేసినందుకు వారు చాలా ఇబ్బందులో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ పేద కుటుంబాల వారే ఆ సెట్విన్ బస్సులను ఎక్కువగా నడుపుతుంటారు. ఇంతకుముందు ప్రత్యేక ప్రస్తావనలో దానికి సంబంధించి అటువంటి ప్రదేశాలకు వెళ్లడానికి అవకాశం ఇస్తామని గౌరవ మంత్రి గారు హామీ కూడా ఇచ్చారు. కాబట్టి ఈ సెట్విన్ బస్సులు ఆయా ప్రదేశాలలో నడపడానికి ఏదైన ప్రతిపాదన ఉన్నదా? ఉంటే హామీ ఇవ్వవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఫారూక్ హుస్సేన్ (నామినేటెడ్):–** అధ్యక్షా, నేను నాలుగు రోజులకు ఒకసారి సిద్ధిపేటకు వెళ్లి వస్తుంటాను. హైదరాబాద్ నుండి కొమురవెల్లి, వర్గల్, వేములవాడ వంటి ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. ఆ రూట్లో సరైన బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఎంతో మంది బీదవారు, ఆటోలలో వెళ్లడం వల్ల ఇసుక లారీలు తగిలి ప్రమాదాలకు గురవుతుంటారు. కాబట్టి; మంత్రి గారిని నేను కోరేది ఏమిటంటే, వేములవాడ, కొమురవెల్లి, వర్గల్‌లోని సరస్వతి వంటి దేవాలయాలకు ఒక మినీ బస్సు సౌకర్యం కల్పిస్తే వందలాది మంది క్షేమంగా వెళ్లి, క్షేమంగా తిరిగి రాగలుగుతారు. కాబట్టి మినీ బస్సులను ఏర్పాటు చేయవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పి. మహేందర్ రెడ్డి:–** అధ్యక్షా, మన రాష్ట్రంలో మొత్తం 100 నాన్ ఏసి, 230 ఏసి మినీ బస్సులున్నాయి. వరంగల్ నుండి హైదరాబాద్, నిజామాబాద్ నుండి హైదరాబాద్‌కు ఈ బస్సులు నడుస్తున్నాయి. అయితే, గౌరవ సభ్యులు పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పించమని చెప్పడం జరిగింది. వారు కోరినట్లు తప్పకుండా అన్ని ప్రాంతాలకు మినీ బస్సులను ఏర్పాటు చేస్తాం. ఎప్పటి నుండి ప్రారంభిస్తారని గౌరవ సభ్యులు అడిగారు. వచ్చే నెల ఏప్రిల్ 1వ తేదీ నుండి ఒక ప్రణాళిక చేసుకొని బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుంది. కిలోమీటరుకు 28 పైసలు పడుతుంది. అలాగే గౌరవ సభ్యులు శ్రీ ఎం.ఎస్ ప్రభాకర్ రావు గారు సెట్విన్ బస్సుల గురించి అడిగారు. ఆయా బస్సులకు సంబంధించి మా పరిధిలో ఎంత వరకు ఉందో, ఆలోచించి పరిశీలిస్తాం.

## BUS SHELTERS AND BUS BAYS IN G.H.M.C. LIMITS

LCQ No. 2850 (44)

Sri Syed Aminul Hasan Jafri, MLC:- Will the Minister for Information Technology, Municipal Administration & Urban Development be pleased to state:

a) whether it is a fact that many areas in the Greater Hyderabad Municipal Corporation limits are not having proper Bus shelters and Bus Bays;

b) if so the details thereof;

c) the measures being taken to provide Bus Shelters and Bus Bays in Hyderabad particularly in Old City;

d) whether it is also a fact that the setting-up of Bus Shelters has been entrusted to a private agency;

e) if so, the time by which they will be provided?

**MINISTER FOR MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (SRI K. TARAKA RAMA RAO):** a)&b) No Sir, 1221 bus shelters are existing within GHMC limits and further 47 sites have been identified for development of bus bays.

c) The GHMC has called a request for proposal (RFP) for consideration of (826) modern bus shelters. The project divided into four packages from which three agencies emerged as successful bidders The Letter of Award (LoA) has been issued and concession agreement was entered with successful bidders. There are (85) modern bus shelters are being constructed in South Zone of GHMC.

d)&e) Yes sir. Construction of (826) modern bus shelters taken up under Public Private Partnership(PPP) framework by engaging Private Developer on Design, Build, Finance, Operation & Transfer (DBFORT) basis. As per the terms and conditions of the Concession Agreement, the concessionaries shall construct the bus shelters within (180) days from the appointment date.

SYED AMINUL HASAN JAFRI (LOCAL BODIES - HYDERABAD):-

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): میں Bus Shelters کے بارے میں پوچھنا چاہتا ہوں' Transport Minister صاحب' ہاؤز میں موجود ہیں۔ میں سوال دونوں منسٹرس سے کرنا چاہوں گا کہ ایک حیدرآباد میں جی ایچ ایم سی علاقہ میں T.S.R.T.C کے services جو چل رہے ہیں' وہ کتنے routes پر چل رہے ہیں۔ اور کتنی بسس چل رہی ہیں؟ حیدرآباد میٹرو زون میں روزآنہ T.S.R.T.C سے کتنے passengers سفر کرتے ہیں۔ اس کے لحاظ سے کتنے Bus Shelters کی ضرورت ہے۔ چیرمین صاحب فی الوقت GHMC کا علاقہ 625 Sq Km سے زیادہ ہے۔ اور جی ایچ ایم سی میں 1 کروڑ کی آبادی ہے۔ میرا یہ اندازہ ہے کہ حیدرآباد میں T.S.R.T.C بسوں میں روزآنہ 20 لاکھ passengers travel کرتے ہیں۔

جناب چیرمین (Janab Chairman): کیا پورے تلنگانہ میں روزآنہ 20 لاکھ passengers travel کرتے ہیں؟

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): نہیں چیرمین صاحب صرف GHMC میں روزآنہ 20 لاکھ passengers travel کرتے ہیں۔ اور جی ایچ ایم سی میں جو fleet ہے صرف ایک حیدرآباد یعنی جی ایچ ایم سی علاقہ میں 3,850 بسوں کی جو fleet ہے' اس میں 1,000 سے زیادہ بسیں بہت پرانی ہوچکی ہیں' ان بسوں کو بدلنا ضروری ہے۔ شہر میں MMTS & MRTS رہنے کے باوجود 80%,85% پبلک کو T.S.R.T.C منتقل کر رہی ہے تو ان حالات میں یہ ضروری ہے کہ آپ T.S.R.T.C پر زیادہ توجہ دیں اور اس میں میٹرو زون کی جو ضرورت ہے اس کو پورا کرنے کے لئے زیادہ سے زیادہ فنڈس منظور کریں۔ آپ نے بتایا کہ نئے Bus Shelters کے لئے معاہدہ کیا گیا ہے۔ اس میں ایک condition یہ لگایا گیا کہ کام کو 6 ماہ میں مکمل کرنا ہوگا۔ میں یہ معلوم کرنا چاہتا ہوں کہ یہ معاہدہ کب ہوا' اور اس کام کو کب تک مکمل کرلیا جائے گا؟

**శ్రీ కర్నె ప్రభాకర్‌:–** అధ్యక్షా, హైదరాబాద్‌ జిహెచ్‌ఎంసి పరిధిలో ఉప్పల్‌ నుండి ఎల్‌.బి.నగర్‌ వరకు, ఎల్‌.బి నగర్‌ నుండి హాయత్‌నగర్‌ వరకు ఉన్న రోడ్లన్ని రద్దీగా ఉంటాయి. అదే విధంగా పేద మరియు మధ్య తరగతి ప్రయాణికులు ప్రయాణించే మార్గం. ఇంతకు ముందు గౌరవ సభ్యులు జాఫ్రీ గారు ఓల్డ్‌ సిటీలో ఉన్నటువంటి పరిస్థితుల గురించి చెప్పారు. అటువంటి ప్రయాణికులే ఆటోలు మరియు బస్సులను ఆశ్రయించి ప్రయాణం చేస్తుంటారు. మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరేది ఏమిటంటే, గతంలో కూడా కొన్ని సందర్భాలలో గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చాను. అక్కడ ఉన్నటువంటి సర్వీసు రోడ్డునే పునరుద్ధరించి, ఆ సర్వీసు

రోడ్డులో బస్‌బే మరియు బస్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ ద్వారా మంత్రిగారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వస్తున్నాను.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి (స్థానిక సంస్థలు - మెదక్):-** అధ్యక్షా, హైదరాబాద్ జిహెచ్‌ఎంసి పరిధిలో బిహెచ్‌ఇఎల్ నుంచి పటాన్‌చెరు వరకు ఆరు, ఏడు బస్టాపులే ఉన్నాయి. కొత్త బస్టాపుల నిర్మాణం ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. ఆ ప్రాంతంలో చాలా జనాభా ఉండడం వల్ల వానాకాలం, వేసవి కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. కాబట్టి ఎక్కడైతే జనాభా ఎక్కువగా ఉంటుందో, అక్కడ బస్ షెల్టర్లు నిర్మాణం చేస్తే బాగుంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు:-** అధ్యక్షా, మోడ్రన్ బస్ షెల్టర్లు అంటున్నారు. అందులో వైఫై, ఎయిర్ కండిషన్స్ వంటి సౌకర్యాలు ఉంటాయా? దయచేసి చెప్పవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు జాఫ్రీ గారు ప్రశ్నేమో బస్ షెల్టర్ల గురించి అడిగారు, మొత్తం వివరాలేమో బస్సుల గురించి, ప్రయాణికుల గురించి అడిగారు. నా దగ్గర ఉన్న సమాచారం వరకు చెప్పే ప్రయత్నం చేస్తాను. అధ్యక్షా, రవాణ మంత్రి గారు కూడా చాలా వివరాలు చెప్పారు. ప్రతిరోజు హైదరాబాద్ నగరంలో జిహెచ్‌ఎంసి పరిధిలో 35 లక్షల మంది ఆర్‌టిసి బస్సుల ద్వారా ప్రయాణం చేస్తున్నారు. దానికి సంబంధించి గౌరవ మంత్రిగారు ఇప్పుడే సమాచారం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా, ప్రతిరోజు 90 లక్షల మంది టిఎస్‌ఆర్‌టిసి ద్వారా ప్రయాణం చేస్తున్నారు. అలాగే జాఫ్రీ గారు ఇంకో రెండు, మూడు ప్రశ్నలు కూడా అడిగారు. He asked as to how many bus shelters are required? For that I inform that right now the total number of bus shelters in GHMC area are 1202.

صاحب' normal circumstances کیا ہے 1km پر جہاں کہیں بھی depending on the traffic
1km density پر بس اسٹاپس رہنا چاہئے۔ اس سوچ کے ساتھ proper Worldwide Standard
بنا رہے ہیں۔ اور آپ (جعفری صاحب) نے معاہدہ کے بارے میں پوچھا۔ یہ 22-01-18 کو شروع ہوا۔ معاہدہ کے
جملہ 180 دن یعنی 6 ماہ ہیں جس کو اسی مدت میں مکمل کرلیا جائے گا۔ اس کے علاوہ آپ نے منی بسس کے بارے میں
پوچھا' Transport Minister صاحب نے ابھی اپنے جواب میں کہا۔ شہر حیدرآباد میں متعارف کردہ اور خاص طور پر
پرانا شہر میں 10 سے 20 بسس چلانے پر T.S.R.T.C غور کررہی ہے۔ اس تعلق سے منسٹر صاحب نے بھی بتایا ہے۔

అదే విధంగా గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు ఉప్పల్ మరియు ఎల్.బి. నగర్ గురించి, గౌరవ సభ్యులు శ్రీ వి. భూపాల్ రెడ్డి గారు పటాన్‌చెరు రూట్స్ గురించి చెప్పారు. ఆ రెండు విషయాలు కూడా నోట్ చేసుకుంటాం. అలాగే గౌరవ సభ్యులు శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు గారు ఏ రకమైన బస్ షెల్టర్లు ఏర్పాటు చేయబోతున్నారని చాలా ముఖ్యమైన విషయం అడిగారు. బస్ షెల్టర్లను గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4 అని నాలుగు గ్రేడ్‌ల క్రింద విభజించాము. మొత్తం కలిపి 826 బస్ షెల్టర్లు మోడ్రనైజ్ చేయబోతున్నాము.

గ్రేడ్-1లో అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణం చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. అందులో డస్ట్‌బిన్, లేడీస్‌కు గాని, జెంట్స్‌కి గాని విడిగా టాయిలెట్స్, మొబైల్ చార్జింగ్ పాయింట్స్, వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్లు, వైఫై, ఏటియం కాఫీ మెషిన్, ఎయిర్ కండిషన్డ్ ప్యాసింజర్ సిట్టింగ్ ఏరియా, వాటితోపాటు ఒక ఫ్యాన్, సిసి టి.వి. వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భవిష్యత్తులో ఎప్పుడైనా ఆర్‌టిసి వారు గనుక ఇంట్రడ్యూస్ చేయదలచుకుంటే అందులో kiosk కూడా పెట్టి టికెటింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేసుకునే విధంగా గ్రేడ్-1 లో పెట్టుకోవడం జరిగింది.

గ్రేడ్-2లో డస్ట్‌బిన్, టాయిలెట్స్, మొబైల్ చార్జింగ్ పాయింట్స్, వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్లు మరియు వైఫై వంటి సౌకర్యాలు ఉంటాయి.

గ్రేడ్-3లో డస్ట్‌బిన్, టాయిలెట్స్, మొబైల్ చార్జింగ్ పాయింట్స్, వాటర్ వంటి సౌకర్యాలు ఉంటాయి.

గ్రేడ్-4లో ఒక డస్ట్‌బిన్‌తో పాటు కొంచెం అందంగా తయారుచేసి ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ నాలుగు ప్యాకేజెస్‌లో కూడా వీటిని సమపాళ్లలో కలిపి ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని పిపిపి విధానంలో చేపట్టడం జరుగుతుంది. వాటికి బిడ్ చేసే వారికి viability కూడా రావాలి అన్న ఉద్దేశ్యంతో మనం ప్యాకేజ్ చేసేటప్పుడే గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4ల క్రింద ఏర్పాటు చేసుకోవడం జరిగింది.

మొత్తంగా గ్రేడ్-1 200/30 చదరపు అడుగులు, గ్రేడ్-2 25/8 చదరపు అడుగులు, గ్రేడ్-3 20/5 చదరపు అడుగులు, గ్రేడ్-4 10/5 చదరపు అడుగులు ఉంటుంది. ఈ విధంగా స్థలాన్ని ఖరారు చేసి, తద్వారా అన్ని రకాలుగా ఏర్పాట్లు చేసుకునే విధంగా రంగంలో దిగాం. రాబోయే 180 రోజులలో తప్పకుండా హైదరాబాద్ నగరానికి facelift వచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## తప్పనిసరి పాఠ్యాంశంగా తెలుగు

ప్రశ్న నెం.2672(45)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, టి. భానుప్రసాద్ రావు మరియు నారదాసు లక్ష్మణ్ రావు, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి గారు (విద్యా శాఖ) దయచేసి ఈ క్రింద సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలని నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, దీనిని అమలు చేయడానికి తీసుకుంటున్న చర్యలేమిటి;

ఇ) పదవ తరగతి వరకు తెలుగు సబ్జెక్టు చదవకుండా, ఇంటర్మీడియట్‌లో మాత్రమే చదవబోయే విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలేమిటి?

**గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) (శ్రీ కడియం శ్రీహరి):-** అ), ఆ) & ఇ) ఈ విషయాన్ని అధ్యయనం చేసి, సిఫారసులను సమకూర్చడానికి 31.10.2017 తేదీగల, పాఠశాల విద్య (కార్యక్రమాలు - II) శాఖ, జి.ఓ.ఆర్‌టి.నెం.213 ద్వారా ఉప-కమిటీని ఏర్పాటు చేయడమయింది. కమిటీ తమ సిఫారసులను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, ప్రముఖ కవి అయిన కాళోజీ గారు తెలంగాణ ఏర్పడితే, తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో బడి పలుకుల భాష ఉంటుందనే ఉద్దేశంతో ఆరోజు మాట్లాడారు. ఆ ఉద్దేశంతోనే ఈరోజు మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు మన బడుల భాషలో 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగుని తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలనే మాట చెప్పారు. అయితే, సర్వ సాధారణంగా మా మంత్రిగారు గతంలో చెప్పిన జవాబునే ఆధారంగా చేసుకొని సమాధానమిచ్చారు.

నిన్నటి సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లుగా వార్తా పత్రికలలో చదివాం. ఆ నిర్ణయాలు ఏమి తీసుకున్నారు? ఒకవేళ ఆ నిర్ణయాల ప్రకారం 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు సబ్జెక్టు ఉన్నట్లయితే, ఇంటర్మీడియట్ స్థాయిలో కొద్దిగా ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉంటుంది. రెండవ ప్రశ్న ఏమిటంటే, ఒకేసారి 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా చేస్తున్నారా? లేకపోతే దశలవారీగా 1వ తరగతి, 2వ తరగతి, 3వ తరగతి నుండి ప్రవేశపెట్టే ఆలోచన ఉన్నదా? తెలుపవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

10.40 ఉ. **శ్రీ నారదాసు లక్ష్మణ్‌రావు:-** అధ్యక్షా, 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్ట్‌గా బోధించాలనే నిర్ణయం తీసుకోవడం చాలా అభినందించవలసిన విషయం. మాతృభాషలోనే విద్యాబోధన జరిగినట్లైతే మన చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు మొదలగు అంశాలు అందులో ఇమిడి ఉంటాయి కాబట్టి, ఆ విద్యార్థికి తను పుట్టి పెరిగిన ప్రాంతం యొక్క అన్ని విషయాలు సమగ్రంగా మొదటి నుండి తెలియడం ద్వారా ఆ వ్యక్తికి ఆ ప్రాంతం మీద, ఆ ప్రజల మీద ప్రేమాభిమానాలు వెల్లివిరుస్తాయి. పుట్టిన బిడ్డకు అమ్మ మాటలు, నాన్న నడక నేర్పుతారు. భాష సమాజం యొక్క జ్ఞానాన్ని నేర్పిస్తుంది. కనుక ఇంతటి ప్రాధాన్యత ఉన్న తెలుగు భాషను తప్పని సరిగా 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగు బోధన సమగ్రంగా జరగాలి. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగు భాషను తెలుగు భాషా పండితులు బోధిస్తున్నారు. 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగు భాషను ఎస్‌జీబీటీ ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు. కనుక 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు తెలుగు భాషను తెలుగు పండితులు నేర్పిస్తే విద్యార్థి ఆ భాష మీద ఎక్కువ పట్టు సాధించడానికి అవకాశం ఉంటుంది. ఆ విధంగా 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు తెలుగు భాషను తెలుగు పండితులు బోధించడం జరుగుతుందా అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పూల రవీందర్:-** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు తెలుగు భాషను ఖచ్చితంగా విద్యార్థులు నేర్చుకోవాలనే విధంగా నిర్ణయం తీసుకున్నందుకు వారికి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ప్రస్తుతం సమాజంలోని ప్రజలందరూ ఇంగ్లీష్‌మీడియం చదువు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం చదువుల వలన మంచి అవకాశాలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ ఇంగ్లీష్ మీడియంలో బోధన జరగడం లేదు. దీని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. ఎవరైతే ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో విద్యను అభ్యసిస్తారో వారికి హైయ్యర్ ఎడ్యుకేషన్‌లో, ఉపాధి కల్పనలో 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తే బీద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అదే విధంగా ఇంగ్లీష్‌మీడియం ఎల్‌కేజీ, యూకేజీలను అంగన్‌వాడీ సెంటర్లకు అనుసంధానం చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరుతున్నాను.

అదే విధంగా సభ్యులు శ్రీ నారదాసు లక్ష్మణ్‌రావుగారు అన్నట్లుగా 6వ తరగతి విద్యార్థులకు తెలుగును బోధించుటకు తెలుగు పండిత్ పోస్టులను వేస్తున్నాము. ప్రైమరీ స్థాయిలో కూడా తెలుగు పండిత్ పోస్టులు, పీఈటీ పోస్టులను కూడా వేసినట్లైతే వ్యాయామ విద్య, మరియు భాషమీద విద్యార్థులకు సరైె పట్టు ఉంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): چیرمین صاحب! X Class میں تلگو رہتی ہے اور 6 میں سے 3 subject languages کے رہتے ہیں' تلگو میں passing marks دوسرے subjects سے کم ہیں۔ آپ X Class کے علاوہ دوسری کلاس کیلئے بھی تلگو کو لازم کر رہے ہیں تو تلگو کے لئے passing marks کم رکھیں تو بہتر رہے گا۔ چیرمین صاحب Moral Science, Environmental Science بھی اس میں شامل کئے گئے ہیں جس کا امتحان لیا جاتا ہے اور اس کے marks بھی دئے جاتے ہیں۔ مگر وہ X Class کے Memo میں ان نمبرات کا شمار نہیں کیا جاتا۔ 6 subjects سے ہٹ کر جو بھی additional subjects رہتے ہیں' اس کو پڑھایا بھی جاتا ہے اور اسکا امتحان بھی لیا جاتا ہے۔ اس میں passing marks بھی ہوتے ہیں مگر اس کو Memo of marks میں count نہیں کیا جاتا ہے۔ آپ ایسی سہولت دیں جس کے لئے اسے لازم کیا جا رہا ہے اس کے لئے رعایت extend کریں تو بہتر ہو گا۔ یہ میرا مشورہ ہے۔

**శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):–** అధ్యక్షా, ప్రపంచ మహాసభల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు నేర్చుకోవాలని ప్రకటన చేయడం, దానికి ప్రతిరూపంగా నిన్ననే వారు ఒక కమిటీని ఏర్పాటు చేసి అన్ని ప్రైవేటు పాఠశాలల్లో, సిబిఎస్ఈ పాఠశాలల్లో తప్పని సరిగా తెలుగు భాషను నేర్చుకోవాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. దానికి చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం జరిగేటప్పుడు వారికి తెలుగు మొదటి భాషగా ఉన్న వారినే నియమించడం జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలలో కూడా ఫైల్స్ ప్రాసెసింగ్ అంతా తెలుగులోనే నిర్వహించి వారి నియామకంలో కూడా తెలుగు మొదటి భాష ఉన్న వారినే తీసుకునేటట్లుగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. ఆ విధంగా చేయడం వలన మనం తెలుగు నేర్చుకోమ్మని చెప్పినా, చెప్పకపోయినా వారే నేర్చుకుంటారు. అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, కమ్మనైన తెలుగు భాషను బడి పలుకుల భాషగా చేయాలనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ రాష్ట్రంలో 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు తెలుగు భాషను తప్పని సరిగా చదవాలనే ఒక విధాన పరమైన ప్రకటన చేయడం జరిగింది. అదే విధంగా తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే ప్రపంచ తెలుగు మహా సభలను కూడా హైదరాబాద్ నగరంలో చాలా ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రిగారి ప్రకటనకు అనుగుణంగా విద్యాశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా ఇతర రాష్ట్రాలలో మాతృభాషను ఖచ్చితంగా నేర్చుకోవాలనే విధానాన్ని తీసుకొచ్చినప్పుడు ఏ రకంగా అక్కడ అమలు చేస్తున్నారో అధ్యయనం చేసి నివేదికను ఇవ్వాలనే విధంగా ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. వారు తమిళనాడు, కర్ణాటక, పంజాబ్‌లలో అమలవుతున్న మాతృభాష తీరును పరిశీలించి నివేదికను ఇవ్వడం జరిగింది. ఆ నివేదిక ఆధారంగా మా ప్రతిపాదనలను తయారు చేసి గౌరవ ముఖ్యమంత్రిగారికి సమర్పించడం జరిగింది. నిన్నటి రోజున గౌరవ ముఖ్యమంత్రిగారు కమిటీ సభ్యులతోను, అదే విధంగా సాహితీ అకాడమీ ఛైర్మన్ నందిని సిద్ధారెడ్డి గారి ఆధ్వర్యంలో తమిళనాడుకు వెళ్లి అక్కడ మాతృభాష అమలవుతున్న తీరును పరిశీలించి వచ్చిన బృందంతో కూడా సమావేశాన్ని నిర్వహించారు. నిన్నటి రోజున తెలుగు భాషను ఏ విధంగా అమలు చేయాలనే దానిపైన ఒక స్పష్టత వచ్చింది.

గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భాషను 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు compulsory చేయాలని భావించినా తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో వారు మాతృభాషను 10వ తరగతి వరకే ఇంప్లిమెంట్ చేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు ద్విభాష సూత్రానికి లోబడి లాంగ్వేజస్‌ను నేర్చుకుంటున్నారు. ప్రత్యేకించి సిబిఎస్ఈ, ఐసిఎస్ లాంటి ఇనిస్టిట్యూషన్స్‌లో సింగిల్ లాంగ్వేజ్‌నే వారు నేర్చుకుంటున్నారు కాబట్టి, ఇంటర్మీడియట్‌లో compulsory చేసినట్లైతే కొన్ని ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉంటాయనే ఆలోచనకు వచ్చి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భాషను 1వ తరగతి నుండి 10వ తరగతి వరకే మొదటి దశలో అమలు చేయడానికి నిన్న నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్తే తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అంతేకాకుండా 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగు భాషను compulsory చేయాలని తీసుకునే సందర్భంలో అమలు విధానం ఏ విధంగా ఉండాలనే విషయాలను కూడా నిన్నటి రోజున చర్చించడం జరిగింది. ఆ అమలు విధానంపైన శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నాము. ఒకేసారి తెలుగు మీడియంకు సంబంధించి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు వారు తెలుగు చదువుకుంటున్నారు కాబట్టి, ఎటువంటి ఇబ్బందులు లేవు. ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో 6వ తరగతి నుండి తెలుగును చదువుకుంటున్నారు. అదే విధంగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో వేరే రకంగా ఉన్నది. కాబట్టి అన్ని స్టేజ్‌లలో ఒకేసారి తెలుగును introduce చేయడానికి వీలు కాదు కాబట్టి, తెలుగు మీడియం స్కూల్స్‌లో ఏ రకంగా, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏ విధంగా, మిగతా పాఠశాలల్లో ఏ విధంగా ఉండాలనే విషయాలను మేము అధ్యయనం చేస్తున్నాము. ఏది ఏమైనా 2018-19 సంవత్సరం నుండి తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, aided పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు మరియు ఇతర పాఠశాలల్లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగును compulsory సబ్జెక్ట్‌గా చేస్తూ తప్పనిసరిగా చదువుకునే విధంగా నిన్న గౌరవ ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకున్నారు. ఆ విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుండే అమలు చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## ఎస్సీలు మరియు ఎస్టీలచే సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటులో రిజర్వేషన్లు

ప్రశ్న నెం. 2558(46)

సర్వశ్రీ డి. రాజేశ్వర్ రావు మరియు సభావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.లు :- గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంపొందిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఇప్పటి వరకు నెలకొల్పిన సౌర విద్యుత్ ప్లాంట్ల సంఖ్య ఎంత? వాటి స్థాపిత సామర్థ్యం వివరాలు ఏమిటి;

ఇ) సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు రిజర్వేషన్లు, సబ్సిడీని కల్పించాలనే విషయం పరిశీలనలో ఉందా;

ఈ) అయితే, ఆ వివరాలేమిటి;

ఉ) లేనట్లయితే, ఇందుకు గల కారణాలు ఏమిటి?

**గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి (శ్రీ జి. జగదీష్ రెడ్డి):-** అ) అవునండీ.

ఆ) 28.02.2018 తేది నాటికి తెలంగాణలో ఉన్నట్టి సౌర విద్యుత్ ప్లాంట్ల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| వరుస సంఖ్య | వివరాలు | మొత్తం సంఖ్య | మొత్తం సామర్థ్యం ఎం.డబ్ల్యులో | గ్రిడ్‌తో ప్రారంభమైనవి | |
|---|---|---|---|---|---|
| | | | | సంఖ్య | సామర్థ్యం ఎం.డబ్ల్యు |
| సౌర విద్యుత్ ప్రాజెక్టులు (టిఎస్ డిస్కంలతో పిపిఎ) | | | | | |
| 1. | జెఎన్‌ఎన్‌ఎస్‌ఎమ్ (ఆర్‌పిఎస్‌ఎస్‌జిపి) | 5 | 4.75 | 5 | 4.75 |
| 2. | ఎన్‌టిపిసి విద్యుత్ వ్యాపార నిగమ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిపిఏలు) | 6 | 49.81 | 6 | 49.81 |
| 3. | పోటీతత్వం వేలం-2012 | 34 | 182.00 | 31 | 162.00 |
| 4. | ఓపెన్ ఆఫర్-2013 | 44 | 192.00 | 43 | 189.5 |
| 5. | పోటీతత్వ వేలం-2014 | 34 | 515.00 | 33 | 513.00 |
| 6. | పోటీతత్వ వేలం-2015 | 66 | 1988.00 | 57 | 1700.90 |
| 7. | ఎన్‌టిపిసి బండిల్డ్ విద్యుత్తు-2016 | 14 | 400.00 | 14 | 400.00 |
| 8. | నెట్ మీటరింగ్ క్రింద సోలార్ రూఫ్ టాప్ | 1878 | 49.85 | 1428 | 26.92 |
| మొత్తం సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు (టిఎస్ డిస్కాంలతో పిపిఎ | | 2081 | 3381.41 | 1617 | 3046.88 |
| మూడో పార్టీ విక్రయం / కేప్టివ్ వినియోగం క్రింద సౌర విద్యుత్ ప్రాజెక్టులు | | | | | |
| 1. | మూడో పార్టీ విక్రయం | 42 | 223.34 | 30 | 141.02 |
| 2. | కేప్టివ్ వినియోగం | 31 | 139.27 | 21 | 94.77 |
| మూడో పార్టీ విక్రయం / వినియోగం క్రింద సౌర విద్యుత్ ప్రాజెక్టులు | | 73 | 362.61 | 51 | 235.79 |
| మొత్తం సౌర విద్యుత్ ప్రాజెక్టులు | | 2154 | 3744.02 | 1668 | 3282.67 |

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఉ) టారిఫ్ ఆధారిత పోటీతత్వ ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో సౌర పివి డెవలపర్స్‌ను ఎంపిక చేసే టెండర్ డాక్యుమెంట్లను ప్రధానంగా ఈ క్రింది ప్రాతిపదికన రూపొందించడమయింది.

1) కేంద్ర ప్రభుత్వ, ఎంఎన్ఆర్ఇ గ్రిడ్ కనెక్టెడ్ విద్యుత్ ప్రాజెక్టుల ఎంపిక కోసం మార్గదర్శకాలు.

2) కేంద్ర ప్రభుత్వ, ఎంఎన్ఆర్ఇ పునరుద్ధరించదగు ఇంధన వనరులు ప్రాతిపదికన గ్రిడ్ కనెక్టెడ్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం టారిఫ్ ఆధారిత పోటీతత్వ వేలం ప్రక్రియకు మార్గదర్శకాలు.

3) షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కోసం ఏవేని కేటాయింపులు చేయడానికి మార్గదర్శకాలలో గానీ, టెండరు డాక్యుమెంట్లలో గానీ ఎటువంటి ఏర్పాటు లేదు.

**శ్రీ డి. రాజేశ్వర రావు (నామినేటెడ్):-** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యుత్ రంగంలో మంచి పురోగతి సాధించాము. గౌరవ సాంఘిక సంక్షేమ మంత్రిగారు విద్యుత్ శాఖకు కూడా మంత్రిగా ఉండడం చాలా సంతోషం. ఈ రాష్ట్రంలో ఎస్సీలు, ఎస్టీలు బాగుపడాలని ప్రభుత్వం మూడు ఎకరాల భూమి ఇవ్వడం జరుగుతోంది. ఆడ పిల్లల వివాహాలకు డబ్బులను ఇవ్వడం జరుగుతోంది. ఎస్సీలకు 80 శాతం సబ్సిడీలను కూడా ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వ నియమాల ప్రకారం సివిల్ కాంట్రాక్ట్స్‌లో రిజర్వేషన్ ఉంది. కాబట్టి ఈ రాష్ట్రంలో ఉన్న ఎస్సీలు, ఎస్టీలు బాగుపడాలని గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా బాగా ఆలోచిస్తున్నారు కాబట్టి, e-government, e-tendersలో కొంచెం రిజర్వేషన్ కల్పిస్తే చాలా మంది ఎస్సీ, ఎస్టీల కుటుంబాలు వ్యాపారాలు చేసుకొని బాగుపడతారని తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు టెండర్లు అయిపోయాయి. కానీ రానున్న టెండర్లలోనైనా సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటులో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7శాతం రిజర్వేషన్లు కల్పించాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. దయచేసి అధికారులతో మాట్లాడి టెండర్లను కేటాయించడంలో రిజర్వేషన్ల అంశాన్ని పొందుపరచాలని కోరుతున్నాను.

**శ్రీ సబావత్ రాములు నాయక్ (నామినేటెడ్):-** అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీలకు రేషన్ షాప్‌లో రిజర్వేషన్ ఇస్తున్నారు. గౌరవ సభ్యులు శ్రీ డి. రాజేశ్వర రావుగారు అన్నట్లు దీనిలో కూడా రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతున్నాను. ఏజన్సీ ప్రాంతంలో వైన్ షాపులకు, పరిశ్రమలలో 35శాతం సబ్సిడీ ఇస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక పక్క ఎస్సీ, ఎస్టీలు టాటాలు, బిర్లాలు కావాలనే ఉద్దేశ్యంతో మంచి పథకాలను తీసుకొస్తున్నారు. కానీ సోలార్ ప్లాంటు, విద్యుత్ విషయానికి వచ్చేసరికి రిజర్వేషన్ ఇవ్వడం లేదు. 3046.93 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ యూనిట్లు వచ్చాయి. అన్ని రంగాలలో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఉన్నాయి. కాంట్రాక్ట్ ప్రక్రియలో రిజర్వేషన్ ప్రక్రియ మొన్న దాదాపు రూ.1.00 కోటి వరకు డి.డి. లేకుండా ఇవ్వడం జరుగుతోంది. అలాంటి వెసులుబాటు కల్పిస్తే చదువుకున్న ఇంజనీర్లు, ట్రైబల్స్‌లో కూడా నైపుణ్యం గల వారు ఉన్నారు, విద్యుత్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫారమ్ కాంట్రాక్టర్స్ ఉన్నారు. సోలార్ సిస్టమ్‌లో కూడా రిజర్వేషన్‌ను కల్పించవలసిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

11.00 ఉ.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన విషయంలో- రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంత మటుకు ప్రతి విషయంలోనూ రిజర్వేషన్ పాటిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వ కంట్రోల్‌లో ఉన్న దేనిలోనైనా గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పిన ప్రకారం ప్రతి విషయంలోనూ రిజర్వేషన్ పాటించడం జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం యొక్క డబ్బులు వెచ్చించే అవకాశం ఉన్న సందర్భాలలో గాని, ఏవైనా సబ్సిడీలు ఇచ్చే సందర్భాలలో గాని, ప్రభుత్వం నుండి డబ్బులు ఇచ్చే చోటా తప్పకుండా మనం రిజర్వేషన్ పాటిస్తున్నామని తెలియజేసుకుంటున్నాను. ఇందులో ప్రధానంగా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ పరిధి చాలా తక్కువగా ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డిపార్టుమెంటు ఏదైతే ఉందో, వారి యొక్క మార్గదర్శకాల ప్రకారమే పనిచేయవలసి ఉంటుంది. డాక్యుమెంటు ఎలా చేయాలనేది కూడా వారి మార్గదర్శకాల ప్రకారమే జరుగుతుంది. ఇందులో మనం ఏమీ వేలు పెట్టడానికి అవకాశం ఉండదు. పూర్తి స్థాయిలో పారదర్శకంగా, గ్లోబల్ టెండర్స్ ప్రకారం అంతర్జాతీయ పోటీ బిడ్డర్ల ద్వారా మాత్రమే జరుగుతుంది. ప్రభుత్వం వైపునుండి ఒక్క పైసా మనం ఇవ్వడం కాని, ఒక్క గజం జాగా కూడా మనం ఇవ్వడం లేదు. పూర్తిగా పోటీ తత్వంలో వస్తుంది. భారతదేశం మొత్తంలో మన దగ్గర మాత్రమే ఈ కార్యక్రమం చాలా విజయవంతంగా కొనసాగుతున్నదని మనవి చేసుకుంటున్నాను. ధరలు కూడా అంతకు ముందు ఏడు రూపాయలు, ఎనిమిది రూపాయలు ఉండేది. మన రాష్ట్రంలోనే గౌరవ ముఖ్యమంత్రిగారి నేతృత్వంలో, పార్కుల వైపు పోకుండా, మొత్తం రాష్ట్రంలో ఎక్కడెక్కడ సబ్ స్టేషన్లు ఉన్నాయో అక్కడ వీటిని పెట్టుకునే అవకాశం మనం ఇచ్చి, లైన్ లాసెస్ అనేవి కూడా లేకుండా చూడడం ద్వారా ఒక మంచి విధానం మనం తీసుకువచ్చాము. దాని ద్వారానే ఈ రోజు మన రాష్ట్రంలో ధరలు ఆకాశం నుండి భూమి మీదకు దిగి వచ్చాయి. దీనిలో ఎక్కడా కూడా ప్రభుత్వం యొక్క పైసా కాని, గజం జాగా కాని ఎవరికీ మనం ఇచ్చేది లేదు. కాబట్టి పూర్తి స్థాయిలో కేంద్రం

యొక్క మార్గ–దర్శకాలు, డాక్యుమెంటు విధానం కూడా వారే రూపొందించి పంపిస్తారు. కాబట్టి ఇందులో రాష్ట్రప్రభుత్వానికి ఏ విధమైన పాత్ర లేదని తమరి ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేసుకుంటున్నాను.

**దివ్యాంగుల కొరకు వృత్తి విద్యా శిక్షణా కేంద్రాలు**

ప్రశ్న నెం.2579(47)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, కొంపల్లి యాదవ రెడ్డి మరియు పురాణం సతీష్ కుమార్, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళా, శిశు అభ్యుదయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో 2 నుండి 18 సంవత్సరాల వయో వర్గంలోని వికలాంగుల సంఖ్య ఎంత;

ఆ) ప్రభుత్వం వారి విద్యా, సంక్షేమం కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలు ఏమిటి;

ఇ) రాష్ట్రంలో విద్యా, వృత్తి విద్యా శిక్షణ కేంద్రాల సంఖ్య, అవి నిర్వహించబడుతున్న ప్రదేశాల వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వర రావు):–** అ) 2011 జనగణన ప్రకారం, 2 నుండి 18 సంవత్సరాల వయో వర్గంలో మొత్తం వికలాంగుల జనాభా 2,68,643 గా ఉంది.

ఆ)వికలాంగులకు ప్రీ–మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పింఛను, విద్యా, ప్రోస్థెటిక్ మరియు మొబిలిటీ ఉపకరణలు, పరికరాలను సమకూర్చడమవుతున్నది. వికలాంగుల కోసం నైవాసిక పాఠశాలలు, హాస్టళ్లు / సదనాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ కేంద్రాలను కూడా నిర్వహించడమవుతున్నది.

ఇ) (i) రాష్ట్ర ప్రభుత్వం 20 హాస్టళ్లను నిర్వహించడమవుతున్నది. వీటిలో హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో 6 హాస్టళ్ల చొప్పున, ఆదిలాబాదు, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాదులో ఒక్కొక్క హాస్టలు, వరంగల్‌లో 2 హాస్టళ్లు ఉన్నాయి.

(ii) రాష్ట్ర ప్రభుత్వం 5 నైవాసిక ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తున్నది. వీటిలో రెండు కరీంనగర్‌లో, హైదరాబాదు, నల్గొండ, మహబూబ్‌నగర్‌లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.

(iii) హైదరాబాదులో రాష్ట్రప్రభుత్వం 3 నైవాసికేతర ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తున్నది.

(iv) హైదరాబాదులో కేంద్ర ప్రభుత్వం 1 వృత్తి పరమైన శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది.

(v)ఎన్‌జీఓలు 36 ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. వీటిలో నిజామాబాద్, నల్గొండలో 4 చొప్పున, ఖమ్మంలో 5, రంగారెడ్డి, హైదరాబాదులో 8 చొప్పున, మహబూబ్‌నగర్‌లో 3, సంగారెడ్డి, వరంగల్, మేడ్చల్, సిద్ధిపేట వద్ద ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.

(vi) ఎన్‌జీఓలు 23 ప్రత్యేక పాఠశాలలు కమ్ వృత్తిపరమైన శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. వీటిలో కరీంనగర్‌లో 4, ఖమ్మం, మెదక్, మెహబూబ్‌నగర్‌లో ఒక్కొక్కటి, రంగారెడ్డిలో 9, హైదరాబాద్‌లో 7 ఉన్నాయి.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, మంత్రిగారు చాలా సవివరంగా సమాధానం ఇచ్చినప్పటికీ కూడా, కొన్ని అంశాలను ప్రస్తావించవలసి ఉంది. దివ్యాంగులకు శిక్షణా కేంద్రాలను కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నారు. వాటిలో కొన్నింటిని కొత్త ఊపులో బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. కొన్ని సంవత్సరాల తరువాత వారికి వయసు అయిపోతుంది , నిర్వహణ అనుకున్న స్థాయిలో, గొప్పగా ఉండడం లేదు. ఈ విషయంలో నేను నల్గొండ జిల్లాలో ఉన్న ఒక పాఠశాలను పరిశీలించడం జరిగింది. వారు మంచి వయసులో ఉన్నప్పుడు దాని నిర్వహణ బాధ్యతలు చేపట్టి, దానిని బ్రహ్మాండంగా నిర్వహించి, నాలుగు అంతస్తుల భవనంతో కట్టారు. ఒక బస్సుని కూడా ఆ పాఠశాల వారు కలిగి ఉన్నారు. పరిసర ప్రాంతాలలో ఉండే దివ్యాంగులు మరియు అంధ విద్యార్థులను తీసుకువచ్చి, ఆ పాఠశాలలో విద్యను అభ్యసింపజేస్తున్నారు. కాని ఇప్పుడు మాత్రం అది నిర్వీర్యమైపోయే పరిస్థితి వచ్చింది. కాబట్టి ఎన్‌జీవోలు నిర్వహిస్తున్నటువంటి అటువంటి సంస్థలను ప్రభుత్వం ఒకసారి పరిశీలించి, వారు నిర్వహణ చేయలేని పరిస్థితిలో ఉన్నారు కాబట్టి వాటిని ప్రభుత్వం నిర్వహించే అవకాశం ఉంటుందా?

అదే విధంగా మేడ్చల్ జిల్లాలో స్వయం కృషి అనే ఒక స్వచ్ఛంద సంస్థ, జవహర్ నగర్‌లో, ఒక ఐదు ఎకరాల స్థలంలో చాలా బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నారు. అక్కడ ఒకేషనల్ కోర్సులు నిర్వహించడంతో పాటు, హోటళ్లకు అవసరమైన డిస్పోజబుల్ ఐటమ్స్‌ని కూడా తయారు చేస్తుంటారు. మొత్తం ఖర్చు వారే స్వయంగా భరించి దానిని నడుపుతున్నారు. కాబట్టి అటువంటి ఒకేషనల్ కోర్సులు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం ఏదైనా గ్రాంట్ ఇచ్చే అవకాశం ఉన్నదా? ఇవి నాకు తెలిసిన రెండు అంశాలు. కాని ప్రభుత్వపరంగా నిర్వహించే

సంస్థలు, మహబూబ్‌నగర్‌లో గాని, కరీంనగర్‌లోగాని, లేదా హైదరాబాద్‌లోగాని వీటిని నిర్వహిస్తున్నప్పుడు అక్కడ పిల్లలు అంత ఉత్సాహంగా కనబడడం లేదు. నేను స్వయంగా చూశాను. కరీంనగర్‌లో పదవ తరగతి అయిపోయిన తరువాత వారి కొరకు ఇంటర్మీడియట్ స్థాయిలో ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశాను. కాని పిల్లలు తక్కువ ఉన్నారు. కాబట్టి దానిని పటిష్టపరిచే విధంగా, కరీంనగర్ జిల్లాలో ఉండే పిల్లలు అందరూ అందులో చేరేటట్లుగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా?

**శ్రీ పురాణం సతీష్ కుమార్ (స్థానికసంస్థలు – ఆదిలాబాద్):–** అధ్యక్షా, మంత్రిగారు ఈ ప్రశ్నపై చాలా వివరంగా సమాధానం చెప్పారు. కాని టోటల్‌గా తెలంగాణ రాష్ట్రంలో రెండు నుండి పద్దెనిమిది సంవత్సరాల వయసున్న దివ్యాంగులు మొత్తం 2,68,643 అని చెప్పారు. కాని ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండొచ్చు. ఈ ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్ ఏవైతే ఉన్నాయో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో ఆరు చొప్పున ఉన్నాయి. అదే విధంగా ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాలలో ఒకటి చొప్పున ఉన్నాయి. ఈ హాస్టల్స్‌లో ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, మరియు నైవాసిక పాఠశాలలు నిర్వహిస్తున్నారు. సంతోషం. ఈ పిల్లలు ఎట్లా ఉంటారంటే చెప్పుకుందామంటే నోరు ఉండదు, విందామంటే చెవులు ఉండవు. కాబట్టి ప్రభుత్వమే బాధ్యత తీసుకుని, వారికి అవసరమైనవి చేయవలసిన అవసరం ఉంది.

ఈ అధికార వికేంద్రీకరణలో భాగంగా పది జిల్లాలను ముప్పై ఒక్క జిల్లాలుగా చేశారు. ఈ పిల్లలు ప్రతి జిల్లాలో ఉంటారు. తమరి ద్వారా నేను గౌరవ మంత్రిగారిని కోరుకుంటున్నాను–మొత్తం ముప్పై ఒక్క జిల్లా కేంద్రాలలో వికలాంగులకు సంబంధించినటువంటి హాస్టల్స్‌గాని, స్పీచ్ థెరపిగాని లేదా ఫిజియోథెరపిగాని ప్రవేశపెట్టే అవకాశం ఉందా? ఎందుకంటే సమస్యల పరిష్కారం కొరకే వికేంద్రీకరణ జరిగింది. సమస్యలు సులభంగా పరిష్కరించడం కొరకే వికేంద్రీకరణ చేపట్టడం జరిగింది కనుక ప్రతి జిల్లా కేంద్రంలో ఈ హాస్టల్‌ను ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను.

రెండవ అంశం ఎన్‌జీఓలు ముప్పై ఆరు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, వరంగల్, మేడ్చల్, సిద్దిపేటలో ఉన్నట్లు ప్రభుత్వం చెప్పింది. కాని పాత ఆదిలాబాద్ జిల్లా, కొత్తగా ఏర్పడిన మంచిర్యాల జిల్లాలో ఒక హాస్టల్ మరియు పాఠశాల నడుస్తున్నాయి. కాని వారికి ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదు. వాళ్లే స్వయంగా వనరులను సమకూర్చుకుంటున్నారు. సామాజిక స్పృహతో వాళ్లు వాటిని నిర్వహిస్తున్నారు. వారు ఒక అద్దె భవనంలో హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. వారు స్వంత భవనం కట్టుకోవడానికి కలెక్టర్‌గారిని భూమిని కేటాయించమని కోరితే, రూల్స్ అనుమతించలేదు. శ్రీ మల్‌రాజు రవీందర్ రావు అనే ఒక దాత 18 గుంటల భూమి ఇస్తే, మా సిడిపి నుండి కొంత డబ్బు కేటాయించి, ఆ భవనం నిర్మిద్దామంటే దానికి కూడా రూల్స్ ఒప్పుకోలేదు. చందాలు జమ చేసుకుని, భవనం నిర్మించి, పిల్లల బాగోగులు చూసే బాధ్యత ఆ యాజమాన్యానికి ఉంది. నేను ఈ రోజు గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను – మానవతా దృక్పథంతో, ఆ పిల్లల స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని, ఎన్జీఓలు నిర్వహిస్తున్న 36 పాఠశాలల్లో మంచిర్యాల చూపించలేదు. ప్రభుత్వం దగ్గరున్న సమాచారం మేరకు మంత్రిగారు వివరంగా సమాధానం ఇచ్చారు. కాబట్టి నేను మంత్రిగారిని కోరేది ఏమిటంటే ఈ దివ్యాంగులు ఎక్కడెక్కడ ఎంత మంది ఉన్నారు, వారి స్థితిగతులు ఏమిటి, ఏ గ్రామంలో, ఏ జిల్లాలో, ఏ పట్టణంలో ఎంతమంది దివ్యాంగులు ఉన్నారు అనే సమాచారం పొందడానికి ఒక సమగ్ర సర్వే నిర్వహించాలని కోరుతున్నాను. ఎన్జీఓలు నిర్వహించే పాఠశాలలను సంబంధిత అధికారులు విజిట్ చేసి, అక్కడ ఉన్న పిల్లల సంఖ్యను, నిర్వహణ తీరుని బట్టి, ప్రభుత్వపరంగా వారికి ప్రోత్సాహకాలు అందించే అవకాశం ఉందా? అందించాలని కూడా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుకుంటున్నాను.

**శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు (శాసనసభ నియోజకవర్గం):–** అధ్యక్షా, దివ్యాంగుల కొరకు మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలల యొక్క స్థితి చాలా దీనావస్థలో ఉంది. పురాతనమైన అద్దె భవనాలలో ఈ దివ్యాంగుల హాస్టళ్లు నడుస్తున్నాయి. కాబట్టి వీరి కొరకు ప్రభుత్వం కొత్త భవనాలు నిర్మించాలి, అదే విధంగా అద్దె భవనాలు ఉన్న చోట కూడా కొత్త భవనాలు నిర్మించే ఆలోచన ప్రభుత్వం దగ్గర ఉన్నదా తెలుపవలసిందిగా కోరుతున్నాను.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి:–** అధ్యక్షా, ఈ దివ్యాంగులకు సంబంధించిన అనేక పాఠశాలలను ప్రభుత్వం తరఫున నడుపుతున్నాము. ఈ అంశం విద్యా శాఖ పరిధిలోకి వస్తుంది. దీని గురించి గౌరవ ఉప ముఖ్యమంత్రి (విద్య ) గారికి ఒక రిప్రజంటేషన్ ఇచ్చాము. అందులో పనిచేసే సిఆర్‌టిలకు మిగతా రాష్ట్రాల కంటే తక్కువ జీతాలు ఇస్తున్నాము. రెండవ అంశం

వారికి 12 నెలల జీతం ఇచ్చే బదులు 10 నెలల జీతం మాత్రమే చెల్లిస్తున్నాము. మూడు-ఈ అంశం కూడా పిఏబిలో నిర్ణయించినప్పటికీ, మన దగ్గర తగ్గించి ఇస్తున్నాము. నాలుగు-ఈ ఉపాధ్యాయులు చాలా దుర్భరమైన స్థితిలో పని చేస్తున్నారు. మొత్తం 2300 మంది సిఆర్‌టిలు ఉంటే అందులో సగం మంది వాళ్ల పిల్లలు ఇబ్బందుల్లో ఉంటే, వారు ఆ ఇబ్బందులను గమనించి, సిఆర్‌టిలుగా జాయిన్ అయినారు. ఇందులో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. వాళ్లు చాలా ఓపికతో, కష్టంతో, మనోవేదనతో పనిచేస్తున్నారు. కాబట్టి ఈ సిఆర్‌టిలకు మిగతా రాష్ట్రాలతో ఇస్తున్న దానికి సమానంగా జీతాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. వేసవి కాలంలో కూడా ఈ ఉపాధ్యాయులు గ్రామాలలో తిరిగి, దివ్యాంగులైన పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. అయినప్పటికీ వారికి వేసవి రెండు నెలల కాలానికి జీతం ఇవ్వడం లేదు. కాబట్టి వారికి మొత్తం 12 నెలల జీతం చెల్లించాలి, పిఏబిలో నిర్ణయించినట్లుగా, మిగతా రాష్ట్రాలలో ఇచ్చినట్లుగా జీతం చెల్లించాలని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గారు స్వయం కృషి సంస్థ గురించి చెప్పారు. దానికి ప్రభుత్వమే భూమిని కేటాయించింది. అదే విధంగా నల్గొండ అంధ విద్యార్థుల పాఠశాలను కూడా ప్రభుత్వం స్వాధీనపరచుకుంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. తప్పకుండా ప్రభుత్వం ఆ విషయాన్ని పరిశీలించి, వారి కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసు కుంటున్నాను. 14 సంవత్సరాల లోపు పిల్లలకు ఇప్పటికే సర్వ శిక్షా అభియాన్ ద్వారా ప్రతి మండలంలో రిసోర్స్ సెంటర్స్ ఉన్నాయి. వారికి అవసరమైన పరికరాలు ఇచ్చి, సహాయ సహకారాలు అందిస్తున్నాము. కొన్నిటికి స్వంత భవనాలు లేవని చెప్పారు. కలెక్టర్లను ప్రభుత్వం ఇప్పటికే సంప్రదించడం జరిగింది. ఇప్పటికే దివ్యాంగుల కొరకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. భవిష్యత్తులో కూడా మరిన్ని చర్యలు తీసుకుంటాము. శ్రీ పురాణం సతీష్ కుమార్ గారు చెప్పినట్లు కొత్త జిల్లాలలో కూడా దివ్యాంగుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. తప్పకుండా పరిశీలించడం జరుగుతుందని గౌరవ సభ్యులకు మనవి చేసుకుంటున్నాను.

## జి.హెచ్.ఎం.సి పరిధిలో
## "వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం"

ప్రశ్న నెం.2829 (48)

శ్రీ.ఎం.ఎస్.ప్రభాకర్ రావు, ఎం.ఎల్.సి.,:- గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన, మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ఎస్.ఆర్.డి.పి. (వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి కార్యక్రమం) క్రింద గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతమున్న రోడ్లను అభివృద్ధి చేసి, కొత్త రోడ్లను చేపట్టడానికి నిధులను సమీకరించాలని ప్రతిపాదించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) ఎస్. ఆర్.డి.పి.**1**వ దశ క్రింద జి.హెచ్.ఎం.సి. రూ.200 కోట్ల మేరకు నిధులను సేకరించిన విషయం కూడా వాస్తవమేనా;

ఈ) అయితే, ఇప్పటివరకూ సమీకరించిన నిధులు మరియు కార్యక్రమాల అమలు వివరాలేమిటి ?

**గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన, మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ.కె. తారక రామారావు):-** అ) అవునండీ.

ఆ) బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.1000 కోట్ల మొత్తాన్ని సమీకరించాలని జి. హెచ్. ఎం.సి. ప్రతిపాదించింది. రూ.200 కోట్ల మొదటి విడత మొత్తాన్ని ఇప్పటికే సమీకరించిది.

ఇ) అవునండీ.

ఈ) బాండ్ల ద్వారా రూ.200 కోట్ల మొదటి విడత మొత్తాన్ని సమీకరించి, అనేక రోడ్ల పనులను చేపట్టడమవుతున్నది.

SRI M.S. PRABHAKAR RAO:- Sir, first I would like to congratulate our Hon'ble Minister. Recently we have seen several International and National Summits. To quote some – Global Entrepreneurs' Summit, World I.T. Congress, Asian Mining Summit and many more Summits. Our GHMC has played very important role and we have received several appreciations from delegates from all over the world.

చాలా సంతోషం. ఈ రోజు జిహెచ్ఎంసి చాలా కీలకమైన బాధ్యతలు నిర్వరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా మన కార్పొరేషన్‌కి చాలా మంచి పేరు ఉంది. సుమారు 624 కిలోమీటర్ల జియోగ్రాఫికల్ ఏరియా, అదే విధంగా ఒక కోటి మంది జనాభా ఉండగా, అందులో నాలుగవ వంతు జనాభా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. మన జిహెచ్ఎంసికి అనేక కార్యక్రమాలు ఉన్నాయి. అందులో శానిటేషన్ కాని, మౌలిక వసతుల కల్పనకాని, రోడ్ల నిర్వహణకాని, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కాని,

అలాగే ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కాని, అలాగే ప్రొటెక్షన్ ఆఫ్ ఏనిమల్ వెల్ఫేర్కానీ, ఈ విధంగా వివిధ రకాలైన విధులు నిర్వర్తించవలసి ఉంటుంది, besides regular activity of town planning and tax administration.

మన హైదరాబాద్లో 9135 కిలోమీటర్ల రోడ్స్ ఉన్నాయి. అందులో బిటి రోడ్లు 4173 కిలోమీటర్లు, సిసి రోడ్లు 3937 కిలోమీటర్లు, మట్టి రోడ్లు 856.78 కిలోమీటర్లు మెటల్ రోడ్లు 81 కిలోమీటర్లు, ఎస్ఎస్ ఫ్లోరింగ్ 59 కిలోమీటర్లు. మొత్తం దాదాపు 9103 కిలోమీటర్లు. ఇంత పెద్ద ఎత్తున ఈ రోజు ఈ జిహెచ్ఎంసి వారు కార్యక్రమాలు చేస్తున్నారు. అందుకు నిధులు కూడా ఎక్కువగా కేటాయించవలసిన అవసరం ఉంది. ఇందులో మనం చూసినట్లయితే 7.89 Sq.Km. రోడ్ని ఐడెంటిఫై చేయడం జరిగింది. ఈ రోడ్లు మొత్తం వర్షాలకు దెబ్బ తిన్నాయి కాబట్టి re-carpet చేయాలని, అందుకొరకు రూ.77.79 కోట్ల రూపాయల వ్యయాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిసింది.

11.20 ఉ. చాలా రోజుల తర్వాత జిహెచ్యంసి వాళ్లు బాండ్స్ను జారీ చేస్తున్నారు. అసలు ఈ బాండ్స్ పద్ధతేమిటి? ఏవిధంగా బాండ్స్ జారీ చేయబోతున్నాం? రేట్ ఆఫ్ ఇంట్రెస్టు ఎంత ఉంటుంది? ఏ స్కీము క్రింద తీసుకోబోతున్నాం? వచ్చిన నిధులను కేవలం రోడ్లు వేయడానికేనా లేక ఇతర కార్యక్రమాలు అంటే నగరంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి కూడా వినియోగిస్తారా? చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మాదాపూర్ ఇన్ఆర్బిట్ మాల్ దగ్గర టన్నెల్ నిర్మాణం ఇంతకు ముందు ప్రతిపాదించారు. ఈ టన్నెల్ సుమారు 5.5 కిలోమీటర్ల పొడవు ఉంటుందని గతంలో చెప్పారు. కానీ ఇప్పుడు దాన్ని 2.5 కిలోమీటర్లకు తగ్గిస్తున్నామని జిహెచ్ఎంసి వాళ్లు చెబుతున్నారు. గతంలో ఈ ప్రాజెక్టు కాస్ట్ రూ.1100 కోట్లని చెప్పారు. ఇప్పుడు దాన్ని రూ.600 కోట్లకు తగ్గిస్తున్నామంటున్నారు. ఎందుకు దీన్ని తగ్గించారని అడిగితే – ఇప్పుడు మాకు ఫైనాన్షియల్ క్రైసిస్ ఉంది, మేము దీనికి తట్టుకోలేం, నిధులు వచ్చిన తర్వాత కానీ చేయలేం అని జిహెచ్ఎంసి వాళ్లు చెబుతున్నారు. ఎస్ఆర్డిపి క్రింద ఎన్ని రోడ్లను ఐడెంటిఫై చేశారు, వీటిని ఎన్ని ప్యాకేజీలలో చేపట్టబోతున్నారు? ఈరోజు హైదరాబాదులో ట్రాఫిక్ విపరీతంగా ఉంది, కాలుష్యం పెరిగిపోతోంది. హైదరాబాదు నగరంలో లక్ష, రెండు పడక గదుల ఇళ్లు కడతామని చెప్పారు. ఈ విషయంలో చాలా వేగంగా ముందుకు పోతున్నారు. స్టీలు ధరలకు సంబంధించి ఇటీవల అగ్రిమెంటు జరిగింది. అగ్రిమెంటు సమయంలో స్టీలు టన్ను ధర రూ.30వేలు. కానీ ఇప్పుడు టన్ను రూ.47 వేలకు పెరిగింది. స్టీలు లేదు కాబట్టి పనులు ఆగిపోయాయి. 25 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం ఉంది. Are you going to spend SRDP funds for Double Bed Room Housing Scheme also? దయచేసి చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**డా. ఆర్. భూపతిరెడ్డి:–** అధ్యక్షా, హైదరాబాదులో ఎస్ఆర్డిపి చేపట్టడం అన్నది ఒక గొప్ప నిర్ణయం. Hyderabad is most happening city, global city అంటున్నాం. Northern part of city, mainly National Highway No.44 (Old National Highway No.7) లో మేడ్చల్ నుంచి ప్యారడైజ్ వరకు సిటీలోకి ఎంటర్ కావడానికి, అదే విధంగా మెదక్, నిజామాబాదు, ఆదిలాబాదుకు వెళ్లే నిమిత్తం సిటీ నుంచి బయట పడడానికి ఒక గంట పడుతోంది. మంత్రిగారికి ఈ విషయం తెలుసు. ఈ మార్గంలో హెవీ బిజినెస్ యాక్టివిటీ ఉంటుంది, బాటిల్నెక్స్ ఉన్నాయి. కాబట్టి ఎస్ఆర్డిపిలో కొంపల్లి నుంచి ప్యారడైజ్ వరకు ఏదైనా ఫ్లైఓవర్ వేసే ప్లాన్ ఉందా? వేస్తే దాన్ని మొదటి ఫేజులో టేకప్ చేయాలని కోరుతున్నాను. మంత్రిగారు ఆ రూటులో కామారెడ్డి నుంచి వస్తుంటారు కాబట్టి వారికి సమస్య ఏమిటో బాగా తెలుసు.

**శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజక వర్గం):–** అధ్యక్షా, హైదరాబాదులో ఇప్పటికే మంచి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. నగరం నుంచి నిజామాబాదు, కరీంనగర్, వరంగల్, నర్సాపూర్కు వెళ్లే రోడ్లలో రద్దీని తగ్గించడానికి, వాహనాలు సాఫీగా ముందుకు కదలడానికి ఫ్లైఓవర్స్ నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉంది. ఇదివరకు పేపర్లలో కూడా వీటి గురించి చదివాము. ఆ ఫ్లైఓవర్లను ఎప్పుడు చేపడుతారో చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ఎస్. రామచంద్రరావు:–** అధ్యక్షా, ఎస్ఆర్డిపి చాలా అవసరం, ఇది మంచి ఆలోచన. గతంలో మహారాష్ట్రలో పూనె – బొంబాయి హైవే నిర్మాణం చేపట్టినపుడు బాండ్స్ జారీ చేస్తే చాలా ఫండింగ్ వచ్చింది. హైదరాబాదులో ఎస్ఆర్డిపి ప్రాజెక్టు కాస్ట్ రూ.20 వేల కోట్లని గతంలో చెప్పారు. వెయ్యి కోట్లు సరిపోదనే మాట ఉంది. పబ్లిసిటీ చేస్తే ఎక్కువ బాండ్స్ సేల్ అయ్యే అవకాశం ఉంది. మూసీ ప్రాజెక్టు ఏదైతే ఉందో అది whether it is covered under SRDP or not? చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

which will cover all the civic amenities like water supply, sanitation, transport, public transport,

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): GHMC کے ذریعہ SRDP جو takeup کر رہے ہیں۔ 2016ء میں جب GHMC کے انتخابات ہوئے تھے اس سے پہلے ایک comprehensive رپورٹ ریاستی حکومت کی طرف سے بنائی گئی تھی۔اور کے سی آر صاحب نے 76,000 کروڑ روپے پر مشتمل comprehensive plan کا اعلان بھی کیا تھا جو پورے Hyderabad Metropolitan area کے لئے تھا۔

MMTS Phase - II. All these things were put together and a comprehensive plan of Rs. 76,000 Crores was prepared and it was to be posed to BRICS bank i.e., the bank which is started by the BRICS Countries and the CM Saab has also said that when he had been to China he had discussed the issue with the Chairman of the BRICS Bank and I just want to know the fate of that project and the Central Government have claimed that they have not received any such report and they have not posed it to the BRICS bank.

**శ్రీ కె. తారక రామారావుః–** అధ్యక్షా, ముందుగా తమరి అనుమతితో గౌరవ సభ్యులకు ఒక విషయాన్ని నివేదించదలచుకున్నాను. గౌరవ సభ్యులు చాలా ఆసక్తిగా చాలా ప్రశ్నలు అడిగారు. మెర్సర్ అనే ఒక ఇండిపెండెంట్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఉన్నత ప్రమాణాలు కలిగిన నగరాలకు ప్రతి సంవత్సరం ఒక రేటింగ్ ఇస్తుంది. అందులో భాగంగా సంతోషకరమైన వార్త ఏమంటే – తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగో సంవత్సరంలో ఉన్నాం, ఈ సంస్థ వరుసగా నాలుగు సంవత్సరాల పాటుగా ఇచ్చిన రేటింగులో భారతదేశంలో బెస్ట్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ ఉన్న నగరంగా హైదరాబాదు నగరాన్ని మరొకసారి ఎంపిక చేసిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. దానికి ప్రత్యేకంగా వారు చెప్పిన కారణాలేమంటే – క్వాలిటీ ఆఫ్ లివింగ్ మెరుగ్గా ఉండడానికి లా అండ్ ఆర్డర్, వాటర్ సప్లై, పవర్ సప్లై. దీంతోబాటు బేసిక్‌గా మనం ప్రజలకు కల్పించే మౌలిక వసతుల విషయంలో భారత దేశంలో ఉన్న అన్ని నగరాలలో హైదరాబాదు ఉత్తమంగా ఉందని నాలుగో సంవత్సరం కూడా వారు రేటింగ్ ఇచ్చారు.

గౌరవ సభ్యులు చాలా ప్రశ్నలు అడిగారు. గౌరవ ముఖ్యమంత్రిగారు మున్సిపల్ శాఖను చూసిన తొలినాళ్లలో ఎస్ఆర్‌డిపికి రూపకల్పన చేయడం జరిగింది. మొదట రూ.23 వేల కోట్ల అంచనాలతో హైదరాబాదు నగర వ్యాప్తంగా స్కైవేస్, రోడ్లు అత్యున్నత ప్రమాణాలతో నిర్మించాలనే ఆలోచనతో ముందుకు పోతున్నాం. ప్రస్తుతం రూ.3 వేల కోట్ల పైచిలుకు పనులు జరుగుతున్నాయని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఒకటి ఈ మధ్య ప్రారంభించాం. మీరు ఈ సంవత్సరం చాలా పనుల ప్రారంభాలు చూస్తారు. ఎందుకంటే చాలా చోట్ల పనులు శర వేగంగా జరుగుతున్నాయి. దశల వారీగా చాలా కార్యక్రమాలను మనం ప్రారంభించుకోబో తున్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఇందులో భాగంగా హైదరాబాదులో అన్ని మూలలా ఓల్డ్ సిటీ గానీ, న్యూ సిటీ గానీ అన్ని ప్రాంతాలను సమన్వయం చేసుకుంటూ పనులు జరుగుతున్నాయని తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు మున్సిపల్ బాండ్స్ జారీ గురించి అడిగారు. గౌరవ ప్రధానమంత్రి గారు నవంబర్ 29న మెట్రో రైలు ప్రారంభోత్సవ సందర్భంగా హైదరాబాదుకి వచ్చారు. వారితో కలిసి నేను రైలులో ప్రయాణం చేసిన సందర్భంగా వారు ఒక ప్రశ్న అడిగారు. మీరు హైదరాబాదు నగరానికి సంబంధించి మున్సిపల్ బాండ్స్ ఏమైనా జారీ చేస్తున్నారా అని అడిగారు. సార్, వెయ్యి కోట్ల రూపాయల బాండ్స్ జారీ చేస్తున్నామని చెబితే, చాలా సంతోషం, కేంద్ర ప్రభుత్వం కూడా దీనికి మద్దతు ఇస్తుంది, చేయండన్నారు. గతంలో నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అహ్మదాబాదులో చేశాను, 8 ఏళ్ల క్రితం పూనెలో చేశారు, దానికి కంటె పెద్ద మొత్తంలో మీరు చేస్తున్నారు, చాలా సంతోషమని ప్రధానమంత్రి గారు అన్నారు.

గౌరవ సభ్యులు రామచంద్రరావు గారు మాట్లాడుతూ, ఇంకా ఎక్కువగా నిధులు సేకరించవచ్చని చెప్పారు. దాని కోసం జిహెచ్ఎంసి చాలా ప్రయత్నం చేసింది. ఏవిధంగా మున్సిపల్ బాండ్స్ సేకరించవచ్చనే దానికి స్టాక్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్ ఉంటాయి. దీంట్లో కఠినమైన నియమాలు ఉంటాయి. వాటికి లోబడి, ఒక రేటింగ్ సంస్థ క్రిసిల్ , subject to correction, ద్వారా రేటింగ్ చేయించుకున్నాం. మనకి AA rating వచ్చింది. హైదరాబాదు నగర పాలక సంస్థ చాలా బాగా పని చేస్తోంది, రెవెన్యూ మేనేజ్ మెంటు, సంస్కరణలు తీసుకురావడం, ఫైనాన్షియల్ సిస్టంలో బాగా పని చేస్తున్నందున AA rating వచ్చింది. దాని ద్వారా 8.9శాతం వడ్డీకి రూ.200 కోట్లు మొదట సేకరించడం జరిగింది. ఈ సంవత్సరంలో ముందుగా వెయ్యి కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, మొదట రూ.200 కోట్లు సేకరించాం. సంపూర్ణంగా ఈ వెయ్యి కోట్లలో ఒక్క పైసా కూడా పక్కకి పోకుండా ప్రతి పైసా హైదరాబాదు రోడ్ల అభివృద్ధికి , ఎస్ఆర్‌డిపికి పెడతామని ఈసందర్భంగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. తమరి ద్వారా ప్రజలకు కూడా

తెలియజేస్తున్నాను. ఈ విషయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వాన్ని కూడా అడిగాము. ఎందుకంటే వారు దేశ వ్యాప్తంగా ఉన్న అర్బన్ లోకల్ బాడీస్ అయిన కార్పోరేషన్స్, మున్సిపాలిటీలను ప్రోత్సహిస్తున్నారు. మీరు కూడా మున్సిపల్ బాండ్స్ రెయిజ్ చేయమని అంటున్నారు, అందుకే వాళ్లను అడిగాము. 8.9 శాతం వడ్డీకి తీసుకున్నాము కాబట్టి interest subventionకి మీరు కొంత ఇవ్వండి, మీరు చెప్పిన విధంగా చేస్తున్నాం, మీరు కూడా కొంత బాధ్యత తీసుకోండని అడిగాము. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ హర్‌దీప్‌సింగ్ గారికి ఉత్తరం కూడా రాశాను. త్వరలో వారిని కలిసి అడగాలనే ఆలోచన ఉంది.

స్కైవేస్ గురించి గౌరవ సభ్యులు అడిగారు. ఒక బాధాకరమైన విషయాన్ని ఈ సందర్భంగా మీకు నివేదించదలుచుకున్నాను. భూపాల్ రెడ్డిగారు అడిగినా, గంగాధర్‌గౌడ్ గారు అడిగినా, మల్కాజ్‌గిరిలో ఉండే రామచంద్రరావుగారు అడిగినా, వాస్తవం తెలుసుకోవలసిన అవసరం ఉంది. చాలా చిత్తశుద్ధితో ఇప్పటికే చాలా కార్యక్రమాలు ప్రారంభించాం. ఉప్పల్ స్కైవేకి సంబంధించి జాతీయ రహదారుల సంస్థతో కలిసి పని చేస్తున్నాం. ల్యాండ్ అక్విజిషన్ కాస్ట్ మనం పెడుతున్నాం, ఎన్‌హెచ్ఏఐ నుంచి వాళ్లు కూడా డబ్బులు ఇస్తున్నారు. ఇద్దరం సంయుక్తంగా కలిసి చేస్తున్నాం. ఉప్పల్ స్కైవేకి సంబంధించి టెండర్లు కూడా పిలిచారు. తొందర్లో ఆ పనులు ప్రారంభమవుతాయి. దీంతోబాటు శంషాబాదు విమానాశ్రయానికి పోయే రహదారి ఏదైతే ఉందో, ఆరాంఘర్ చౌరస్తా నుంచి ఇంకా ముందుకు ఆర్ అండ్ బి డిపార్టుమెంటు, ఎన్‌హెచ్ఏఐ తో కలిసి సంయుక్తంగా చేయాలని జిహెచ్ఎంసి ప్లానింగ్‌లో ఉంది. అక్కడ కూడా ఇంకొక స్కైవే నిర్మాణానికి ఏ ఆటంకాలు లేకుండా ముందుకు పోతున్నాం.

ఉత్తర తెలంగాణకు పోయే రెండు కీలకమైన రహదారులున్నాయి. ఒకటి – ఆదిలాబాదు వైపు పోయే జాతీయ రహదారి, రెండు – రామగుండం వైపు పోయే రాజీవ్ రహదారి. ఈ రెండు రహదారుల మధ్యలో కంటోన్మెంటు ప్రాంతం ఉంది. మొత్తం కలిపి 160 ఎకరాల స్థలం డిఫెన్స్ వాళ్లు మనకు ఇవ్వాలి. అక్కడ స్కైవేస్ కట్టడానికి మేము సిద్ధంగా ఉన్నాం. హెచ్ఎండిఏకి ఇప్పటికే మేము ఆదేశాలు ఇచ్చి ఉన్నాం. డబ్బులు కూడా రూ.2500 కోట్లు రెడీగా పెట్టుకొని ఉన్నాం. కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిన మరునాడే టెండర్లు పిలిచి పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. డబ్బులకు ఏమాత్రం ఇబ్బంది లేదు. కానీ బాధాకరమైన విషయం ఏమంటే – కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా రక్షణ శాఖ రకరకాల ఇబ్బందులు పెడుతోంది. మేము మూడేళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్నాం. ఏదో ఒకటి చెబుతారే తప్ప ఇప్పటి వరకు ఆ స్థలం ఇవ్వడానికి వాళ్లు ఒప్పుకోవడం లేదు. చిత్ర విచిత్రమైన విన్యాసాలు చేస్తున్నారు. అసలు ప్రభుత్వానికి – ప్రభుత్వానికి మధ్య భూమి బదలాయింపు చేయడానికి డబ్బులు అడగకూడదు. కానీ డబ్బులు కట్టమంటున్నారు. డబ్బులు కడతాం, లేదంటే దానికి సమాన విలువైన స్థలం ఇస్తామన్నాం. వంద ఎకరాలకు గాను ఆరు వందల ఎకరాలు శామీర్‌పేటలో ఇవ్వండన్నారు. దానికి కూడా ఒప్పుకున్నాం. మేము ఆవిధంగా ఒప్పుకున్న తర్వాత ఈ మధ్య ఒక విచిత్రమైన ఉత్తరం రాశారు. మా స్థలం వంద ఎకరాలు పోతోంది కాబట్టి, అక్కడ కనుక మేము బిల్డింగులు కట్టి ఉంటే దాని మీద మాకు సంవత్సరానికి రూ.30 కోట్ల ఆదాయం వచ్చేది, కాబట్టి శాశ్వతంగా ప్రతి సంవత్సరం మాకు రూ.30 కోట్లు కట్టాలని ఒక విచిత్రమైన ఉత్తరం రాశారు. ఇదేమి ఆలోచనా విధానమో మాకు అర్థం కాలేదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అన్నపుడు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి, కలిసి పని చేసే ఆలోచన ఉండాలి. ప్రభుత్వంలో ఎవరున్నా కలిసి ముందుకు పోయే ఆలోచన చేయాలే తప్ప ఈ రకమైన ఇబ్బందులు పెట్టకూడదు. ఈ రెండు రహదారులకు ప్రధాన అవరోధం – రక్షణ శాఖ భూములు ఇవ్వకపోవడం, వారు సహాయ నిరాకరణ చేయడం. అన్ని రకాలుగా రెడీగా ఉన్నప్పటికీ ముందుకు పోలేని పరిస్థితి ఉన్నది. ఈ విషయం సభ ద్వారా ప్రజలకు తెలియజేయాలనే సావధానంగా చెబుతున్నాను. మరొకసారి చెప్పదలుచుకున్నాను, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే నూటికి నూరు శాతం ఈ రెండు స్కైవేలను చేపట్టడానికి రెడీగా ఉన్నాం. మిగతా మార్గాలలో ఎక్కడెక్కడైతే స్కైవేస్ చేస్తామని చెప్పామో అక్కడ ముందుకు పోతున్నాం. ఉప్పల్‌లో ముందుకు పోతున్నాం, ఆరాంఘర్ చౌరస్తాలో ముందుకు వెళుతున్నాం, ఎస్ఆర్‌డిపి లో ఇంకా చాలా కార్యక్రమాలు చేస్తున్నాం, వాటిని కూడా ముందుకు తీసుకొని పోతాం.

గౌరవ సభ్యులు ప్రభాకర్ రావు గారు మాదాపూర్ టన్నెల్ గురించి అడిగారు. దుర్గం చెరువు మీద కేబుల్ బ్రిడ్జ్ వస్తోంది. దాని తర్వాత ఒక టన్నెల్ వస్తోంది. దాన్ని మేము ఏదో కుదిస్తున్నామని వారు అన్నారు. ఫైనాన్షియల్ క్రైసిస్ ఉందన్నారు. ఫైనాన్షియల్ క్రైసిస్ ఏమీ లేదండీ. టన్నెల్‌ని కుదించే ఆలోచన ఏమీ లేదు, మొత్తంగా ఆ ప్రాజెక్టు చేపట్టడానికి రెడీగా ఉన్నాం. కాకపోతే సమాంతరంగా హైదరాబాద్ రోడ్

డెవలప్‌మెంటు కార్పోరేషన్ పనులు నడుస్తున్నాయి. వీళ్లిద్దరి మధ్య చిన్న క్లాష్ రావడం వల్ల ఖాజాగూడ చౌరస్తా నుంచి నానక్‌రామ్‌గూడ వరకు ఉన్న రోడ్డును ఎస్ఆర్‌డిపిలో ఆరు లేన్లుగా విస్తరిస్తున్నాం. కాబట్టి ప్రస్తుతానికి అక్కడి వరకు ప్రాజెక్టును పూర్తి చేసి, తాత్కాలికంగా వాయిదా వేసి తదనంతరం నానక్‌రామ్‌గూడ చౌరస్తా పైకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం. జాఫ్రీ గారు మాట్లాడుతూ, మూసీకి సంబంధించి ఏదైతే ప్రాజెక్టు చేపడుతున్నారో అది ఇందులో వస్తుందా అని అడిగారు.

صاحب' موسی ندی کے لئے Musi River Development Corporation قائم کیا گیا ہے۔ اسی project میں وہ کام لینا پڑے گا اور پھر اس میں سنٹرل گورنمنٹ کی بھی مالی مدد لینی ہوگی۔

రామచంద్రరావు గారు కూడా మూసీ ప్రాజెక్టు గురించి అడిగారు, ఆల్‌రెడీ ఆ విషయం చెప్పాను. Hydrological studies have been completed by our department. We have already submitted for environmental clearance. As soon as environmental clearance comes through, hopefully by August 2018 we would like to start Musi Skyway. I would like to submit once again sir this is again where we run into problems because of Central Government, any money that has to come to our system or our Country has to come through DEA (Department of Economic Affairs) has to approve. So, Whatever we have submitted to BRICS bank after Hon'ble CM's discussion with BRICS Bank Chairman. Unfortunately it has not been sent to the BRICS bank through Government of India but without waiting for them we have continued our efforts and we are borrowing from the market through Municipal Bonds and through Government support also we are taking the project forward without really waiting for anybody's support. But comprehensive studies that have been done including Unified Metro Transport Authority - they are ongoing and that discussion will continue to grow because Hyderabad is growing and that discussion will also continue to grow.

**శ్రీ ఎన్. రామచంద్రరావు:–** సార్, మంత్రిగారు డిఫెన్స్ మినిస్ట్రీ గురించి చెప్పారు. నేను డిఫెన్స్ మినిస్టర్ శ్రీమతి నిర్మలా సీతారామన్ గారిని కలిశాను. లాస్ట్ టైమ్ ఢిల్లీకి పోయినపుడు మిలిటరీ భూముల గురించి రిప్రజెంట్ చేస్తే, తప్పకుండా స్టేటు గవర్నమెంటుతో చర్చించి శాశ్వతంగా పరిష్కారం చేస్తామన్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఆల్టర్నేటివ్ రోడ్లు నిర్మించాలని చెప్పారు. దాని విషయం మాట్లాడితే, మీరు అడిగిన మిలిటరీ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఒప్పుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం రూ.30 కోట్లు కట్టమని డిఫెన్స్ వాళ్లు అడుగుతున్నారని మీరు చెప్పారు. అటువంటిది ఏమైనా ఉంటే We are ready to represent on behalf of our State also. ఇది స్టేట్ సబ్జెక్టు కాబట్టి definitely from our side we are ready to represent. ఆల్‌రెడీ నేను నిర్మలా సీతారామన్ గారితో మాట్లాడాను. She said that they are ready to co-operate with the State Government as far as these roads are concerned.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు:–** సార్, మంత్రిగారు మాట్లాడుతూ రోడ్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ గురించి ప్రస్తావించారు. దీన్ని ఏర్పాటు చేయడానికి గల ఉద్దేశ్యం ఏమిటి? జిహెచ్ఎంసి కి సంబంధించిన ఎన్ని రోడ్లను వాళ్లకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు? జిహెచ్ఎంసి ప్రాపర్టీస్‌ని దానికి ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారో చెప్పాలని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:–** డిఫెన్స్ మినిస్టర్‌గారి డిఫెన్స్‌కు వచ్చినందుకు సభ్యులు రామచంద్రరావు గారికి ధన్యవాదాలు. ఈ సబ్జెక్టుపై హైయస్ట్ లెవల్‌లో గౌరవ ముఖ్యమంత్రిగారు స్వయంగా ముగ్గురు డిఫెన్స్ మినిస్టర్స్‌తో మాట్లాడారు, ఒకరితో కాదు. ఇప్పుడు నిర్మలా సీతారామన్‌గారు ఉన్నారు, అంతకు ముందు జైట్లీ గారున్నారు, వారి కంటె ముందు మనోహర్ పారికర్ గారున్నారు. ఈరోజు కంటోన్మెంటు చుట్టూ హ్యాబిటేషన్స్ వచ్చేశాయి. కంటోన్మెంట్ వేరేగా ఊరి అవతల లేదు. నిజానికి ఈ డిఫెన్స్ వాళ్లు చాలా రకాలుగా ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఈ విషయంలో ఏమీ అనుకోకూడదు. ఎందుకంటే రోడ్లు మూసేయడం వంటి పనులు చేస్తున్నారు. దశాబ్దాల పాటు ప్రజలు ఆ రోడ్లను వాడుకుంటున్నారు. శాంతి భద్రతల సమస్య లేని రోడ్లను మేము మూసేస్తామని ఏకపక్షమైన నోటీసులు ఇవ్వడం, జిహెచ్ఎంసిని సతాయించడం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇది మంచి పద్ధతి కాదు. ఎందుకంటే ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. It is an institution sir and it is an ongoing process, if the previous Government was unreasonable your Government should be reasonable or the Central Government should be reasonable, it's our Government also by the way. The point I am trying to make is - రామచంద్రరావు గారూ, ఢిల్లీలో మీకున్న పలుకుబడిని ఉపయోగించి అనుమతులు తీసుకొని వస్తామంటే, తెల్లారే మీ డిఫెన్స్ మినిస్టర్

గారిని పిలిపించి, మీతోటే కొబ్బరి కాయ కొట్టించి స్కైవేస్ ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. డిఫెన్స్ డిపార్టుమెంటు బాధ్యతను మీరు తీసుకొని, మీరు, మీ రాష్ట్ర నాయకత్వం పోయి అనుమతులు తీసుకొస్తే సంతోషం. మేము మూడు సంవత్సరాల నుంచీ అడుగుతున్నాం, ఒప్పుకోవడం లేదు. మీరెళ్లి అడిగితే ఇస్తారేమో మాకు తెలియదు.

హెచ్ఆర్‌డిసి గురించి ప్రభాకర్ రావు గారు అడిగారు. హైదరాబాదులో 9100 కిలోమీటర్ల రోడ్లు హైదరాబాదులో ఉన్నాయి. అందులో కొన్ని మార్గాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి, వాటిలో గుణాత్మకమైన మార్పులు తీసుకరావాలనే ఉద్దేశ్యంతో వైట్ ట్యాపింగ్ రోడ్లు నిర్మించడం, భవిష్యత్తులో గ్లోబల్ సిటీగా ఎదగాలంటే హైదరాబాదులో అందమైన పేవ్‌మెంట్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో కొన్ని రోడ్లను బదలాయించడం జరిగింది. Subject to correction, రూ.600 కోట్ల అంచనాలతో హెచ్ఆర్‌డిసి మొదటి దశ పనులు ప్రారంభమయ్యాయి. ఆ పనులు కూడా ముందుకు పోతున్నాయి. అవి బదలాయించడానికి కారణం – ఒక ఫోకస్డ్ అప్రోచ్‌తో పనులు జరగాలనే ఉద్దేశ్యం తప్ప వేరే ఉద్దేశ్యంతో కాదని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్ః–** సభ్యుని కోరిక మేరకు ప్రశ్న నెం.2790(49)ను వాయిదా వేయడమైంది.

## సొంత భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రశ్న నెం.2729(50)

సర్వశ్రీ కాటేపల్లి జనార్థన్ రెడి మరియు పూల రవీందర్, ఎం.ఎల్.సి.లుః– గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) అద్దె నిమిత్తం లక్షలాది రూపాయలను చెల్లిస్తూ అనేక ప్రభుత్వ కార్యాలయాలకు ప్రైవేటు భవనాలలో వసతిని కల్పించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, దానికి గల కారణాలేమిటి;

ఇ) వాటికి ప్రస్తుతమున్న సొంత భవనాలలో లేదా కొత్త భవనాన్ని నిర్మించడం ద్వారా వసతిని కల్పించే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఈ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి?

**రోడ్లు, భవనాల శాఖామంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వరరావు)ః–** అ) ప్రైవేటు భవనాలలో సమకూర్చిన వసతిపై సమాచారాన్ని సమకూర్చవలసిందిగా జిల్లా కలెక్టర్లకు లేఖ వ్రాయడమయింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) అవునండీ.

జిల్లా ప్రధాన కార్యస్థానాలలోని వివిధ శాఖల కార్యాలయాలకు వసతిని కల్పించడం కోసం 21 కొత్తగా ఏర్పడిన జిల్లాలలోను, 5 పాత జిల్లాలలోను ఏకీకృత కార్యాలయ కాంప్లెక్సుల నిర్మాణాన్ని రోడ్లు, భవనాల శాఖ చేపట్టింది.

ఈ) వివిధ శాఖల నుండి అభ్యర్థన అందిన మీద, మరియు పరిపాలక మంజూరును పొందిన తరువాత కార్యాలయ భవన నిర్మాణాన్ని రోడ్లు, భవనాల శాఖ చేపడుతున్నది.

**శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డిః–** అధ్యక్షా, మన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలు/ప్రైవేటు భవనాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయో చెప్పాలని మేము కోరడం జరిగింది. అద్దె రూపంలో చెల్లిస్తున్న మొత్తాలను నివారించడానికి ఏ సంవత్సరం లోపల నూతన ప్రభుత్వ భవనాలు నిర్మించి అందులోకి కార్యాలయాలను షిఫ్ట్ చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందో చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను. అదే విధంగా 21 నూతన జిల్లాలలో, అదే విధంగా 5 పాత జిల్లాలలో సమీకృత కార్యాలయాల నిర్మాణం చేపట్టడం జరిగిందని చెప్పారు, చాలా సంతోషం. అవి ఎప్పటిలోగా పూర్తయ్యే అవకాశం ఉందో చెప్పాలని కోరుతున్నాను.

**శ్రీ పూల రవీందర్ః–** అధ్యక్షా, 21 నూతన జిల్లాలలో, అదే విధంగా 5 పాత జిల్లాలలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్సులను ఏర్పాటు చేస్తున్నందుకు ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎప్పటి లోపల పూర్తయ్యే అవకాశం ఉంది? మనం 119 బిసి రెసిడెన్షియల్ స్కూల్స్‌ను స్టార్ట్ చేసుకున్నాం. వచ్చే సంవత్సరం వీటికైనా సొంత భవనాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందా?

**11.40 ఉ.** అధ్యక్షా, ఎం.ఆర్.సి. భవనాలు మండల విద్యా శాఖకు ఉన్నాయి. కానీ, వాటి నిర్వహణ కొరకు జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు లేనందున, గౌరవ మంత్రిగారిని తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ, నిర్మాణంలో ఉన్న భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలుపవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావుః–** అధ్యక్షా, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం అనేక శాఖల సమన్వయంతో ముడిపడి ఉంది. గౌరవ సభ్యులు కోరిన సమాచారాన్ని ఆయా

శాఖల నుండి తెప్పించి వారికి పంపిస్తాం. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఇబ్బందులను గౌరవ ముఖ్యమంత్రి గారు గ్రహించి, పరిపాలన సౌలభ్యం కోసం 31 క్రొత్త జిల్లాలలోని 26 జిల్లా కేంద్రాల్లో రూ.900.00 కోట్లు ఖర్చుతో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఆ భవనాలు పూర్తయితే, ఇప్పటిదాకా అద్దె భవనాలలో ఉంటున్నటువంటి వివిధ శాఖల కార్యాలయాలను ఆ భవనాలలోకి మార్చేందుకు అవకాశం కలుగుతుంది. ఒక సంవత్సరం లోగా, మళ్ళీ ఉగాది పండగ వచ్చే లోపల ఆ భవనాలను ఉపయోగంలోకి తీసుకువచ్చే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుందని తెలియజేస్తున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:–** ప్రత్యేక ప్రస్తావనలు.

**శ్రీ ఎస్. రామచంద్ర రావు:–** అధ్యక్షా, 'ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' మన రాష్ట్రంలో ఫార్మ్–డి కోర్సుకు 2008వ సంవత్సరంలో అనుమతినివ్వడం జరిగింది. 2008వ సంవత్సరం నుండి నేటి వరకు 5800 మంది ఫార్మ్–డి విద్యార్థులు ఆ కోర్సును పూర్తి చేశారు. వాళ్ళ కెరీర్ ఇక్కడే ఉంటుంది కాబట్టి, వాళ్ళకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో గానీ, ప్రైవేటు ఆసుపత్రుల్లో గానీ ఉద్యోగాలివ్వాలని వారు కోరుతున్నారు. ఆ విషయమై తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత 2015వ సంవత్సరంలో ఒక జి.ఒ. ద్వారా త్రిసభ్య కమిటీని వేయడం జరిగింది. ఆ కమిటీ ఇంత వరకు రిపోర్టును ఇవ్వలేదు. దాని వల్ల వీళ్ళ కెరీర్ రోడ్ల మీదకు వచ్చింది. కాబట్టి, వీరి భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం త్వరగా రిపోర్టును తెప్పించి ఫార్మ్–డి కోర్సు పూర్తి చేసిన వారికి తగు న్యాయం చేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కమిటీ రిపోర్టుని కూడా ఫైనలైజ్ చేశారు. రిపోర్టు అందగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, పాఠశాలల్లో పాఠ్యాంశాల మీద ఒత్తిడి మూలానో ఏమో గానీ చాలా మంది పిల్లలకు ఇబ్బంది కలుగుతున్న మాట వాస్తవం. కాబట్టి, పాఠశాలల్లో సైకాలజిస్ట్ సేవలను వినియోగించుకోవలసిన అవసరమున్నది. అటువంటి ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలన చేయవలసినదిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

**శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి:–** అధ్యక్షా, మన రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగినటువంటి ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్‌లో మాడపాటి హనుమంతరావు స్కూల్, హనుమాన్ వ్యాయామశాల, ఆంధ్ర విద్యాలయం ఉండగా, కాలేజీ ఎడ్యుకేషన్‌లో వి.వి. కాలేజ్, ఏ.వి. కాలేజ్, న్యూ సైన్స్ కాలేజ్, అంబేద్కర్ కాలేజ్ వంటివి ఉన్నాయి. ఈ ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు రిటైర్ అయిన తరువాత, వారి స్థానాల్లో నియామకాలు జరగడం లేదు. అందువల్ల ఎయిడెడ్ పాఠశాలల్లో, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నష్టం కలుగుతోంది.

కాబట్టి, ఎయిడెడ్ సంస్థలలో పదవీ విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలలో, ప్రభుత్వ పాఠశాలల్లో నియమిస్తున్నట్లుగా విద్యా వాలంటీర్లను నియమించి, ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు కాంట్రాక్టు లెక్చరర్స్‌కు ఇస్తున్నట్లుగా వేతనాలను ప్రభుత్వమే చెల్లించినట్లయితే, ఆ ఎయిడెడ్ సంస్థల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తును కాపాడగలుగుతాం. ప్రస్తుతం అటు మేనేజ్‌మెంట్ పట్టించుకోక, ఇటు ప్రభుత్వం కూడా నియామకం చేపట్టక పోవడంతో ఆ విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. కనుక, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు, కాంట్రాక్టు లెక్చరర్లకు చెల్లిస్తున్నట్లుగా, ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నియమించబడే విద్యావాలంటీర్లకు, కాంట్రాక్టు లెక్చరర్లకు కూడా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు లేవనెత్తిన అంశాన్ని పరిశీలిస్తామని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

**శ్రీ పూల రవీందర్:–** అధ్యక్షా, సింగరేణి కాలరీస్‌లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన రిక్రూట్‌మెంట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్. సింగరేణి పాఠశాలల్లో పనిచేసే టీచర్ల రిక్రూట్‌మెంట్ తదితరాలు వేరుగా ఉంటాయి. సింగరేణి పాఠశాలల్లో పని చేసే టీచర్లు డి.ఎస్.సి. ద్వారా రిక్రూట్ అవుతారు. వారి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అన్నీ కూడా ప్రభుత్వ టీచర్లతో సమానంగా ఉంటాయి.

అధ్యక్షా, సింగరేణి పాఠశాలల్లో పని చేసే టీచర్లు 2002లో 21 రోజులపాటు స్ట్రైక్ చేశారు. ఆ సమ్మె కాలాన్ని లీవ్‌గా పరిగణించాలని గత ప్రభుత్వాలకు కూడా పలు సందర్భాలలో వారు విజ్ఞప్తి చేశారు. ఆ రోజు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సింగరేణి స్కూళ్ళను

ప్రైవేటుపరం చేస్తామన్న పరిస్థితుల్లో ఈ టీచర్లందరూ 21 రోజుల పాటు స్ట్రైక్ చేశారు. ఈ రోజు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు, ఆ రోజు ఎమ్మెల్యేగా ఉంటూ ఆనాటి ముఖ్యమంత్రి గారి వాదనను వ్యతిరేకించారు. ఆ స్టేట్‌మెంట్ గురించి అసెంబ్లీలో కూడా మాట్లాడారు. కాబట్టి, 21 రోజుల సమ్మె కాలానికి ఆ టీచర్లకు అర్హత ఉన్న సెలవు మంజూరు చేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలిపిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

**మిస్టర్ ఛైర్మన్:–** పిటిషన్స్.

## పిటిషన్స్

**డా. ఆర్. భూపతి రెడ్డి:–** అధ్యక్షా, ప్రస్తుత మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి ఆధ్వర్యంలో, 2001వ సంవత్సరంలో ఆనాడు తెలంగాణ ఉద్యమం ప్రారంభమయింది. ఆనాటికి ఆంధ్ర ప్రాంతంలో 7 యూనివర్శిటీలున్నాయనీ, తెలంగాణ ప్రాంతంలో కేవలం 3 యూనివర్శిటీలు మాత్రమే ఉన్నాయని పోరాటం చేయడం జరిగింది. దాని ఫలితంగా తెలంగాణ యూనివర్శిటీ పేరుతో నిజామాబాద్ జిల్లాలో ఒక యూనివర్శిటీని స్థాపించడం జరిగింది. ఆ యూనివర్శిటీకి 550 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింది.

దాదాపుగా, 2006వ సంవత్సరం నుండి 2018వ సంవత్సరం వరకు చూసుకున్నా, కనీస మౌలిక సదుపాయాలు లేక చాలా వెనకబడిపోయింది. నిజామాబాద్ జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా. అక్కడ వ్యవసాయ పరంగా అభివృద్ధి చోటు చేసుకున్నప్పటికీ, విద్యా పరంగా చాలా వెనకబడిపోయింది. విద్యాపరంగా చూస్తే, నిజామాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు కూడా చాలా వెనకబడిపోయాయి.

మొన్నీమధ్యన, కొంతమంది విద్యార్థులు కలిసినప్పుడు, వారు ఒక రిప్రజెంటేషన్‌ను నాకు అందించడం జరిగింది. ఆ రిప్రజెంటేషన్‌ను పిటిషన్ రూపంలో గౌరవ ఛైర్మన్ గారికి అందజేస్తాను. ఆ రిప్రజెంటేషన్‌లోని రెండు, మూడు అంశాలను సభ దృష్టికి తీసుకువస్తాను.

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలను కూడా తెలంగాణ యూనివర్శిటీ పరిధిలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. యు.జి.సి. గ్రాంట్‌ను పొందాలంటే, ఒక యూనివర్శిటీలో 5 ఇంటెగ్రేటెడ్ కోర్సులుండాలి. కానీ, తెలంగాణ యూనివర్శిటీలో ప్రస్తుతం 3 ఇంటెగ్రేటెడ్ కోర్సులున్నాయి. కాబట్టి, ఆ విద్యార్థులు కోరేదేమంటే, తెలంగాణ యూనివర్శిటీలో న్యాయశాస్త్రం తోపాటు, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్స్‌ని కూడా ఓపెన్ చేసి, దానిలో ఇంటెగ్రేటెడ్ కోర్సులను ప్రారంభిస్తే, యు.జి.సి. ద్వారా రూ.100.00 కోట్ల ఫండ్స్ వచ్చే అవకాశముంది.

అక్కడ తెలంగాణ యూనివర్శిటీలో చదువుకుంటున్న దాదాపు 1000 మంది పిల్లలకు, ఆడిటోరియం లేదు, స్పోర్ట్స్ స్టేడియం లేదు,క్వాలిటీ లైబ్రరీ వంటి కనీస మౌలిక సదుపాయాల కొరత ఉంది. అన్ని వివరాలను వ్రాసి ఉన్న రిప్రజెంటేషన్‌ను తమరికి సమర్పిస్తున్నాను.

(పిటిషన్‌ను గౌరవ ఛైర్మన్‌కు అందజేయడం జరిగింది)

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, ఇది వయో వృద్ధులకు సంబంధించిన అంశం. మనం రోజూ పేపర్లలో చూస్తున్నాం, చాలా మంది తల్లిదండ్రులను కొడుకులు గానీ, బిడ్డలు గానీ చూడలేనటువంటి పరిస్థితుల్లో వారి సంక్షేమం బజారున పడేటువంటి పరిస్థితి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ చట్ట ప్రకారంగా వయోవృద్ధులకు ఉన్నటువంటి రైట్స్ ఏమిటి?, వాటిని ఏవిధంగా ప్రొటెక్ట్ చేస్తున్నాం? అనే అంశాలపై 'సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్' తరఫున పిటిషన్స్‌ను తమరికి సమర్పిస్తున్నాను.

(పిటిషన్‌ను గౌరవ ఛైర్మన్‌కు అందజేయడం జరిగింది)

MR. CHAIRMAN: All the papers are deemed to have been laid on the table of the house:

Papers Laid:

A copy in each of the Annual Reports of the Telangana State Electricity Regulatory Commission for the years 2014-2015, 2015-2016 and 2016-2017, as required under Section 104(4) of Electricity Act, 2003.

తేనీటి విరామం కొరకు సభను 15 నిమిషాల పాటు వాయిదా వేస్తున్నాం.

(తేనీటి విరామం కొరకు ఉ.11.50 ని.లకు సభ వాయిదా పడింది)

**12.00 మ.** (తేనీటి విరామానంతరం సభ తిరిగి గం.12.10ని. లకు ప్రారంభమయింది)

**2018 –2019 సంవత్సరానికి వార్షిక ఆదాయ – వ్యయ పట్టిక( బడ్జెట్)పై ఆర్థిక మంత్రి ప్రత్యుత్తరం:**

**మిస్టర్ చైర్మన్:–** 2018–19 సంవత్సరం బడ్జెట్‌పై రెండు రోజులు జరిగిన చర్చకు ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఈటల రాజేందర్ గారు సమాధానం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్:–** అధ్యక్షా, 2018–19 సాధారణ బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న గౌరవ సభ్యులు... శ్రీ ఎన్.రామచంద్రా రావు గారు, శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు గారు, శ్రీ టి.భానుప్రసాద రావు గారు, శ్రీ రాములు నాయక్ గారు, శ్రీ కొంపల్లి యాదవ రెడ్డి గారు, శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ గారు, శ్రీ ఫారూక్ హుస్సేన్ గారు, శ్రీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ గారు, శ్రీ బలసాని లక్ష్మీ నారాయణ గారు, శ్రీ పూల రవీందర్ గారు, డా.ఎం. శ్రీనివాస్ రెడ్డి గారు, శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు గారు, శ్రీ ఎలిమినేటి కృష్ణారెడ్డి గారు మరియు శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి గారు. వీళ్లందరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

అధ్యక్షా, ఇది మేధావుల సభ. కాబట్టి, అనేకమంది గౌరవ సభ్యులు గొప్ప, గొప్ప సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. కొన్ని విమర్శలు కూడా చేయడం జరిగింది. దీనిలో ప్రధానమైనటువంటి విమర్శలు చూస్తే, సభలో మా సమాధానానికి తట్టుకునే సత్తా కాంగ్రెస్ పార్టీకి ఎట్లాగూ లేదు. సభలో ఉంటే మేము చేసే పనులు, చెప్పే విషయాలు అంగీకరించే ఆస్కారం ఉంటుంది. సభల్లో ఏమైనా సమస్యలు లేవనెత్తినప్పుడు అధికార పక్షం సమాధానం చెప్పే ఆస్కారం ఉంటుంది. దాంతో ప్రజలకు నిజాలు తెలిసే ఆస్కారం ఉంటుంది. వారు కన్విన్స్ అయ్యేటటువంటి ఆస్కారం కూడా ఉంటుంది. బయట క్షేత్రంలో ఏది పడితే అది మాట్లాడవచ్చు. ఏ విషయాన్నైనా ప్రస్తావించవచ్చు, ఎన్ని అసత్యాలైనా మాట్లాడవచ్చు, ఎన్ని అడ్డుదారులైనా త్రొక్కవచ్చనే నీచపు సంస్కృతి, సంస్కారానికి నిలువెత్తు సాక్షం కాంగ్రెస్ పార్టీ. అది బయట పడింది.

బాధ అనిపించే అంశం ఏమిటంటే, 21 రాష్ట్రాలలో అధికారాన్ని చెలాయిస్తూ, దేశంలో కూడా అధికారాన్ని చెలాయిస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీకి చెందిన గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారికి అనేక విషయాల పట్ల అవగాహన ఉండాలి, వారు మేధావులు. కానీ, వారు కూడా మూడు విషయాల్లో విమర్శలు చేయడం జరిగింది. అందులో మొదటిది – ఈ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించుతున్నారని, రెండవది – కేటాయింపులు ఉంటున్నాయి గానీ, ఖర్చు పెట్టడం లేదని, మూడవది – ఈ బడ్జెట్ అంకెల గారడీ అనే పద్ధతిలో వారు మాట్లాడడం జరిగింది. అలాంటి అవగాహన లేని మాటలు మాట్లాడితే కొంత బాధ అనిపిస్తది. గత నాలుగు సంవత్సరాల కాలంలో గౌరవ ముఖ్యమంత్రి గారు గానీ, నేను గానీ, నా సహచర మంత్రులు గానీ ఎన్నో పనులు చేస్తున్నాము. దాచేస్తే దాగేది కావు. ఇవి అందరి కళ్లముందు కనబడేవి. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు గానీ, అకౌంట్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు గానీ, డెవలప్‌మెంట్ ఇండికేటర్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలే నిర్ధారించి చెబుతాయి. ఇవన్నీ తెలిసిన తరువాత కూడా, అర్థం అయిన తరువాత కూడా వారు అలాంటి మాటలు మాట్లాడవద్దు. అది వారికి మంచిది కాదు.

మొట్టమొదటి సమావేశంలోనే అన్ని రాజకీయ పార్టీలకు గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక విజ్ఞప్తి చేశారు. మన తెలంగాణ సమాజం ఒక స్థాయి నుండి, కష్టాల నుండి, బాధల నుండి, ఒక్క మాటలో చెప్పాలంటే కుంగిపోయిన సమాజంగా, మేము ఇక బాగుపడలేమో, మేము బీదవాళ్లుగానే ఉండాలేమో, ఇక మన బ్రతుకులు ఇంతేనేమో అనే ఒక భావన నుండి బయటపడి, కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాము. కాబట్టి, కలసికట్టుగా అందరం ఈ తెలంగాణ రాష్ట్రాన్ని గొప్పగా నిర్మాణం చేసుకుందాం. మాకు భేషజాలు లేవు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ఎలా అయితే కలసికట్టుగా పనిచేశామో, అదేవిధంగా రాష్ట్రనిర్మాణంలో కూడా కలసికట్టుగా పని చేస్తామని, పని చేయాలని చెప్పడం జరిగింది.

ఈరోజు లేవనెత్తిన ఏ అంశాలైతే ఉన్నాయో, వాటిని 2014లో లేవనెత్తారు, 2015లో లేవనెత్తారు, 2016లో లేవనెత్తారు, 2017లో కూడ లేవనెత్తారు. ఈ రాష్ట్రం ఒక గొప్ప రాష్ట్రంగా ఎదగాలని మేము కలలు కంటున్నామని గౌరవ ముఖ్యమంత్రి చెప్పడం జరిగింది. ఇదేదో అధికార మార్పిడిలో భాగంగా వచ్చిన రాష్ట్రం కాదు. 56 సంవత్సరాల కాలంపాటు ఏ దుఃఖాన్నైతే, బాధనైతే అనుభవించామో ఆ దుఃఖానికి, ఆ బాధకి చరమగీతం పాడి దేశ చిత్రపటం మీద తెలంగాణ రాష్ట్రం గొప్ప రాష్ట్రం, పేద రాష్ట్రం కాదని ఎస్టాబ్లిష్ చేయడం కోసం మనం పునాదులు వేసుకోవాలని వారు చెప్పడం జరిగింది.

మనం అప్పుల్లో ఉన్నామని ఏడ్చుకుంటూ ఉంటే ఎవరూ సహాయం చేయరు. మన కష్టాన్ని మనమే పరిష్కరించుకోవాలి. మన రాష్ట్రాన్ని మనమే బాగు చేసుకోవాలి తప్ప, వేరే వారు ఎవరు బాగు చేయరు. అందుకనే మనం పాజిటివ్‌గా ఉందామని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది.

అంతేకాకుండా, చేసే అప్పుల విషయంలో కూడా దేశాలే కాదు, ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నటువంటి అమెరికా లాంటి దేశంలో కూడా వారికి అప్పులు ఎలా ఉన్నాయి, వారి జిడిపి ఎలా ఉందనే విషయాన్ని తేటతెల్లం చేయడం జరిగింది. బాధాకరమైన అంశం ఏమిటంటే, దేశాలకైతే వారేమైనా పని చేసుకుందామంటే ఎంతైనా అప్పు చేసుకునేటటువంటి స్కోప్ ఉంటుంది, వాళ్లకు పరిమితులుండవు. అదే రాష్ట్రాల విషయానికి వస్తే, రాష్ట్రాలు ఏదైనా అప్పు తీసుకోవాలంటే మన ఇష్టం వచ్చినట్లు అప్పు తీసుకునే ఆస్కారం లేదు. కేంద్ర ప్రభుత్వ చట్టాల పరిమితులకు లోబడి, నిబంధనలకు లోబడి మాత్రమే అప్పు తెచ్చుకోవాలి తప్ప, మనం ఎటు పడితే, అటు అప్పు తెచ్చుకునే ఆస్కారం లేదు.

ఒక కొత్త రాష్ట్రం కనుక, అనేక రకాల పథకాలు ఆవిష్కరించు కొని ముందుకు పోదామని 0.5శాతంతో రెవెన్యూ సర్ప్లస్ స్టేట్‌గా ఉన్నటువంటిది తెలంగాణా రాష్ట్రం. జిడిపిలో 20శాతానికి లోబడి అప్పులున్నటువంటి రాష్ట్రం కాబట్టి, మాకు అర్హత ఉన్నదని కాబట్టి అభివృద్ధి పనులు చేపట్టడానికి అప్పులు తీసుకోవడానికి మాకు అనుమతి ఇవ్వమని గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక పదిసార్లు గౌరవ ప్రధాన మంత్రి గారిని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గారిని కలిసి మాకు కొంత ఎగ్జంప్షన్ ఇవ్వమని విజ్ఞప్తి చేసిన సందర్భం గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారికి కూడా తెలుసు. అందుకనే అప్పులు ఖచ్చితంగా నిబంధనల ప్రకారమే తెచ్చుకున్నాం, ఆ అప్పులు కూడా అప్పు చేసి పప్పు కూడు తినవద్దనే భావనలో ఉన్నటువంటి వాళ్లం. అప్పు చేసి అభివృద్ధి చేసుకుంటున్నామే తప్ప, అస్సెట్స్ క్రియేట్ చేసుకుంటున్నాము తప్ప, భావితరాలు హర్షించే పద్ధతిలో సమస్యల పరిష్కారానికి శాశ్వత పునాదులు వేసుకుంటున్నామే తప్ప, అప్పు చేసి ఏదో ఖరాబు చేస్తున్నామనే భావన తప్పని మీద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఆ లెక్కల్లోకి నేను ఇప్పుడు వెళ్లదలచుకోలేదు. ఎందుకంటే, మొదటిసారి మనం బడ్జెట్‌లో లక్ష కోట్లు పెట్టుకున్నాం. అది కూడా కేవలం పది నెలల కోసమే పెట్టుకున్నాం. అందులో దాదాపు రూ.60,000కోట్లు మనం ఖర్చు పెట్టుకున్నాం. రెండవ సంవత్సరం కొద్దిగా క్లారిటీ వచ్చింది. మొట్టమొదటి సంవత్సరంలో యాంబీషియస్‌గా పెట్టుకోవడానికి కారణం ఏమిటంటే, కొత్త రాష్ట్రం కదా ఏ.పి. రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం కొంత సహాయం చేస్తుందని చెప్పి మనం కొంత సిఎస్‌ఎస్‌లో ఎక్కువ పెట్టుకున్న మాట వాస్తవం. కానీ, కేంద్ర ప్రభుత్వం ఎందుకో ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అందువల్ల మనం రూ.21,000కోట్లు పెట్టుకున్నప్పటికీ అందులో కేంద్రం కేవలం రూ.7,118కోట్లు మాత్రమే ఇచ్చింది. వెంటనే 2015-16లో సర్దుకున్నాం, అర్థం అయిపోయింది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా డబ్బులిచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచించుకుంటుందని ఆలోచించాం. కాబట్టే, రూ.12,400కోట్లు మనం పెట్టుకున్నాం. వాటిలో మనకు కేవలం రూ.9,076కోట్లు సిఎస్‌ఎస్ క్రింద ఇవ్వడం జరిగింది. అదేవిధంగా 2016-17లో కూడా రూ.14,500కోట్లు పెట్టుకుంటే, కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.9,752కోట్లు మాత్రమే.

ప్లానింగ్ కమీషన్ రద్దు చేయబడి దాని స్థానంలో నీతి ఆయోగ్ వచ్చింది. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిసారీ నీతి ఆయోగ్ సమావేశాలకు వెళ్లి వస్తారు. కాబట్టి, వారు సమావేశం నుండి వచ్చిన తరువాత రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందని గౌరవ ప్రధాన మంత్రి గారు చాలా గొప్పగా మాట్లాడారని అన్నారు. ఇవాళ్ల అనేక రకాలైన స్కీములు గానీ, అనేక రకాల సంక్షేమ పథకాలు ఇంప్లిమెంటెడ్ బై స్టేట్స్ ఓన్లీ కదా, నేను కూడా ఒక రాష్ట్రం పరిపాలించి వచ్చినాను కాబట్టి అదే పద్ధతిలో పోతే బాగుంటుందని చెప్పి, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. నీతి ఆయోగ్ సమావేశాలలో పాజిటివ్ అంశాలు కూడా చెప్పడం జరిగింది.

**12.20 మ.** నీతి ఆయోగ్ ఛైర్మన్ ఈ రాష్ట్రానికి వచ్చి మిషన్ కాకతీయ చాలా గొప్పగా ఉంది, ఇది ఒక జీవం కోసం, జీవితం కోసం ఆరాటపడే గొప్ప పథకమని వారు హర్షించడం జరిగింది. ఈనాటికి కూడా 70 సంవత్సరాల చరిత్రలో గుజరాత్ లాంటి రాష్ట్రాలు అసలే నీళ్లకు నోచుకోనటువంటి ప్రాంతాలలో కొంత comprehensive water scheme పెట్టుకొని డెవలప్ చేశారు. దేశంలో త్రాగే నీళ్లకు నోచుకోని రాష్ట్రాలు అనేకం ఉన్నాయి.

ఆదిలాబాద్, వరంగల్ అడవులలో వర్షాకాలం వచ్చినప్పుడు ఆ మురికినీరు, కొత్త నీరు త్రాగి వేలాది మంది విరేచనాలతో రోగాల బారిన పడిన పరిస్థితిని మనం చూస్తున్నాం. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ వ్యాధి వలన ప్రజలు నడుములు, కాళ్లు వంకర పోయిన పరిస్థితి ఉన్న సందర్భంలో స్వయంగా మన ముఖ్యమంత్రి గారే తలాపుకే నాగార్జున సాగర్ ఉన్నా కూడా నీళ్లు లేవని ఆనాడు ఉద్యమ నేతగా పాట రాశారు. అంత వేదనను, అంత దుఃఖాన్ని అనుభవించిన ఈ రాష్ట్రం త్రాగే నీళ్లకు కూడా నోచుకోవద్దా అని వారు ఆనాడు కేంద్రమంత్రిగా

ఉన్నప్పుడు వంద కోట్ల రూపాయలతో కరీంనగర్ డ్యాంలో ఉన్న నీళ్లను తీసుకొని, సిద్ధిపేట నియోజకవర్గంలో ఇంటింటికి నీళ్లు ఇచ్చిన చరిత్ర ఉంది.

ఆ తదుపరి కరీంనగర్ జిల్లాకు కూడా రూ.310 కోట్లను మంజూరు చేస్తే, ఆనాటి ప్రభుత్వం సంకుచితంగా ఆలోచించి, ఇది చేస్తే ఎక్కడ కేసిఆర్ గారికి మంచి పేరు వస్తుందోనని దానిని రద్దు చేయడం వల్ల మనం ధర్నాలు చేయడం జరిగింది. ఇవ్వాళ ప్రభుత్వమే మన చేతులో ఉంది కాబట్టి ఆనాడు చేయలేని పనిని ఒక్క పార్లమెంట్ నియోజక వర్గానికి కాదు, ఒక్క అసెంబ్లీ నియోజక వర్గానికి కాదు ఎంటైర్ రాష్ట్రానికి అప్లై చేయాలని రూ.40,000 కోట్లతో మిషన్ భగీరథ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, అది అమలు చేయకుండా ఓట్లు అడగమని ధైర్యంగా ప్రకటించి ముందుకు పోతున్నాం. ఆ కార్యక్రమాన్ని అనేక రాష్ట్రాల మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు వచ్చి, ఇది ఏలా సాధ్యమవుతుందని ఇవ్వాళ దానిని చూడడానికి వస్తున్నారు.

అంతేకాకుండా నీతి ఆయోగ్ కూడా ఇంత గొప్ప పథకానికి మేము తప్పకుండా అధిక నిధులు ఇవ్వమని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చెప్పింది. కొంత కేంద్రం అలకేషన్స్ చేసిన తర్వాత కూడా మనం కొంత అదనంగా డబ్బు పెట్టుకునే ఆస్కారం ఉంటుంది కాబట్టి ఆ ఫండ్ నుంచి రూ.19,205 కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2017-18 సంవత్సరంలోనైనా రాకపోతాయా, ప్రాక్టికల్‌గా ఆలోచించక పోతారా అని మేము అనుకున్నాం. కానీ ఒక్క సింగిల్ పైసా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

సెంట్రల్ గ్రాంట్స్ విషయంలో పోయిన సంవత్సరం పెట్టుకున్న దానికి కొంత ఇబ్బంది ఎదురైంది. ఈ ఎన్నికల సంవత్సరంలోనైనా దయతలచి ఇస్తారేమో చూడాలి. ఒక ప్రోగ్రెసివ్ స్టేట్‌కి, గొప్ప పథకాలను చేపడుతున్న రాష్ట్రానికి సాయం చేసే ఆస్కారం కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉందేమో అని ఒక ఆశతో ఈసారి కూడా మేము ప్రొవిజన్ పెట్టుకున్నాం.

మీకు తెలుసు. సెంట్రల్ ట్యాక్సెస్ విషయంలో ఎవరూ పైరవీ చేసే అక్కెర లేదు. మన రాష్ట్రానికి 2.43 శాతం రావలసి ఉంటే, దాంట్లో కూడా మనకు అన్యాయం జరుగుతున్న మాట వాస్తవం. దాని ప్రకారంగా మనకు ఎంత రావాలో అంత వస్తుంది అధ్యక్షా. ఒక సంవత్సరం ఒక రూ.500 కోట్లు తక్కువ కావొచ్చు, ఒక సంవత్సరం రూ.600 కోట్లు గాని, రూ.700 కోట్లు గాని, రూ.800 కోట్లు గాని ఎక్కువ కావొచ్చు. మొత్తానికి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చేటువంటి ట్యాక్స్ డెవల్యూషన్‌లో ఎవరి పైరవీలకు ఆస్కారం లేకుండా మన వాటా మనకు వస్తుందని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

అలాగే బడ్జెట్ ఎక్స్‌పెండిచర్‌లో 2015-16 సంవత్సరంలో రూ.1,15,689 కోట్లను మనం కేటాయించుకుంటే, అవి ఖర్చు పెట్టడం లేదని ప్రతిపక్షాల వారు విమర్శిస్తున్నారు. 84.33 శాతం ఖర్చు చేశాం. మేము గత సభలో చెప్పినాం. ఏ ఏ రాష్ట్రాలు బడ్జెట్ ఎలా పెట్టుకుంటాయి, పెట్టుకున్నప్పుడు 15 శాతమా, 20 శాతమా ఎట్లా గ్రోత్ ఉంటుందని ఎక్స్‌పెక్ట్ చేసి పెట్టుకుంటాయి. అంతిమంగా సవరించిన అంచనాలు కావచ్చు actuals కావచ్చు, వాటిలో 90 శాతం నుండి 95 శాతం ఖర్చు పెట్టుకున్న రాష్ట్రాలుంటాయి. 60 శాతం వరకు కూడా ఖర్చు పెట్టుకున్న పంజాబ్ వంటి రాష్ట్రాలుంటాయని తమరికి చెప్పడం జరిగింది.

2016-17 సంవత్సరంలో రూ.1,30,415 కోట్లు బడ్జెట్‌లో కేటాయించుకుంటే, దాంట్లో 93.34 శాతం అంటే, రూ.1,21,735 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందనే విషయాన్ని మర్చిపోవద్దని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఈసారి 2017-18 సంవత్సరంలో సవరించిన అంచనాలతో రూ.1.49 లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయించుకుంటే ఇప్పటికే రూ.1.42 లక్షల కోట్లు ఖర్చయ్యే ఆస్కారం ఉన్నట్లుగా మనకు అర్థమవుతుంది. అంటే దాదాపు 95 శాతం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేసినట్లుగా మనకి అర్థం అవుతుంది. అధ్యక్షా ఈ మార్చి 31 తేదీకి గాని పూర్తి లెక్కలు రావు.

తమరి ద్వారా గౌరవ సభ్యులకు గాని, రాష్ట్ర ప్రజానీకానికి గాని నేను విజ్ఞప్తి చేయదలచుకున్నాను. గౌరవనీయ రామచంద్రరావు గారు అడ్వకేట్. ఒకసారి కోర్టులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కావచ్చు, అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కావచ్చు, జిపిలు కావచ్చు. ఒకసారి వారి జీత భత్యాల పరిస్థితి చూసినట్లయితే, నాకు తెలిసి చరిత్రలో 10 శాతం పెంచాలా, 20 శాతం పెంచాలా, 30 శాతం పెంచాలా అని శాతాల గురించి గత ప్రభుత్వాలు ఆలోచించారు. కానీ, వారికి కడుపు నిండా అన్నం పెట్టాలి, చేతి నిండా పని తీసుకోవాలనే కాన్సెప్ట్‌ని అమలు చేసి, ఆయా న్యాయవాదుల జీతభత్యాలను దాదాపు డబుల్ చేసిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం. అది ప్రభుత్వ పని తీరుకు నిదర్శనం కాదా అధ్యక్షా!

ఎవరు కోరారు అంగన్‌వాడీల జీతాలు పెంచాలని, ఎవరు కోరారు ఆసరా పెన్షన్స్ పెంచాలని, ఎవరు కోరారు ఉద్యోగులకు

43 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, ఎవరు కోరారు ఆర్‌టిసి డ్రైవర్ల జీతాలు పెంచాలని? ఆనాడు ఉద్యమ నాయకుడిగా, టీఆర్ఎస్ పార్టీగా మేము డిమాండ్ చేశాం. ఏ చట్టాన్ని అయితే అమలు చేసే ప్రభుత్వం ఉందో, అదే ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమలు చేయని దుస్థితిలో ఉంటదా, ఇది న్యాయమా అని ప్రశ్నించినటువంటి నాయకుడు ఆనాటి మా ఉద్యమ నాయకుడు కెసిఆర్ గారు. అందుకనే ఏ రాజకీయ పార్టీ డిమాండ్ లేకుండానే దేశంలో ఎక్కడా లేనటువంటి పద్ధతిలో ఆనాడు అశ్రద్ధ చేయబడ్డ కొన్ని శాఖలను ఈనాడు మేము పెంచుకుంటాం, మా బిడ్డలను మేము ఆదుకుంటామని జీతభత్యాలు పెంచుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని నేను మనవి చేస్తున్నాను. ఇంత తక్కువ కాలంలో ఇన్ని రకాల నిర్ణయాలు చేసి పర్‌ఫెక్ట్‌గా అమలు చేస్తున్నటువంటి ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రం అధ్యక్షా. దీనిని కూడా మీరు కాదనగలరా అధ్యక్షా. మీరు చూస్తలేరా నిత్యం.

**శ్రీ కె. చంద్రశేఖర్ రావుః–** అధ్యక్షా, మంత్రిగారు చెబుతున్నారు. ఒక విషయంలో ఖచ్చితంగా ఇంటర్‌ఫియర్ కావాలని నేను అడుగుతున్నాను. నిన్న అక్కడ శాసనసభలో నేను చెప్పడం జరిగింది, గత సంవత్సరం కూడా చెప్పాను, ఇక్కడ చెప్పలేక పోయాను. సభ్యుల యొక్క బెనిఫిట్ కోసం నేను చెబుతున్నాను. చాలా మంది యువకులు కూడా ఉన్నారు. ఒక రాష్ట్రం, ఒక దేశం దానికి సంబంధించిన ఆర్థిక విధానాలు, మన దగ్గర ఒక స్టీరియో ఫోనిక్ పద్ధతిలో మాట్లాడడం అలవాటైంది. బడ్జెట్ ప్రవేశపెట్టగానే ప్రతిపక్ష నాయకులు ఇది అంకెల గారడి అని, సప్పగా ఉందనే విధంగా క్రిటిసైజ్ చేసే పద్ధతే తప్ప, విశ్లేషణాత్మకంగా చక్కగా స్టడీ చేసి, బాగా అవగాహన చేసుకొని మాట్లాడే పరిణితి మన దగ్గర ఇంకా రావలసి ఉన్నది. We are yet to achieve it. మన రాష్ట్రానికి అప్పులున్నాయని వారు మాట్లాడుతున్నారు. ఇది చాలా పెద్ద జోకు.

ఎప్పుడో 1950 సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీ వారు మాట్లాడే వారు. తలసరి ఆదాయం ఇంత, తలసరి అప్పు ఇంత అవుతుందనే విధంగా మాట్లాడే వారు. అప్పుడది నిజమేనేమో అనిపించేది. నిజానికి, It is a question of wisdom of economy. ఇది అర్థం చేసుకోవడంలో ఉంటుంది. నేను ఒక్క మాట తమరి ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తాను. 2004 నుండి 2014 సంవత్సరాలలో 23 జిల్లాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ఆరోజు పెట్టినటువంటి క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ.1.29 లక్షల కోట్లు. దీని గురించి సభ్యులు రాసుకుంటే నేను చాలా సంతోషపడతాను. ఇది విమర్శ కోసం చెప్పడం లేదు. The capital expenditure incurred in the State of Andhra Pradesh which was consisting about 23 districts in ten years span was Rs.1,29,000 crores.

మంత్రి గారు చెప్పినట్లు, మార్చి 31వ తారీఖు వస్తే నాలుగు ఆర్థిక సంవత్సరాలు పూర్తవుతాయి. తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాలకు పెట్టినటువంటి క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ దాదాపు రూ.1.24 లక్షల కోట్లు.

(సభ్యుల హర్షధ్వానాలు)

దీంట్లో రెండు ఉన్నాయి. ఒకటి, ఆనాడు ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ధనిక రాష్ట్రం అవుతుందని చెప్పడం జరిగింది. ఉద్యమ సందర్భంలో తమరు కూడా పని చేశారు. తమకు తెలియనిది కాదు. ఆరోజు మనందరం కూడా వాదన చేశాం. That is proved to be right. తెలంగాణ ఖచ్చితంగా మంచి రిసోర్స్ ఉన్న రాష్ట్రం. నేను సభ్యుల యొక్క సంతోషం కోసం తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం దేశంలో ఏ రాష్ట్రానికి లేని సౌభాగ్యం మన రాష్ట్రానికి దక్కింది. మన స్టేట్ ఓన్డ్ రెవెన్యూ గ్రోత్ 22 శాతం ఉంది. మనం చాలా అదృష్టవంతులం.

రెండవ పాయింట్, సభ్యులు మన రాష్ట్ర అప్పుల గురించి మాట్లాడారు. మన రామ చంద్ర రావు గారి పార్టీ వారే ఈరోజు దేశాన్ని పరిపాలిస్తున్నారు. స్టేట్ యొక్క జిఎస్‌డిపి అంటే, గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడ్యూస్ అంటారు. దేశం మొత్తానికి చెప్పేటప్పుడు జిడిపి అంటారు. రాష్ట్రానికి సంబంధించి మధ్యలో ఒక 'S' కలుస్తుంది. అంటే, Gross State Domestic Produce. కేంద్ర జిడిపి లేదా రాష్ట్ర జిడిపి రెండూ ఒకటే. రిజర్వ్ బ్యాంకు గవర్న్‌మెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక నిపుణులు చెప్పిన అంచనాల ప్రకారం రూ.1.67 లక్షల కోట్ల మేరకు స్థూలంగా మన దేశం యొక్క జిడిపి ఉంటుంది.

భారతదేశానికి ఉన్న అప్పులు రూ.82 లక్షల కోట్లు. ఇందులో మోదీ గారి ప్రభుత్వం గత మూడు సంవత్సరాలలో తీసుకున్న అప్పు దాదాపు రూ.20 లక్షల కోట్లు. 2018–19 ఆర్థిక సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వంలో మంత్రి అరుణ్ జైట్లీ గారు ప్రతిపాదించిన బడ్జెట్‌లో రూ.8.30 లక్షల కోట్ల పైబడి రుణాల చెల్లింపులు జరిగాయి. ఇది స్టోరీ కాదు, ఊహించి చెప్పేది కాదు. ఇది Government of India, Ministry of Finance website లో ఉంటుంది. ఎవరైన ఆ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసి చూడవచ్చు. Debt Services by Government

of India for the year 2018-19 is Rs.8,30,000 crores. అంటే రూ.24 లక్షల కోట్లలో దాదాపు రూ.8 లక్షల కోట్లు దీనికే పోతుంది. 1/3rd of the budget proposed by Government of India goes towards the debt payments. ఇది వాస్తవం రామచంద్రరావుగారూ! అంటే దీనిని దుబార అందామా? కేంద్రప్రభుత్వం చేసేది తప్పేనా? ఆ అప్రోచ్ రాంగా? It is a question of wisdom of economy. నిజానికి నేను బాధతో మనవి చేస్తున్నాను అధ్యక్షా. మన దేశమే దారుణంగా విఫలమయింది. అవును.

130 కోట్ల మంది ప్రజలు ఉన్న దేశాన్ని పూర్తిగా అర్థం చేసుకొని ఎట్లా జరపాలి అనేది తెలియడం లేదు. ఇప్పటికీ కూడా పాలకులు కండ్లు తెరుస్త లేరు. అధ్యక్షా, మన దేశానికి పక్కకు ఉన్న చైనాకు మనకంటే వ్యవసాయ భూమి తక్కువ, జిడిపి తక్కువ. 25 నుండి 30 సంవత్సరాలలో చైనా జిడిపిలో మనం నాల్గవ వంతు ఉన్నాం. 30 ఏండ్ల క్రింద మనకంటే వారు చాలా తక్కువ. మరి వాళ్లకు ఎట్లా సాధ్యమైంది? వారేమైన బంగారం పండిస్తున్నారా?

మన దగ్గర దురదృష్టం ఏమిటంటే, ఎక్కడనో మన గద్వాల్ జిల్లాలో గట్టు మండలంలో మారుమూల ప్రాంతంలో ఒక పాఠశాల నడుస్తది. దాని గురించి కేంద్ర ప్రభుత్వానికి ఏమి శ్రద్ధ ఉంటుంది? ఈ విద్యా విధానం కేంద్రానికి ఎందుకు ఉండాలి? ఈ దేశంలో ఏ త్రివేండ్రంలోనో, ఏ కాశ్మీర్‌లోనో, ఏ అస్సాంలోనో నడిచేటటువంటి ప్రైమరీ విద్యా విధానానికి కేంద్రానికి ఏమి సంబంధం? కేంద్రం magnanimity ఎప్పుడో వదిలి పెట్టింది. ఆరోగ్యం సబ్జెక్ట్ కేంద్రం దగ్గర ఎందుకు? వ్యవసాయ రంగం చూసుకుంటే నార్త్‌లో ఒక రకమైన పంటలు పండుతాయి, సౌత్‌లో ఒక రకమైన పంటలు పండుతాయి, ఈస్ట్‌లో ఒక రకమైన పంటలు పండుతాయి, వెస్ట్ ఇండియాలో ఒక రకమైన పంటలు పండుతాయి. అక్కడి వాతావరణం వేరు, భూములు వేరు, కథ వేరు. అధ్యక్షా, కేంద్రం దగ్గర అర్బన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్ సబ్జెక్టులు ఎందుకు?

ఒక ఏడు, ఎనిమిది శాఖలలో పూర్తి స్థాయి స్టాఫ్ ఎవ్వరూ ఇక్కడ ఉండరు. రూరల్ డెవలప్‌మెంట్ అంటే, పంచాయతీరాజ్ శాఖే ఖచ్చితంగా అమలు చేయాలి. అందులో కేంద్రం నుండి ఒక్క సింగిల్ మనిషి కూడా ఈ రాష్ట్రంలో ఉండడు. అంటే ఒక రకమైనటువంటి ఎకానామిని ఎట్లా లిబరేట్ చేయాలనే ఆలోచన లేక అధ్యక్షా. By all means we are eligible for 3.5% of FRBM అని మంత్రిగారు చెప్పారు. ఈ సంవత్సరం మన గ్రోత్ constant గా ఉంది. మనం సర్‌ప్లస్ స్టేట్‌గా ఉన్నాం. అది మనం చెప్పే లెక్క కాదు. Comptroller and Auditor General of India ఇచ్చే లెక్క. స్టోరీలు ఉండవు. ఎవరుపడితే వారు మాట్లాడడానికి పరిమితి ఉంటుంది. అంకెలు వెబ్‌సైట్‌లలో పొందుపరచబడి ఉంటాయి. ఈ విషయం నేను ఎందుకు చెప్పవలసి వస్తోందంటే, ఒకటి ఎడ్యుకేటివ్‌గా ఉంటుంది. కంట్రీ ఎకనామీని లివరేజ్ చేయడంలో గాని, రాష్ట్రాల ఎకనామీని లివరేజ్ చేయడంలో గాని మన కేంద్ర ప్రభుత్వాలు 71 సంవత్సరాల నుండి ఇప్పటి వరకు ఘోరాతి ఘోరంగా, దారుణంగా విఫలమయ్యాయి.

నిజంగానే రాజేందర్ గారు చెప్పినట్లు నీతి ఆయోగ్ కార్యక్రమం చూసి, నేను కూడా చాలా పొంగిపోయాను. మొట్టమొదట నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి గారు చెప్పిన మాటలు వింటే, అబ్బా ఈ దేశం ఖచ్చితంగా బాగుపడుతుందని అనుకున్నాను. "స్కూలు నడపాలంటే మీరే నడపాలి, దవాఖానా నడపాలంటే మీరే నడపాలి, కేంద్రానికి వీటితో ఏమి సంబంధం." ఇవి అధ్యక్షా, ప్రధానమంత్రి గారి చెప్పిన మాటలు. వారు కోఆపరేటివ్ ఫెడరలిజమ్ అని చెప్పారు. మేము ఎన్నడూ కూడా వ్యక్తిగత ప్రయోజనాలు గాని, వ్యక్తిగత సిఫారసులు గాని వారిని అడగలేదు. మనకు అర్హత ఉండీ కూడా పైరవీలు చేయాలి అధ్యక్షా. మన ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణా రావు గారు 50 చక్కర్లు కొడితే గాని ఆ 0.5 శాతం FRBM మనకు రాలేదు. అందుకు సెక్రటరీ గారి దగ్గరకి పోవాలి, మంత్రి గారి దగ్గరకి పోవాలి, చెప్పాలి, నేను ఉత్తరాలు రాయాలి, ఆర్థిక మంత్రి గారు పది చక్కర్లు కొట్టాలి, సెక్రటరీ గారు 50 చక్కర్లు కొట్టాలి, అక్కడి నుండి రిజర్వ్ బ్యాంకు దగ్గరికి పోవాలి. ఇంత ప్రాసెస్సా? ఎక్కడైతే నిధులు బాగుంటాయో, ఎక్కడైతే క్విక్ డెసిషన్స్ ఉంటాయో, ఎక్కడైతే క్విక్ రిజల్యూషన్స్ ఉంటాయో అక్కడ ప్రగతి బాగా వస్తది. ఖచ్చితంగా వస్తది. చాలా తొందరగా జరుగుతది.

ఇవ్వాళ మన దగ్గర పవర్ ఎక్కడ నుండి వచ్చింది అధ్యక్షా! ఇప్పుడున్న పరిస్థితి ఎందుకు తారుమారు అయిందండి. తమాషాగా వస్తదా? కష్టం చేయనిదే వస్తదా? దాని వెనక ఎంత కఠోరమైన శ్రమ ఉండాలి. పవర్ మినిస్టర్ కావచ్చు, వాటికి సంబంధించిన సెక్రటరీ కావచ్చు, సంబంధించిన అధికారులు కావచ్చు అహోరాత్రులు కష్టపడి, ఎన్నో రకాల బాధలు పడితే ఇవ్వాళ మన రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. భారతదేశంలో ఏ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ లేదు.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఊరికే మాటలు చెబితే రాదు. ఎందుకోసం చెబుతున్నానంటే, మీరు అప్పులు చేశారని సభ్యులు అంటున్నారు. కేంద్రమే ఈ సంవత్సరంలో మూడవ వంతు బడ్జెట్‌ను అప్పు కట్టడానికే వినియోగిస్తున్నది. నేను ఎందుకోసం మనవి చేస్తున్నానంటే, కేంద్ర ప్రభుత్వం జిడిపిలో వారి అప్పుల వాటా 49.5 శాతం ఉంది. కేంద్రానికి దాదాపు రూ.82 లక్షల అప్పులున్నాయి. మనకు ఉన్నది 20 శాతం అప్పులు మాత్రమే.

ఇంకొక విషయం, కేంద్రం మనకు ఉదయ్ స్కీమ్ తీసుకొస్తే, దాంట్లో రూ.9,000 కోట్ల భారం మన మీద వేసుకున్నాం. విద్యుత్ సంస్థలు పటిష్టంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉదయ్ అనే స్కీమ్‌ను ప్రతిపాదిస్తే, మనకు అవసరం లేకున్నా ఆ స్కీములో భాగస్వాములమయ్యి రూ.9,000 కోట్ల భారాన్ని నెత్తిన వేసుకున్నాము. అప్పట్లో మన డిస్కంలు బాగా పనిచేస్తున్నా, అప్పుడున్న కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ గారు ఒకటికి నాలుగు సార్లు "You are a very progressive State Mr. Rao, why don't you take it?" అని చెబితే ఆ పథకాన్ని తీసుకున్నాం. త్వరలో మనకు కూడా కరెంట్ అవసరమని, బాగా అభివృద్ధి చెందే రాష్ట్రమని తీసుకోవడం జరిగింది. ఆ రూ.9,000 కోట్లు కలిపితేనే మన రాష్ట్రానికి 20 శాతమే అప్పు ఉంది అధ్యక్షా. మన తెలంగాణ జిడిపిలో 20 శాతం మాత్రమే అప్పులు ఉన్నాయి. ఇన్ని అప్పులు చేశారని నిన్న శాసన సభలో భారతీయ జనతా పార్టీ వారు మాట్లాడారు, ఈరోజు ఇక్కడ రామ చంద్రరావు గారు మాట్లాడారు. Ramachandra Rao garu is my best friend and a learned friend.

పదే పదే నేను రిక్వెస్ట్ చేసేది ఏమిటంటే, we are highly progressive State. మంత్రిగారు అన్నట్లు, చాలా కష్టపడి అనేక త్యాగాలు చేసి, సాధించుకున్న రాష్ట్రం ఇది. మన ప్రజలకు గాని, దేశానికి గాని What message we are sending? Let us not curse our own State. It is my humble request. రాజకీయాలు మాట్లాడండి, ఇంకేమైనా మాట్లాడండి. ప్రతి సభలో బడ్జెట్ మీద మాట్లాడేటప్పుడు బాధ్యతగా, ఒక పద్ధతిగా yes, you can point out any mistake done by the Government. మేము తప్పులు చెప్పినా, ఇంకేదైనా మంచి, చెడులు ఉన్నా నిర్మాణాత్మకంగా విమర్శిస్తే తప్పకుండా దానిని స్వీకరిస్తాం, తప్పులు ఏవైనా ఉంటే, దానిని సరిదిద్దే ప్రయత్నాలు చేస్తాం. మేము దేవుడి కొడుకులం, మేము చెప్పిందే నిజమని అనడం లేదు.

అడ్మినిస్ట్రేషన్ అన్న తర్వాత అక్కడక్కడ కొన్ని లోపాలుంటాయి. We are ready to correct them. Humble గా తీసుకుంటాం. రాష్ట్ర భవిష్యత్తు కోసం, మన వాళ్లు ఎఫ్ఆర్‌బిఎం తెచ్చుకోవడానికి గాని, ఇంకో సందర్భంలోగాని రిజర్వ్ బ్యాంకుకు వెళ్లినప్పుడు గమనించేదేమిటంటే అక్కడ మన తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన బాండ్స్‌ను బ్యాంకులు పోటీపడి కొంటున్నాయి. ఇంకో మాటను కూడా మనవి చేస్తున్నాను. మన అరుణ్ జైట్లీ గారు బడ్జెట్‌లో స్పష్టంగా చెప్పారు. నేను ప్రతి సెంటెన్స్ విన్నాను. "Leveraging the economy of country or a State." అని వారన్నారు.

అధ్యక్షా, అమెరికా దేశం యొక్క అప్పు 14 ట్రిలియన్ డాలర్లు. మన కేంద్ర ప్రభుత్వ అప్పు 49 శాతం ఉంటే వాళ్లకు 100 శాతం కన్న ఎక్కువగా అప్పు ఉన్నది.

12.40 మ. జపాన్ అనే ఇంకొక దేశం ఉన్నది. అది డెవలప్డ్ కంట్రీలీగ్‌లో ఉన్నది, ఆ దేశం యొక్క అప్పులు, వాళ్ల రుణాలు, వాళ్ళ debt services 250% ఉన్నాయి. ఒకప్పుడు 300 శాతం అప్పులు ఉంటే దానిని తగ్గించుకొని, ప్రస్తుతం 250 శాతం ఉంది. అంటే, ఆ రెండు దేశాల వాళ్ళు పిచ్చోళ్ళా? ఈనాడు వాళ్ళు ప్రపంచాన్ని శాసిస్తున్నారు.

చైనా కూడా, ట్రాన్స్‌ఫార్మేషన్ మొదలుపెట్టినప్పుడు, వాళ్ళకున్న ఆదాయానికన్నా 4 రెట్లు ఎక్కువగా రుణాలు తీసుకొని మౌలిక సదుపాయాల కల్పన కోసం ఖర్చు పెట్టడం జరిగింది. మన దేశంలో ఈనాటికి రైల్వే స్టేషన్‌లు, రోడ్లు ఇప్పటికీ కూడా మంచిగా లేవు. వాజ్‌పేయి గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన Golden Quadrangular Track ఇంకా పూర్తి కాలేదు. ఆయన పుణ్యం కట్టుకొని పెట్టింది. అది ఇంకా అయితలేదు. మన నేషనల్ హైవే మీద యావరేజ్ లారీల వేగం 26 కిలోమీటర్లు. ఈ స్పీడ్‌తో అభివృద్ధి ఎప్పుడు జరుగుతుంది? ఎప్పుడు బాగుపడాలి ఈ దేశం? ఇప్పటికీ కూడా ఆలోచనలు చేయడం లేదు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తప్పుడు పాలసీలతో dis-incentivise చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు నిధులు ఇవ్వకపోయినా పాలసీని అందించాలి. Neither they give the policy, nor they give the money or they allow the States to take loans. వాళ్ళు పాలసీ ఇవ్వరు, డబ్బులు ఇవ్వరు, అంతకన్నా ముఖ్యమైన అనుమతులు కూడా ఇవ్వరు. ఈ దేశంలో ఏ భాగంలో అభివృద్ధి జరిగినా దేశం అభివృద్ధి చెందినట్లుగా భావించాలి. Growth of a State in the country should be considered as growth of the Country. Curtailing

a growing State amounts to curtailing the growth of the country. ఎవరిని అడిగినా చెబుతారు. దీని గురించి ఆలోచన చేయమన్నా ఆలోచన చేయలేదు. గౌరవ ఆర్థిక శాఖామాత్యులు చెప్పినట్లుగా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు దాదాపు రూ. 24వేల కోట్లను ఇవ్వమని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ, వాళ్ళు రూ.24లు కూడా ఇవ్వలేదు. 100 ఉత్తరాలను రాశాం. ప్రధానమంత్రిగారికి చెప్పాం, ఆర్థిక మంత్రిగారికి చెప్పాం. వారి పార్టీ సభ్యులైతే మేము లక్ష కోట్లు ఇచ్చాం అంటారు. ఆ రకమైన ఉద్దేశ్యంతో కాకుండా నా అభ్యర్థన ఏమిటంటే, పెద్దల సభలో విజ్ఞులు అర్థవంతంగా చర్చలు చేయాలి.

నేను రాజకీయాలలో రావడానికి స్ఫూర్తి విద్యార్థి దశలో ఉన్నప్పుడు చాలా సార్లు విజిటర్స్ గ్యాలరీలో కూర్చొని కౌన్సిల్‌లోని చర్చలను చాలా ఆసక్తిగా వినేవాడిని. అప్పుడు జూపూడి యజ్ఞనారాయణ గారు, మాణిక్యరావుగారు, రాఘవాచారిగారు, కేశవరావుగారు ఆధ్వర్యంలో అద్భుతమైన చర్చలు జరిగాయి. చాలా ఇంటలెక్చువల్ డిబేట్స్ జరిగేవి. నేను M.A. Political Science చదువుకునే రోజుల్లో గ్యాలరీలో ఎన్నో రోజులు కూర్చొని వినడం జరిగింది. అసెంబ్లీ కంటే గొప్పగా శాసనమండలిలో చర్చలు జరిగేవి. Highly intellectual debates used to take place in Council. గౌరవ సభ్యులకు నా మనవి ఏమిటంటే ఆ పేరును మరలా తీసుకురావాలి రామచంద్రరావుగారు! ఇది నా హంబుల్ రిక్వెస్ట్. My appeal to all the Members of this House - ఇప్పుడు సభ చాలా బాగుంది. తమరి అధ్యక్షతన చాలా డిగ్నిఫైడ్‌గా ఉంది. ఇంకా మరింతగా ఇక్కడ నుండి సబ్జెట్‌ను నేర్చుకొని పోయే విధంగా ఉంటే మంచిదని నా అభిప్రాయం.

బీజేపీ పార్టీవారు దేశంలోని 21 రాష్ట్రాలను పాలిస్తున్నారు. ఏదన్నా బిజెపి రాష్ట్రం అప్పు తీసుకోకుండా ఉందా? ఉంటుందా? తెచ్చిన అప్పులను దావత్‌లు చేసుకొని enjoy చేస్తే తప్పు. ప్రజలకు శాశ్వత నీటి సమస్యను తీర్చడానికి మిషన్ భగీరథ పథకం కోసం నిధులు అడగడం జరిగింది. అద్భుతమైన పథకం అది. ప్రజల ఆరోగ్యాలు బాగుపడతాయి. భోజనం రుచి కూడా మారుతుంది. దానిని అందరూ మెచ్చుకుంటున్నారు, హర్షధ్వానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దేని మీద ఖర్చు పెడితే, దాని మీద చర్చలు జరగాలి. ప్రభుత్వం అప్పు తెచ్చి దుబారా చేస్తున్నదా? ఏమన్నా పిచ్చి ఖర్చులు పెడుతున్నదా? దానికి సమాధానం చెప్పడానికి ఆర్థిక మంత్రిగారు ప్రయత్నం చేస్తున్నారు. నిన్న శాసనసభలో కూడా చెప్పారు. తెచ్చిన డబ్బు, మనకు సంక్రమించిన డబ్బు గాని అది మన హక్కు. Devolutions from Central Tax is a Constitutional right of every State. అది మన ఒక్కళ్ళకే ఇచ్చింది కాదు. అందులో మెహర్బానీ ఏమీ లేదు. It is a right of every State like any other State of India. ఏ ప్రభుత్వం ఉన్నా రావలసిందే. ఏ పార్టీ ఉన్నా రావలసిందే. మిగిలింది, Centrally Sponsored Schemes. దాని గురించి మంత్రిగారు చెప్తారు. నా రిక్వెస్ట్ ఏమిటంటే, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ జరిగిన దానిమీద చర్చ జరిగి దుబారా అవుతున్నదా, పిల్‌ఫరేజ్ అవుతున్నదా, వేస్టుగా ఖర్చు పెడుతున్నదా? అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయా? మొదలగు అంశాల మీద ఎక్కువ చర్చ జరిపితే క్రింద అడ్మినిస్ట్రేషన్ వారు కూడా భయపడతారు. మన శాసన సభ సభ్యులు, శాసన మండలి సభ్యులు అందరూ నిశితంగా పరిశీలిస్తున్నారు. మనం దుబారా జరగకుండా చూస్తే అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటారు. మనల్ని మనం విమర్శించుకోవడం చేస్తే అది మరొక దానికి దారి తీస్తుంది. అది కరెక్ట్ కాదు. కాబట్టి అప్పుల విషయంలో మన దేశం చాలా చాలా వెనుకబడి ఉంది. నేను ఆన్ రికార్డ్ చెబుతున్నాను. రికార్డు కావాలనే చెబుతున్నాను. కౌన్సిల్ రికార్డులో ఉండాలని చెబుతున్నాను. ఎందుకంటే, చర్చలో ఉంటుందని చెబుతున్నాను. మన ఎకానమీ లివరేజ్ చేయడంలో దేశమే దారుణంగా వైఫల్యం చెందింది.

ఈ దేశంలో భగవంతుడు, ప్రకృతి మనకు ఇచ్చినటువంటి నీళ్ళు 70,000 టిఎంసీలు. నిన్న బ్రెజిల్‌లో ఇంటర్నేషనల్ వాటర్ ఫోరమ్ మీటింగ్ జరిగింది. ఇంకొన్నాళ్లకు 350 కోట్ల మందికి చుక్క నీరు దొరకదని ప్రపంచం మొత్తాన్ని హెచ్చరిస్తున్నారు. మనకు మొత్తం వ్యవసాయానికి అనుకూలమైన భూమి 40 కోట్ల ఎకరాలు మాత్రమే ఉంది. అందులో 70 శాతం వ్యవసాయం జరుగుతుందని అనుకుంటే 30కోట్ల ఎకరాలలో మాత్రమే వ్యవసాయం జరుగుతుంది. నీళ్లు ఉన్నవి 70,000 టిఎంసీలు. 40 కోట్ల ఎకరాల భూమిని వ్యవసాయం చేసినా మనకు 40,000 టిఎంసీల నీరు అవసరం అవుతుంది.

اسکول چلانا ہے تو آپ کو چلانا ہے۔ ہسپتال چلانا ہے تو آپ ہی کو چلانا ہے۔ اس میں مرکزی حکومت کا کیا لینا دینا ہے۔

ప్రతి ఎకరానికి నీరిచ్చే అవకాశం పుష్కలంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు గడిచిపోయాయి. కావేరి

జలాల కోసం కర్ణాటక తమిళనాడు రాష్ట్రల వారు కొట్లాడుతున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర రాష్ట్రానికి కృష్ణా జలాల పంపకం విషయంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి 14 సంవత్సరాలు గడిచిపోయింది. 14 సంవత్సరాలుగా నిర్ణయాలే జరగకపోతే దేశం ఎప్పుడు బాగుపడుతుంది?

کھیتوں میں پانی، ہرایک کھیت کو پانی -

కరువు వచ్చింది అంటారు. ఎలా వస్తుంది కరవు? భగవంతుడు, ప్రకృతి మనకిచ్చిన 70,000 టిఎంసీల నీటిని సంరక్షించుకోలేక, అవి సముద్రంపాలైపోతుంటే, పార్టీ నాయకుల వివరణ కాదు, ఇక్కడ కేంద్ర ప్రభుత్వ వివరణ కావాలి. 71 సంవత్సరాల స్వతంత్ర్య భారత దేశంలో 70,000 టిఎంసీల నీటిని అందుబాటులో పెట్టుకొని భారత ప్రజానీకానికి మంచినీరు, సాగునీరు ఇవ్వలేకపోతున్నాం. ఇది మన దుస్థితి. ఇప్పటికైనా దేశ రాజకీయ వ్యవస్థ, దేశాన్ని పరిపాలించేవారు, అందులో మనం కూడా భాగస్వాములమే కాబట్టి మేల్కొని, బుద్ధి తెచ్చుకొని ఎకానమీ లివరేజ్ చేయాలి. ఇతర దేశాల్లో చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు నార్త్ చైనాలో నీళ్లు లేవు. సౌత్ చైనాలో నీళ్లు ఉన్నాయి. మనకు హిమాలయాల నుండి గంగా నదిలోకి ఏ విధంగా నీరు వస్తుందో, అదే విధంగా వారికి హిమాలయాల నుండి యాంగ్‌జీ వరకు నీళ్ళు వస్తాయి. నార్త్ చైనాలో నీళ్ళు లేకపోతే, సౌత్ చైనా నుండి నార్త్ చైనాకు 2400 కిలోమీటర్ల దూరం 1600 టిఎంసీల నీటిని తీసుకెళ్లి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఒక నెల క్రింద ఆ ప్రాజెక్టు పూర్తయ్యింది. వారు ఎంత అదృష్టవంతులు, మనం ఎంత దురదృష్టవంతులం. ఈ పద్ధతులు, ఈ ఆలోచనా సరళి ఎప్పుడు మారాలి? ఈ దేశంలో ఈ విధానాలు ఎప్పుడు మారాలి?

తెలంగాణ రాష్ట్రంలో మార్పులను తీసుకురావాలని మేము ప్రయత్నిస్తున్నాము. కోర్టులలో ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అవాంతరాలు వచ్చినా 325 పైగా కేసులకు క్లియరెన్స్‌లు తీసుకొని, యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం జరిగింది. కొద్ది రోజుల క్రితం కౌన్సిల్ ఛైర్మన్, సభ్యులు వెళ్లి చూసి రావడం జరిగింది. నేను చెప్పే అవసరం లేదు. భగవంతుడు మన్నించి అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే, ఈ సంవత్సరంలోనే జూలై, ఆగస్టు వరకు పుష్కలమైన గోదావరి నీటిని తెలంగాణ రైతులకు అందించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

సిన్సియార్టీ ఉండి ఖచ్చితంగా ప్రయత్నం చేస్తే తప్పకుండా మనం అనుకున్న పనిని సాధిస్తాము. దానికి తమరే సాక్షి. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చాలా చక్కగా జరుగుతున్నాయని ప్రెస్‌మీట్‌లో కూడా తమరు చెప్పడం జరిగింది. మేము అది చూసి చాలా సంతోషించాం. నేను అనేదేమంటే తెలంగాణ రాష్ట్రం నుండి జరగవలసిన ప్రయత్నం జరుగుతుంది. ఆర్థిక మంత్రిగారు అన్నట్లు ఎవరూ ఊహించని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాము. ఇండియాలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా రైతుకు పెట్టుబడిని ఈ విధంగా ఇవ్వరు. రైతులు పెట్టుబడులు ఇవ్వమని ఏమన్నా ధర్నాలు చేశారా? మమ్మల్ని కొట్టారా? బాధ పెట్టారా? డిమాండ్ వచ్చిందా? ఈనాడు రూ.8,000లను ఒక ఎకరానికి రెండు పంటలకు పెట్టుబడి ఇచ్చే విధంగా నిర్ణయించి, బడ్జెట్‌లో పెట్టి, తమ అధ్యక్షతన దాన్ని పాస్ చేసి, రేపు రైతులకు ఇవ్వబోతున్నాము. ఇవన్నీ కూడ మంచి innovative schemes, ఇండియాలో ఎక్కడా లేనటువంటివి. మీ ఆరోగ్య విధానాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ అధికారులు మన ఆరోగ్యానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్ సిడిని ఇవ్వమని అడిగారు. మీకు ఇస్తే మాకేమి ఉపయోగమని అడిగితే తెలంగాణ మోడల్‌నే అనుసరిస్తున్నామని, ఆ క్రెడిట్ మీకే ఇస్తామని చెబితే వారికి ఆ సిడీ ఇవ్వడం జరిగింది. During the course of deliberations, my only humble request to the Hon'ble Members would be - దేశంలో ఎక్కడ మంచి జరిగినా మెచ్చుకోండి. A word of appreciation gives lot of strength to the administration also. క్రిటిసిజమ్ కూడా చేయవచ్చు. We welcome the criticism. But, we expect the constructive part of criticism. ఉన్నదీ, లేనిదీ మొత్తం ఒకే గాటిన కడతాం అంటే, అది జరగదు. ప్రజలకు చాలా బాగా నిమిషాల మీద తెలిసిపోతోంది. ఒక్క నిమిషం లోపల తెలిసిపోతుంది. నేను మాట్లాడుతుంటే, రాజేంద్ర గారు బయటకి పోతనే ఉన్నారు. నేను మాట్లాడుతూ ఉంటే, అది టెలీక్యాస్ట్ అవుతూనే ఉంది. ఆగేది లేదు. Democracy కాబట్టి, ఆ వెసులుబాటు పెట్టాం.

అధ్యక్షా, ఈ సంవత్సరం మన debt services is Rs.19,000/- Crores. కేంద్ర ప్రభుత్వం అప్పులు 8 లక్షల కోట్ల రూపాయల పైచిలుకు ఉంటే, మనం తీర్చే అప్పులు 20 వేల కోట్ల రూపాయల లోపు ఉంది. మనం మన బడ్జెట్‌లో పెట్టుకున్నాం. మనం టంచన్‌గా కడతాం. by date కడతాం,

by month కాదు. ఏ తేదీన loan mature అవుతుందో, debt service 100% చేస్తాం. అందుకే, మనకి పరపతి ఉంది. Bank consortium loans ఇస్తామన్నారు. నేను మనవి చేసేదేమంటే, బడ్జెట్‌లో ప్రతిపాధించిన ఫిగర్స్ కావచ్చు, బడ్జెటేతరంగా తీసుకున్న ఫిగర్స్ కావచ్చు, ఇవన్నీ కలిసినా కూడా మనం 21 శాతం దాటి లేము. ఆ అపోహ వద్దు. తెలంగాణ ప్రభుత్వం అప్పుల పాలు అయ్యింది అని గౌరవ సభ్యులమైన మనమే అంటే, అది ఒక రాంగ్ మెస్సేజ్ క్రింద వెళ్తుంది. అందుకే, అది కరెక్టు కాదు. I wanted to correct that. Only 21% కాబట్టి, మనకింకా అర్హత ఉంది. ఇంకా కూడా అప్పులు తీసుకోవచ్చు. మనం పరిమితికి లోబడి ఉన్నాం. పరిమితికి మించి పోలేదు. నిన్న బెంగాల్‌కు వెళ్ళినప్పుడు అక్కడి ముఖ్యమంత్రి గారు చెప్పారు, వారి రాష్ట్రం తరపున రూ.48,000/- కోట్లు అప్పు కడుతున్నారని చెప్పారు. అంతకుముందున్న వాళ్ళు అడ్డగోలుగా అప్పులు తీసుకున్నారు కాబట్టి, every year they are paying Rs.48,000/- Crores. మేము అలా అగాధంలోకి పోవడం లేదు. ఎలా పడితే అలా పోవడం లేదు. మేము పరిమితికి లోబడే ఉన్నాం. Government of India పరిమితికి లోబడి ఉన్నాం. RBI నిబంధనలకు లోబడి ఉన్నాం. Disciplineగా ఉన్నాం. రాష్ట్రానికి చెడ్డపేరు రాకుండా క్రమశిక్షణ పాటిస్తున్నాం. Fiscal prudence maintain చేస్తున్నాం. ఇవి ఉన్న తరువాత కూడా విమర్శలు చేస్తుంటేనే, నేను ఈ విషయంలో interfere కావలసి వచ్చింది. Minuteగా కాకపోయినా broad figure నాకు తెలుసు కాబట్టి, సభ్యులకు కూడా benefit అవుతుందని నేను చెప్పాను. ఇది చాలా పెద్ద సబ్జెక్ట్. మంత్రిగారు మొత్తం పద్దుల గురించి చెప్పాలి కాబట్టి, వారు చెప్తారు. రాష్ట్రం యొక్క స్థూల ఆర్థిక స్వరూపం ఏమిటంటే, మనం right royal గా ఉన్నాం. పరిమితులకు లోబడి ఉన్నాం. పర్మిషన్‌లకు లోబడి ఉన్నాం. Perfect గా ఉన్నాం. Sound economy తో ఉన్నాం. ఈ దేశంలో ఎవ్వరూ లేనంత growth తో ఉన్నాం. అది కూడా disciplineతో ఉంటేనే వస్తుంది. ఊరకనే రాదు. దుబారా తక్కువ ఉండి, administration correct గా ఉండి, quick decisions ఉండి, corruption తక్కువగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. లేకపోతే ఆ పెరుగుదల రాదు. ఇవాళ చాలా రాష్ట్రాలు జి.ఎస్.టి. వచ్చిన తరువాత సతమతమవుతున్నాయి. మనం అయితలేము. మనం ఆ షాక్ తీసుకున్నాం. విత్‌స్టాండ్ అయ్యాం. మళ్ళీ పుంజుకున్నాం. బ్రహ్మాండంగా మనం పురోగమిస్తున్నాం. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం బాగా అభివృద్ధి చెందుతుంది. ఏది ఓపెన్ చేసినా- ఒక వాట్సాప్ ఓపెన్ చేసినా, ఫేస్‌బుక్ ఓపెన్ చేసినా, పేపర్ తీసినా కొన్ని వందల advertisements real estate గురించి వస్తున్నాయి. That is a positive growth indicator. ఇటువంటి సందర్భంలో గౌరవ సభ్యులు, కనీసం పెద్దల సభలో అయినా పాజిటివ్ చర్చ చేస్తే బాగుంటుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకి నా విజ్ఞప్తి.

**శ్రీ ఈటల రాజేందర్ :-** అధ్యక్షా, రైతాంగానికి రూ.17,000 కోట్ల రుణమాఫీని ప్రకటించి దానిని అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గరకు వెళ్లడం జరిగింది. మా రాష్ట్రం వ్యవసాయ రాష్ట్రం, మేము ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపడుతున్నాం. మేమే మీకు గ్యారంటీ ఇస్తాం, మాకు ఒకేసారి ఈ రుణాన్ని మాఫీ చేసే అవకాశాన్ని కలిగించమని అడగడం జరిగింది. ఈ విషయంగా మా రామకృష్ణారావుగారు బొంబాయికి వెళ్లడం జరిగింది. మొన్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పని చేసే ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు, బ్యాంకులు రూ.7,33,974 కోట్ల మేర దివాలా తీసాయి. దాంతోపాటుగా రూ.1,02,808 కోట్లు బ్యాంకులు దివాలా తీస్తే రూ.2,11,000 కోట్లను గవర్నమెంట్ పరంగా బ్యాంకులకు సపోర్ట్ చేయడానికి నిర్ణయం తీసుకున్నది. అంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల వద్ద నుండి పన్నులను వసూలు చేసి ఎగవేతదారులకు compensate చేసింది కానీ, ఉన్న వారి కోసం సపోర్ట్ చేసింది కానీ, ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగానికి ఒక మానవీయ కోణంలో రూ.17,000 కోట్లను రుణ మాఫీ కోసం ప్రభుత్వం వారు తపన పడుతుంటే ఆ తపనకు సపోర్టు చేయక పోవడం నిజం కాదా! సభ్యులు శ్రీ రామచంద్రరావుగారూ తమరికి లెక్కలు తెలుసు కదా మీరు ఒకసారి చూడండి. ఈనాడు రూ.8,000 కోట్లు క్యాష్‌ఇచ్చారు, 80,000 కోట్లకు బాండ్స్ పెట్టారు. ప్రతి పైసా ప్రజలు కడితే ఆ పైసలు ఎటు పోతున్నాయో మీరు ఒక్కసారి ఆలోచించండి? కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందో ఒక్కసారి ఆలోచించండి. కానీ రాష్ట్రప్రభుత్వం మాత్రం పేదల కష్టాలను తీర్చడం కోసం తపన పడుతోంది.

గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా తీసుకున్న ప్రతి రుణం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం, జెన్‌కో స్టేషన్ల కోసం, త్రాగునీటి కోసం, హైదరాబాదులో మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం, ఈనాడు గతుకుల రోడ్లతో తల్లడిల్లే తెలంగాణకు మంచి రోడ్లను జిల్లా హెడ్ క్వార్టర్‌ను కలపడానికి డబుల్ లైన్ రోడ్లు కోసం, జిల్లా జిల్లాను కలపడానికి 4 లైన్ల రోడ్లు కోసం, సింగిల్ రోడ్ల కోసం

తీసుకోవడం జరిగింది. తీసుకున్న ప్రతి పైసా అస్సెట్ క్రియేట్ చేయడం కోసం తీసుకున్నాము తప్ప అస్సెట్ క్రియేట్ కాని వాటికి తీసుకోలేదని తెలియజేస్తున్నాను.

అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా క్రిటిసిజమ్ కొత్తదేమీ కాదు, వెనకటి కాలం నుండి వస్తున్నది. అప్పటి సాలర్‌జంగ్ బ్రహ్మాండంగా రైల్వే లైన్లను నిర్మించాలని దానితో నిజాం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆనాడే ఆలోచన చేసి గ్రేట్ బ్రిటన్ దగ్గర రుణం తీసుకొని హైదరాబాద్-వాడి, హైదరాబాద్-ఖాజీపేట్, ఖాజీపేట్ టు విజయవాడ, ఖాజీపేట్ టు బల్లార్షా వరకు రైల్వే లైన్ల నిర్మాణం చేస్తే అప్పుడు సరోజిని నాయుడు గారి తండ్రి దానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం చేశారు. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా ఇద్దరూ కలిసి పెద్ద ఉద్యమం చేశారు. ఆనాడు ఆ రుణం తీసుకోకుండా ఉండి ఉంటే ఈనాడు ఆ అభివృద్ధి కనపడేదా! అని అడుగుతున్నాను?

నేను ఆనాడు MLA గా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టుకు ఎస్టిమేట్ రూ.16,200 కోట్లు వేసింది. అదే పార్టీ 5 సంవత్సరాలలో పూర్తిగా రుణం తీరుస్తామని చెప్పింది. మరలా అదే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే రూ.36,000 కోట్లకు ఎస్టిమేట్‌ను మార్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలు కూడా 10 సంవత్సరాల కోసమో, 12 సంవత్సరాల కోసమో కాదు. 15, 20, 25 సంవత్సరాల కోసం తీసుకుంటున్నాము. ఈనాడు దాదాపు రూ.1.00 లక్ష కోట్లను అప్పు తీసుకుంటే దాని మీద వడ్డీనే కడతాము, అసలును మాత్రం 25 సంవత్సరాల వరకు కట్టుకునే వెసులుబాటు కూడా ఉంటుంది.

ఈనాడు కట్టే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80,000 కోట్లు కావచ్చు కాని, 25 సంవత్సరాలకు అది ఎన్ని లక్షల కోట్ల రూపాయలకు పెరుగుతుందో అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ఒకవేళ మన దగ్గర డబ్బు ఉంటేనే పని చేయాలనే భావన ఉంటే ఇంకా 50 సంవత్సరాలు దాటినా కనీస అభివృద్ధికి నోచుకోవన్న మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఈనాడు అప్పు చేయకూడదనే ఆలోచన కాలం చెల్లిన మాట. ఇది అభివృద్ధి కరమైన మాట కాదని తెలియజేస్తున్నాను. ఏం వెలగబెట్టారని నిన్న ఒకరు అడిగారు. ఈనాడు దేశమంతా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తుంటే దేశంలో ఉన్న అనేక సంస్థలు అవార్డ్సు ఇస్తుంటే, దేశంలో ఉన్న అనేక రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తుంటే వారు మాట్లాడే మాటలు గుడ్డి ద్వేషంతో, అక్కసుతో మాట్లాడే మాటలు తప్ప, వారి మాటల్లో నిజాయితీ లేదు. ఈ దేశం పట్ల, ఈ రాష్ట్రం పట్ల తపన ఉన్న వారు కాదు, ద్రోహం చేసే మాటలు తప్ప అభివృద్ధి కోసం మాట్లాడటం లేదని చెప్పి తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

**1.00 మ.** గ్రోత్ రేట్‌ని ఒక్కసారి పోల్చి చూసుకున్నట్లయితే 2013-14లో ఆనాడు మన జిడిపి 4.2 శాతం ఉంటే, కేంద్ర ప్రభుత్వం యొక్క జిడిపి 5.9 శాతం ఉన్నది. ఈ రోజు, అంటే నాలుగు సంవత్సరాల తరువాత అదే జిడిపి కేంద్రంలో 6.6 శాతం ఉంటే, మన తెలంగాణ జిడిపి 10.4 శాతం అని గర్వంగా ప్రకటిస్తున్నాను. ఎవరు బాగుపడ్డారు? ఎవరి నిర్ణయాలు గొప్పగా ఉన్నాయి? ఎవరి చర్యలు గొప్పగా ఉన్నాయి? ఈ లెక్కలు మనం తయారు చేసినవి కావు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నుండి ఈ లెక్కలు వచ్చాయనే విషయం మరిచిపోకూడదని చెప్పి, తమరి ద్వారా మనవి చేస్తున్నాను. అంతేకాదు, తలసరి ఆదాయంలో కూడా, దేశ తలసరి ఆదాయం రూ.1,12,764 ఉంటే, మన తలసరి ఆదాయం రూ. 1,75,534గా ఉన్నది. ఇంతకుముందు మన గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు ఈ రోజు జిఎస్టీ కనుక రాకుండా ఉండి ఉంటే అది ఇంకా ఎక్కువగా ఉండేది. ఇప్పటికే 22 శాతం పై బడి ఆదాయాన్ని మనం పెంచుకున్నాము. ఒక్క మాటలో చెప్పాలంటే అనేక రాష్ట్రాలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అనేక కార్యక్రమాలు ఏవైతే ఉన్నాయో వాటిని అమలు చేయడం ఏ విధంగా సాధ్యమవుతున్నదా అని ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. అధ్యయనం కూడా చేస్తున్నాయి. మనసుంటే మార్గం ఉంటుంది.

ప్రతి సమావేశంలోనూ మేము చెబుతూ వస్తున్నాము- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విజన్ ఉంది. ఒక కమిట్‌మెంట్ ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రజల పట్ల, ఈ రాష్ట్ర అభివృద్ధి పట్ల ఎంత గొప్ప ఆలోచన ఉందో చెప్పడానికి ఇతర రాష్ట్రాలు మన దగ్గరకు వచ్చి, మన పథకాల గురించి తెలుసుకుని వెళుతున్నాయనేది ఇందుకు ఒక నిదర్శనం.

ఈ రోజు మన రాష్ట్రంలో శాంతి, భద్రతల నిర్వహణ గురించి చెప్పాలంటే మొట్టమొదటి సారి పోలీసు శాఖకు వాహనాలు కొనడానికి జీఓ ఇచ్చినప్పుడు ఇంత డబ్బా అనుకున్నాము. మొదటి రోజు మేము అనుకున్నాము దీని ఫలితాలు ఎలా ఉంటాయని. కాని ఆ నిర్ణయం వల్ల ఈ రోజు ప్రపంచంలో ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులంతా

మనవైపు చూస్తున్నారు. దేశంలో ఎక్కడైనా పెట్టుబడి పెట్టాలంటే, దేశంలో ఎక్కడున్నా పరిశ్రమలు పెట్టాలంటే safest place is Hyderabad అనే స్థాయికి తీసుకువచ్చాము. ఇక్కడ గొప్ప వనరులున్నాయి. మంచి భూములున్నాయి. పరిశ్రమల స్థాపన కొరకు 10 శాతం నీళ్ల కేటాయింపు చేసిన రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రమేనని మనవి చేసుకుంటున్నాను. నీళ్లు ఇస్తున్నాము, నిధులు ఇస్తున్నాము. అంతేకాదు. నిన్న అక్కడ శాసనసభలో శ్రీ కిషన్ రెడ్డిగారు ఆనాడు పారిశ్రామిక వేత్తలు ధర్నాలు చేసిన విషయం గురించి చెప్పారు.

మనం గతంలో హమాలీలు ధర్నాలు చేయడం చూశాము. కూలీలు ధర్నాలు చేయడం చూశాము. రైతులు ధర్నాలు చేయడం చూశాము. కాని, పారిశ్రామిక వేత్తలే ఇందిరా పార్కు దగ్గర ధర్నా చేసిన చరిత్ర ఆనాడు జరిగింది. వాళ్లు ధర్నా దేని కొరకు చేశారు? అయ్యా, శనివారం పవర్ కట్. ఆదివారం పవర్ కట్. పీక్ అవర్స్‌లో పవర్ వాడుకుంటే పరిశ్రమలకు జరిమానాలు వేశారు. చివరికి శుక్రవారం కూడా పవర్ కట్ చేస్తామంటే, దానికి వారు దివాళా తీసేది మేము కాదు, మా దగ్గర పనిచేసే కార్మికుల పరిస్థితి ఏమి కావాలని మొరపెట్టుకున్నారు. కాని ఈ రోజు తెలంగాణ వచ్చిన తరువాత నిరంతరాయంగా 24x7 పవర్ ఇస్తున్నాము. ఇది ఊరికే వచ్చిందా? ఈ రోజు ఒక్క రూపాయికే యూనిట్ విద్యుత్తు దొరికే మాట నిజమే అయితే, ఈ దేశంలో మిగులు విద్యుత్తు ఉండి ఉంటే, అది నిజమే అయితే, ఎందుకు ఈ దేశంలో ఇరవై నాలుగు గంటలు ఉచితంగా విద్యుత్తును ఇవ్వలేకపోతున్నారని అడుగుతున్నాను. రైతాంగానికి విద్యుత్తును ఇస్తే నష్టపోతామా? వారి రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదు? ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మీ బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అదే విధంగా ఆలోచన చేసే ప్రయత్నం చెయ్యండి. దేశమంతటా అమలు చేసే ప్రయత్నం చెయ్యండి. తద్వారా దేశం అభివృద్ధి చెందడానికి అవకాశముంటుంది తప్ప, అమలు చేస్తున్న వాళ్లమీద ఇలాంటి విమర్శలు చేయడం మంచిది కాదని తమరి ద్వారా మనవి చేసుకుంటున్నాను.

నిన్న అక్కడ శాసనసభలో లక్ష్మణ్‌గారు మాట్లాడుతూ ఒక మాట చెప్పారు- సంక్షేమానికి నిధులు సరిగా కేటాయించలేదని. ఆనాడు మేము మ్యానిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలు చేయమని కోరాము. కాని ఈ నాడు మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను వందకు వంద శాతం అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ఆనాడు మేము చెప్పాము- మ్యానిఫెస్టో అంటే చిత్తు కాగితం కాదు, ఒక భగవద్గీతలాగా మేము ఫీలవుతాము. మ్యానిఫెస్టోలో అంశాలను అమలుచేసే ఓట్లకు పోతాం అని. మ్యానిఫెస్టోని అమలు చేయకపోవడం అంటే ప్రజలను వంచించడమే అని కూడా చెప్పాము.

కళ్యాణ లక్ష్మి గురించి మేము మ్యానిఫెస్టోలో చెప్పలేదు కాని అమలు చేస్తున్నాము. పేద కుటుంబాలలో పుట్టిన ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే ఎంత నరకముంటుందో, ఎంత తపన ఉంటుందో మాకు తెలవదా అధ్యక్షా? ఏ రాష్ట్రం, ఏ పార్టీ మాకు ఆదర్శం కాదు. మాకు మేమే నిర్ణయించుకున్నాం. ఆడపిల్ల పెళ్లి సంతోషంగా జరగాలి. ఆడపిల్ల అంటే ఇంటికి లక్ష్మి. ఆడపిల్ల పెళ్లి సందర్భంగా ఆ కుటుంబం కన్నీళ్లు కార్చకూడదనే ఒక గొప్ప నిర్ణయం తీసుకుని, మొదటి సంవత్సరం రూ.51,000 ఇచ్చాము. తరువాత దానిని రూ.75,116కి పెంచాము. కులంతో, మతంతో సంబంధం లేదు. పేదరికంలో ఉన్నవాళ్లకు, పెళ్లిచెయ్యడానికి కష్టపడే కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వమే తండ్రిలా అండగా ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వమే ఇంటి పెద్ద అని చెప్పి, ఈ సహాయం అందజేయడమే కాకుండా, ఈ సంవత్సరం నుండి ఆ మొత్తాన్ని రూ.1,00,116కి పెంచిన రాష్ట్రం ఈ దేశంలో ఇంకెక్కడన్నా ఉందా అని చెప్పి, అడుగుతున్నాను.

ఈ రోజు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఒక పథకం ప్రకటిస్తే చాలా సంతోషపడ్డాము. దాని పేరు ఆయుష్మాన్ భవ. దేశంలో ఉన్న 130 కోట్ల జనాభాకు లేకలేక ఇంత పెద్ద, గొప్ప కార్యక్రమం ప్రకటించారు. నాకు తెలిసి ఈ దేశంలో గత నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజలు గుర్తుపెట్టుకునే, గుండెల్లో పెట్టుకునే ఒక గొప్ప పథకం ఒక్కటైనా అమలు చేశారా అని అడుగుతున్నాను. చేస్తే, గీస్తే ఇదిగో ఇప్పుడు ప్రకటించిన పథకం అని అనుకుంటున్నాను. దానికి కేటాయించిన డబ్బు ఎంత? కేవలం రెండు వేల కోట్ల రూపాయలు. కడుపు నింపే పని చెయ్యాలి తప్ప, మెకానికల్‌గా చేస్తే అది మంచిది కాదు. ఇందుకు నామోషీగా ఫీల్ కావలసిన పని లేదు. 10, 15 సంవత్సరాల పాటు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి వారు, తరువాత దేశానికి ప్రధాన మంత్రి అయితే, ఆకలి తెలిసిన వ్యక్తి దేశ ప్రధాన మంత్రి అయితే, ఆకలికి పరిష్కారం చూపుతారనే విశ్వాసం ఉండేది. ఆ నాడు దేశంలో ఉన్న యువకులంతా మోదీగారు ప్రధాన మంత్రి అయితే తమకు ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశపడ్డారు. ఎక్కడున్నా ఉద్యోగ

నియామకాలు జరిగాయా చెప్పండి? ఆ దిశగా ఏమైనా అడుగులు వేశారా? ఆ దిశగా ఏమైనా పెట్టుబడులు వచ్చాయా? పరిశ్రమలు వచ్చాయా? నిజంగానే అభివృద్ధి జరిగితే 5.9 జిడిపి ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు 6.6 దగ్గరనే ఉండిపోయింది? 4.2 దగ్గర ఉన్న మేము ఎందుకు 10.5 దగ్గరకు వచ్చాము? మీరు (బిజెపి సభ్యులని ఉద్దేశించి) మమ్మల్ని విమర్శించే పరిస్థితి రాకూడదు. మీరు భేషజాలకు పోకపోతే, మీకు నామోషీ లేకపోతే, ఈ రోజు తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా పాలన సాగిస్తున్నదో అధ్యయనం చెయ్యండి. మా పథకాలను ఇతర రాష్ట్రాలకు వర్తింపజేయాలి.

మొన్న నేను, మా రామకృష్ణారావుగారు కలిసి కేంద్ర ఆర్థిక శాఖకు వెళ్లాము. కేంద్రం నుండి మనకు ఒక లేఖ వచ్చింది- 2018-19వ సంవత్సరానికి బడ్జెటు రూపకల్పన చేస్తున్నాము, మీ సూచనలు, సలహాలు కావాలంటే వెళ్లాము. ఆల్‌రెడీ బడ్జెట్ రెడీ అయింది, పుస్తకాలు కూడా ప్రింట్ అయినాయి, ఇప్పుడు మనల్ని ఎందుకు పిలుస్తున్నారో అని నవ్వుకున్నాము. సార్ ఫార్మాలిటీ కొరకు పిలుస్తున్నారేమోనని రామకృష్ణారావు గారు నాతో అన్నారు. వాళ్లు ఫార్మాలిటీ కొరకు పిలిచినా, ఆశ చావదు కాబట్టి ఒక పెద్ద బుక్‌లెట్ పట్టుకొని వెళ్లాము. వారికి ఏమని చెప్పామంటే మీరు బీహార్ లాంటి, యు.పి. లాంటి పేద రాష్ట్రాలకు సహాయం చెయ్యండి, తప్పు లేదు. కాని గొప్ప ఆలోచనతో, ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి తపన పడుతున్న ప్రభుత్వాలని, progressive Statesకి కూడా మద్దతు ఇవ్వమని నేను దేశ ఆర్థిక మంత్రిగారిని కోరడం జరిగింది.

ఒక్క సింగిల్ పైసా రాలేదు. చివరికి వారు పార్లమెంటులో ప్రస్తావించిన, హామీ ఇవ్వబడ్డ AIIMS విషయంలో కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఒక దేశం, రూ.24 లక్షల కోట్ల బడ్జెట్ కలిగిన దేశం, AIIMS కొరకు మూడు వందల కోట్ల రూపాయలు ఇవ్వమని అడిగినా ఇవ్వకపోతే, ఎలా ముందుకు పోతాము? ఇదా కేంద్ర ప్రభుత్వం మనకిచ్చే సపోర్టు?

మన రాష్ట్రంలో మైనారిటీల కొరకు 202 పాఠశాలలు పెడుతున్నాము, 500 పై చిలుకు రెసిడెన్షియల్ పాఠశాలలు పెడుతున్నాము. నేను కేంద్రం దగ్గరకు జిఎస్టీ మీటింగుల కొరకు వెళ్లినప్పుడల్లా దరఖాస్తులు ఇస్తూనే ఉన్నాము. వాళ్లు పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా, తపన కాబట్టి, మారకపోతారా, దయ కలగకపోతుందా, ఒక వెయ్యి కోట్లు ఇవ్వకపోతారా అని ఎదురుచూస్తూనే ఉన్నాము. కాని ఆ విధంగా జరగకపోగా, తిరోగమనం జరిగింది. ఇంత పేదరికం నుండి వచ్చిన ఒక ప్రధాన మంత్రిగారు, పేదల కోసం పనిచేసే శిశు సంక్షేమ శాఖకి గతంలో రూ.17,800 కోట్ల బడ్జెటు ఉంటే, 2014-15వ ఆర్థిక సంవత్సరంలో దానిని పదివేల కోట్ల రూపాయలకు తగ్గించారు. కాని మా ప్రభుత్వం ఏమి చేసిందంటే కేంద్ర ప్రభుత్వం బడ్జెటు తగ్గించినప్పటికీ, ఈ అంగన్‌వాడీ కేంద్రాలు చాలా ముఖ్యమైనవిగా భావించి, వారి జీతాలు రూ.4500 ఉంటే దానిని రూ.7500 కి పెంచాము. అంగన్‌వాడీ వర్కర్స్‌కి రూ.2200 ఉంటే దానిని 4500 కి పెంచాము. అంతేకాదు మీరు బడ్జెట్ తగ్గించినప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు సంవత్సరాల లోపు పిల్లలకు 8 గుడ్లు పంపిణీని 16 గుడ్ల చొప్పున ఇచ్చాము, మూడు నుండి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు 16 గుడ్లకు గాను 30 గుడ్ల చొప్పున ఇచ్చాము. ఆ సంవత్సరం బడ్జెట్‌లో మీరు తిరోగమన నిర్ణయం తీసుకుంటే, మేము రూ.451 కోట్లు అదనంగా ఇచ్చి ఆదుకున్న రాష్ట్రం తెలంగాణ.

అబ్దుల్ కలాంగారు మాకు ఆదర్శం అని చెప్పుకుంటారు. కొఠారిగారు ఆదర్శం అంటారు. ఈ దేశంలో విద్య, వైద్యం, మానవ వనరులు చాలా ప్రధానమైనవి. మానవ వనరుల కొరకు కేంద్రంలో ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ కూడా ఉంది. మానవ వనరులు మెరుగుపడకపోతే దేశం బాగుపడుతుందా? మానవ వనరుల కొరకు తపన పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి విద్యాపరంగా ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని అడుగుతున్నాను. మీకు చేతులు రావు. ఉల్టా కేటాయింపులు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రప్రభుత్వాన్ని మీరు పట్టించుకోకపోయినా కూడా మా రాష్ట్రం ఆరోగ్యవంతంగా ఉండాలి, మా రాష్ట్రం విజ్ఞానవంతంగా ఉండాలి, మా రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా ఉండాలి, మా రాష్ట్రం ఇతర రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతుంది అని చెప్పి, ఒక విద్యార్థి మీద రూ.1,20,000 చొప్పున ఖర్చు పెట్టి ఉచిత, నాణ్యమైన విద్యను అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని మనవి చేసుకుంటున్నాను. పెట్టిన స్కీంలను, పెట్టిన స్కూళ్లను మూసివేసిన ఘనత వారిది. అందుకు నవోదయ పాఠశాలలు ఒక ఉదాహరణ. వీళ్లా మాట్లాడేది? అందుకని దయచేసి అనవసరమైన విమర్శలు చెయ్యకండి.

అప్పుడప్పుడు నేను మా సహచరుడు శ్రీ కెటిఆర్‌గారితో వాదన పెట్టుకుంటాను. ఐటి, ఇండస్ట్రీలు అవసరమే. కాని ఈ నాటికి కూడా దేశ ప్రజానీకానికి పట్టెడు అన్నం పెట్టేవాడు

రైతు. ఆ రైతు బాగుంటేనే ఈ దేశం బాగుంటుంది. అనేక సందర్భాలలో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికమాంద్యాలు వచ్చినా, చెక్కుచెదరకుండా నిలిచిన దేశం భారత దేశం. తెలంగాణ వ్యవసాయక రాష్ట్రం. రైతుల సంక్షేమం కొరకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాము.

ఒక్క రుణ మాఫీతో మేము సరిపెట్టుకోలేదు. రైతుల కోసం 50 రకాల స్కీములు ఉన్నాయి. అందులో Investment Support Scheme అనేది చాలా ప్రధానమైనది. ఎకరానికి ఏడాదికి నాలుగు వేల రూపాయల చొప్పున, రెండు పంటలకు కలిపి ఎనిమిది వేల రూపాయల చొప్పున రైతులకు సహాయం అందించడానికి ఈ బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించుకున్నాము. ఇటువంటిది ప్రపంచంలో ఎక్కడన్నా ఉందా అని అడుగుతున్నాను. మా ఆలోచన అంతా దాని చుట్టే. రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేస్తే రాజకీయం కోసం ఏర్పాటు చేశామంటున్నారు. రైతులకు శిక్షణ ఇస్తాము, వారికి నిధులు కేటాయిస్తాము. ఎక్కడన్నా రాజకీయాల కోసం రైతు సమన్వయ సమితులు వేస్తారా? ఒక్క మాట స్పష్టంగా చెబుతున్నాను. రేపు రాబోయే రోజులలో మినిమం సపోర్ట్ ప్రైస్ కొరకు రైతులు రోడ్ల మీదికొచ్చి, ధర్నాలు చేసే పరిస్థితి రాదు. ఫస్ట్ టైం ఎంఎస్‌పితో వడ్లను కొన్న రాష్ట్రం తెలంగాణ, ఫస్ట్ టైం ఎంఎస్‌పితో ఎర్ర జొన్నలు కొన్న రాష్ట్రం తెలంగాణ, మక్కలు కొన్న రాష్ట్రం తెలంగాణ, కేంద్రం పర్మిషన్ ఇస్తే కందులు కొన్న రాష్ట్రం కూడా తెలంగాణ అవుతుంది. ఇప్పటికి వందకు వంద శాతం రైతాంగానికి మూడు రకాల సహాయం చేశాము.

ఒకటి- ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్తును అందించడం. మోటర్లు కాలిపోని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోని, సబ్ స్టేషన్లను ముట్టడించి, ధర్నాలు జరిగే పరిస్థితికి చరమగీతం పాడి, రైతాంగానికి మేలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం.

రెండు-మీరు సహకరించకపోయినా రుణ మాఫీతోపాటు, పంట పెట్టుబడి సహాయంతో రైతులను ఆదుకుంటున్నాము.

మూడు - పండిన పంటకు గిట్టుబాటు ధరను ఇవ్వడం.

నాలుగు-అతి ముఖ్యమైనది ఉత్తర తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టును ఈ సంవత్సరంలో లింకప్ చేసి, 2019-20 నాటికి పూర్తిగా లింకప్ చేసి, రైతాంగం ఎక్కడా నీళ్ల కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా, పంట పండుతుందో, ఎండుతుందో అని మొగులు వైపు చూసే దౌర్భాగ్య పరిస్థితి రాకుండా, ఈ రోజు దాదాపుగా నీళ్లిచ్చే కార్యక్రమం కూడా చేపడుతున్నాము. ఇంతకుముందు ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా ఎన్ని కేసులు వేసినా, కాళ్లలో కట్టెలు పెట్టి, మేము పడిపోతే కిలకిలమని నవ్వాలని ప్రయత్నం చేశారు.

కాని జరిగింది ఏమిటి? అతి తక్కువ కాలంలో ఇన్ని రకాల అనుమతులు సాధించి, ప్రాజెక్టుల నిర్మాణంలో ముందుకు పోతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. 1963లో జవహర్‌లాల్ నెహ్రూగారు పునాది వేస్తే, 14 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే లక్ష్యంతో ఎస్సారెస్పీ కడితే, ఈ నాటికి కూడా 6 లక్షల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేనటువంటి దుస్థితి వారిదైతే, మూడు సంవత్సరాల కాలంలోనే పర్మిషన్లు తెచ్చుకుని, ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, ఒక మానవ అద్భుతాన్ని సృష్టించి, అబ్బురపరిచే రీతిలో ప్రాజెక్టుకు కట్టి రైతులకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం మా ప్రభుత్వం చేస్తున్నది. దీని ద్వారా రైతాంగం బాగుపడుతుంది. తద్వారా మన ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని విశ్వాసం ఉంది కాబట్టి అటువైపు అడుగులు వేస్తున్నాము.

ఒక్క మాట ఇదే సభలో అనేక సార్లు, అనేక సందర్భాలలో గంటల తరబడి చెప్పి ఉన్నాము. కాని ఒక్కటి మాత్రం సత్యం. మీరు అక్కసుతో ఆరోపణలు చేయకండి. ఇంతకు ముందు ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు నిజంగా మేము తప్పు చేసిన నాడు, నిజంగా మేము మంచి చేయడం లేదని మీరు అనుకున్నప్పుడు మాకు చెప్పే ప్రయత్నం చెయ్యండి. వాటిని ఆచరించే ప్రయత్నం చేస్తాము. మా ముఖ్యమంత్రిగారు ఎంత బోల్డ్‌గా ఉంటారంటే, ప్రతిపక్షాలు మాట్లాడుతుంటే అది సరిగా వినబడకపోతే, మరొకసారి చెప్పమని అడుగుతారు. మేము పది సంవత్సరాలు సభలో ఉన్నాము. ఏదైనా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతే, మాకు తెలుసు లేవయ్యా అని వెక్కిరించేవారు. కాని మా ముఖ్యమంత్రి ఎవరు చెప్పినా, అది న్యాయమైనప్పుడు, అవసరమైనప్పుడు తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చిన సందర్భాలు కొన్ని వందలు ఉన్నాయి.

**1.20 మ.** అసలు గత ప్రభుత్వానికి విధానసభ పట్ల, శాసన సభ్యుల పట్ల ఎంత గొప్ప అభిప్రాయం ఉందో నేను చెప్పనక్కర్లేదు. గతంలో రూ.50 లక్షలు ఎమ్మెల్యే నిధులు ఇస్తే, అందులో ఇన్‌ఛార్జ్ మంత్రి కోటా రూ.25 లక్షలు, మిగిలిన రూ.25 లక్షలు ఎమ్మెల్యే కోటా క్రింద ఇచ్చేవారు. తర్వాత దాన్ని రూ.1.0 కోటి చేస్తే , ఇన్‌ఛార్జ్ మంత్రి కోటా రూ.50 లక్షలు, ఎమ్మెల్యే కోటా రూ.50 లక్షలు ఉండేది. ఎమ్మెల్యే నిధులను

పెంచాలని గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరితే, ఇన్‌ఛార్జ్ మంత్రి కోటా లాంటిది ఏమీ లేకుండా నేరుగా ఎమ్మెల్యే సిడిఎఫ్ క్రింద రూ.3 కోట్లు చేస్తే, ఆనాడు ముఖ్యమంత్రి గారిని భోళా శంకరుడు అని పొగిడారు. కానీ ఈరోజు అదే పార్టీ నాయకులు మమ్మల్ని విమర్శించడం మంచిది కాదు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచింది. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని పెంచింది. తెలంగాణ ప్రజలు ఒకనాడు మేము చిన్న వాళ్లమని అనుకున్న స్థాయి నుంచి మేము కూడా పెద్ద వాళ్లమనే స్థాయికి పెంచింది. అన్నిటికంటె ముఖ్యంగా ఈ రాష్ట్రప్రభుత్వం మీద, రాష్ట్రముఖ్యమంత్రి మీద ప్రజలు ఎనలేని విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. ఈ రాష్ట్రం దేశంలోనే గొప్ప రాష్ట్రంగా ఎదిగే ఆస్కారమున్న రాష్ట్రంగా ఇప్పటికే పేరు వచ్చింది. రాబోవు కాలంలో కూడా ఒక గొప్ప రాష్ట్రంగా ఎదుగుదామని, దానికి మీరందరూ సహకరించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఎన్. రామచంద్రరావుః-** అధ్యక్షా, ఇప్పటి వరకు మామీద మంత్రిగారి దాడి బాగా జరిగింది. ముఖ్యమంత్రిగారు ఒక మాటన్నారు, అపోజిషన్ పార్టీలు కూడా కన్‌స్ట్రక్టివ్‌గా ఉండాలన్నారు. నిన్న నా బడ్జెటు ప్రసంగంలో చెప్పాను, we always try to play a constructive role అని ఇదే సభలో ఆన్ రికార్డు చెప్పాను. తప్పకుండా మేము కన్‌స్ట్రక్టివ్‌గా ఉంటాం. కానీ కొన్ని అనుమానాలున్నాయి.

రైతులకు ఇన్వెస్టుమెంటు సపోర్టు స్కీము అమలు చేస్తున్నామన్నారు. అది అపోజ్ చేసే విషయం కాదు. కానీ దాని అమలులోనే కొన్ని అనుమానాలున్నాయి. ఎందుకు అంటున్నామంటే - విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంటు సరిగా జరగడం లేదని చాలా ఫిర్యాదులు వస్తున్నాయి, దాని మూలంగా కొన్ని కాలేజీలు మూత పడ్డాయి. కళాశాలలు నిర్వహించే రాజేశ్వర్‌రెడ్డి గారు కూడా సభలోనే ఉన్నారు. రైతులకు సంబంధించి అటువంటి పరిస్థితి రాకూడదనే ఆవేదనతో ఆవిధంగా చెప్పడం జరిగిందే తప్ప దాన్ని మేము అపోజ్ చేయడం లేదు. తెలంగాణ రాష్ట్రం అర్బన్ ఓరియంటెడ్ అని మనం పదేపదే చెబుతున్నాం. మనకు హైదరాబాదు మరియు వరంగల్ రెండు ప్రధానమైన నగరాలు. ఈ రెండు నగరాలలో చాలా యాంబిషియస్‌గా ప్రాజెక్టులు టేకప్ చేస్తున్నారు, ఎస్ఆర్‌డిపి వంటి రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. వాటికి బడ్జెటు కేటాయింపులు పెంచి, జిహెచ్‌యంసికి ప్రభుత్వం సపోర్టు చేస్తే, ఈ రెండు సిటీలు బాగా అభివృద్ధి చెందుతాయని నేను భావిస్తున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్ః-** ఫీజు రీయింబర్స్‌మెంటు గురించి గౌరవ ముఖ్యమంత్రిగారు అనేకసార్లు క్లారిఫై చేశారు. ఒక సంవత్సరానికి సంబంధించిన ఫీజు తదుపరి సంవత్సరంలో ఇచ్చే సంప్రదాయం మనకున్నది. ఎందుకంటే ఒక కోర్సు అడ్మిషన్స్ జనవరిలో పూర్తి అవుతాయి, ఇంకొక కోర్సుకు అక్టోబరులో, మరి కొన్ని కోర్సులకు డిసెంబరులో అడ్మిషన్స్ పూర్తి అవుతాయి. అవన్నీ జమ అయి మనకు వచ్చేసరికి జనవరి వస్తుంది కాబట్టి ఆ సంప్రదాయంలో భాగంగా నెక్స్ట్ ఇయర్ పే చేసే ఆస్కారం ఉంటుంది. పోయిన సంవత్సరం రూ.2900 కోట్లు పే చేశాం, ఈ సంవత్సరం ఇప్పటికే రూ.2200 కోట్లు పే చేశాం. ప్రతి సంవత్సరం పే చేస్తున్నాం కాబట్టి వచ్చే సంవత్సరం కూడా అదే పద్ధతి ఫాలో అవుతాం.

రెండు - మేము రైతు రుణ మాఫీ ప్రకటించినపుడు ఆ శాసనసభలో కొంత మంది ఏమన్నారంటే - పైసలు చెట్లకు కాస్తాయా, కొత్త రాష్ట్రం, చెప్పింది చేస్తారా అని అన్నారు. కానీ నాలుగు సంవత్సరాల చరిత్ర చూసిన తర్వాత కూడా మీరు మమ్ములను ఈ ప్రశ్న వేయవచ్చా అని అడుగుతున్నాను. రుణ మాఫీకి సంబంధించి అనుకున్న టైములో ఇవ్వలేదా? రెండు నెలలు ఆలస్యం అయివుండొచ్చు కాని ఇచ్చాం. ఏదైనా స్కీమును మేము డిజైన్ చేస్తే అది ఎంత గొప్పగా అమలవుతోందో మీరు చూస్తున్నారు. దానికి సజీవ సాక్ష్యం కెసిఆర్ కిట్స్. ఈ ప్రభుత్వానికి ఎంత గొప్ప ఆలోచన ఉందంటే, అసలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అనే పద్ధతి కాకుండా, ఒక స్కీమును పక్కాగా ప్లాన్ చేయడం, తర్వాత ఏవిధంగా అమలవుతోందో మేము చెప్పనవసరం లేదు. ఈరోజు కొన్ని వందల స్కీములు ఒక్క ఆరోపణ లేకుండా అమలు చేసిన తర్వాత కూడా రైతాంగం విషయంలో నాలుగు వేల రూపాయల పెట్టుబడి స్కీము సరిగా అమలవుతుందా అనే అనుమానం మీకు ఉండనక్కర్లేదు. అన్ని స్కీములను సక్రమంగా అమలు చేసి ప్రజల హృదయాలను ఏవిధంగా దోచుకున్నామో, ఏవిధంగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నామో, తెలంగాణ ప్రభుత్వం చాలా గొప్పగా ఉందని ప్రజలు ఏదైతే కితాబు ఇస్తున్నారో, అదే విధంగా రైతాంగం విషయంలో కూడా నాలుగు వేల రూపాయల పెట్టుబడి స్కీమును గొప్పగా అమలు చేసి తప్పకుండా రైతాంగం హృదయాన్ని దోచుకుంటామనే విశ్వాసం మాకున్నది. అక్కడక్కడ కొంత మంది సో కాల్డ్ మేధావులు, సో కాల్డ్ పార్టీలు కావాలని విమర్శిస్తున్నారే తప్ప తెలంగాణ ప్రజా క్షేత్రంలో 90 శాతం ప్రజానీకం - తెలంగాణ

ప్రభుత్వం చాలా గొప్పగా ఉంది, టిఆర్‌యస్ పార్టీ అధికారంలోకి రాకపోతే ఏమయ్యేదో, ఈరోజు మనం టిఆర్‌యస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవడం మంచిదైంది, తెలంగాణ ప్రభుత్వం మాత్రమే ఇంత కమిట్‌మెంటుతో పని చేస్తోంది, రాబోవు కాలంలో కూడా ఈ ప్రభుత్వమే మనకి శ్రీరామ రక్ష అనే భావన ప్రజల్లో ఉంది.

SRI SYED AMINUL HASAN JAFRI:- The Finance Department is yet to release Rs. 266 Crores to the Minorities Welfare Department and the second demand that we have made is about the Old City package of Rs. 5000 Crores to be announced by the TRS Government. On these two issues I would like the Finance Minister to respond.

**శ్రీ ఈటల రాజేందర్‌ః–** సార్, గత సంవత్సరం మైనారిటీ డిపార్టుమెంటుకి రూ.842 కోట్లు ఖర్చు చేశాం. ఈ సంవత్సరం రూ.1200 కోట్లలో ఇప్పటికే రూ.967 కోట్లు ఖర్చు పెట్టాం. నాకు తెలిసి రేషియో ప్రకారం చూస్తే బ్రహ్మాండంగా ఖర్చు పెట్టాం. మామీద వారికి పూర్తి విశ్వాసం ఉంది, వాళ్ల నాయకుడు మొన్న సభలో కూడా చెప్పారు. ముస్లిం సమాజానికి సంబంధించి వీళ్లు కూడా ఉన్నారని పట్టించుకుని పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం - తెలంగాణ ప్రభుత్వం. గతంలో ఉన్న ప్రభుత్వాలు వాళ్లను ఓట్ల కోసం, రాజకీయ కోణంలో వాడుకున్నారే తప్ప వాళ్ల బతుకులు మార్చిన పాపాన పోలేదు.

جعفری بھائی آپ اطمینان رکھیے' سی ایم صاحب نے ہدایت دی کہ ہماری گورنمنٹ کو اچھا کام کرنا ہے' ہم ضرور کریں گے۔

**మిస్టర్ ఛైర్మన్‌ః–** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇచ్చిన అనుమతి మేరకు కాళేశ్వరం ప్రాజెక్టును 35 మంది ఎమ్మెల్సీలు విజిట్ చేసిన సందర్భంగా చేసిన ఏర్పాట్లకు సంబంధించి ఇరిగేషన్ శాఖామాత్యులు, అన్న హరీష్ రావు గారికి, సంబంధిత ఇంజినీర్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను కళ్లారా చూడాలనే ఉద్దేశ్యంతో ఆ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇప్పటికీ మేము అదే అభిప్రాయంతో ఉన్నాం. కళ్లున్న ప్రతి వాడు కాళేశ్వరం ప్రాజెక్టును నీళ్లు రాకముందే చూడాలి. అదొక ఇంజినీరింగ్ అద్భుతమన్నది మా భావన. మా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రిగారికి, మంత్రి హరీష్‌రావు గారికి ఈ సభ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆశ్చర్యమేమంటే – కాంగ్రెస్, ఎంఐఎం, బిజెపి సభ్యులు అధికార పార్టీతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడం జరిగింది. తొందర్లోనే మహబూబ్‌నగర్ మరియు ఖమ్మం జిల్లాలలో జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులను కూడా సందర్శించాలనే ఆలోచనతో ఉన్నాం. కాళేశ్వరం ప్రాజెక్టును చూడడానికి ఎమ్మెల్సీలకు సహకరించిన ప్రభుత్వానికి, అదే విధంగా మాతోబాటు వచ్చిన చాలా మంది సీనియర్ సభ్యులకు మరొకసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. త్వరలో ఖమ్మం మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులను కూడా సందర్శించాలన్నది మా కౌన్సిల్ నిర్ణయం. సభ్యులందరి కోరికమేరకు, రాష్ట్రముఖ్యమంత్రిగారు, సభా నాయకుడు ఈరోజు సభకి వచ్చినందుకు సభ పక్షాన వారికి ప్రత్యేకంగా మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. సెషన్ జరుగుతున్నప్పుడే గౌరవ ముఖ్యమంత్రి గారు కౌన్సిల్ ప్రాంగణమంతా కలియతిరుగుతూ ఎమ్మెల్సీల కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన సందర్భంగా తీసిన ఫోటోలను కూడా చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కౌన్సిల్ భవనానికి చిన్న చిన్న మార్పులు, చేర్పులు కూడా వారు సూచించడం జరిగింది. వారికి మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ, 2018, మార్చి 22, గురువారం ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశం అయ్యేందుకు సభను వాయిదా వేస్తున్నాను, థ్యాంక్యూ ఆల్.

(2018, మార్చి 22, గురువారం ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశం అయ్యేందుకు సభ మధ్యాహ్నం 1.30గంటలకు వాయిదా పడింది.)

* * *

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana  Legislative Council and Printed at  the Assembly Press, Public Gardens, Hyderabad.”**